సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 342

మంగళవారం 3-3-2020

'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

ఇక 'వివాద్ సే విశ్వాస్'..

మార్చి 31లోగా చెల్లిస్తే జరిమానాలుండవు

ఆపై క్షమాభిక్ష కూడా... – బిజినెస్‌లో

+786 నుంచి -511 వరకూ..

గతవారం నష్టాల నేపథ్యంలో వ్యాల్యూ బయింగ్.. – బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

● పార్లమెంటులో రచ్చ..

తోసేసుకున్నారు!

బడ్జెట్ సమావేశాల మలి దశ తొలి రోజే లోక్‌సభ దద్దరిల్లింది. ఢిల్లీ అల్లర్లపై అధికార, విపక్ష సభ్యులు ఒకరినొకరు తోసుకోవడంతో సభలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సభలో నెలకొన్న తోపులాటపై స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సభను నిర్వహించలేనంటూ అశక్తత వ్యక్తం చేశారు.

- 5లో

● వదిలేద్దాం అనుకుంటున్నా..

మోదీ సోషల్ సన్యాసం!

సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే ప్రధాని మోదీ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఆదివారం నుంచి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అనుకుంటున్నట్లు వెల్లడించారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌కు దూరంగా ఉండాలని యోచిస్తున్నట్లు ట్వీట్ చేశారు.

- 5లో

● మార్చి 8 మహిళా దినోత్సవం

శాస్త్ర శిఖరాలు

సైన్స్‌లో విశేష సేవలు చేసి ఎందరో బాలికలు ఆ రంగం వైపు అడుగుపెట్టేలా నిలిచిన 11 మంది శాస్త్రవేత్తలను గౌరవించుకునేందుకు వారి పేరున కేంద్ర ప్రభుత్వం అధ్యయన పీఠాలను స్థాపించనుంది. ఇది గత నూరేళ్ల కాలంలో స్త్రీలు శాస్త్రవేత్తలుగా చేసిన కృషికి ఒక సత్కారం. ఒక అభివాదం.

- ఫ్యామిలీలో

● మన రాత మారలేదు

'టెస్టు' ఫెయిల్...

బ్యాట్స్‌మెన్ వైఫల్యంతో న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టెస్టులోనూ భారత్ ఓడిపోయింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా 0-2తో కివీస్‌కు సమర్పించుకుంది. 3 రోజుల్లోనే ముగిసిన ఈ టెస్టులో భారత్ నిర్దేశించిన 132 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 36 ఓవర్లలోనే ఛేదించింది.

- స్పోర్ట్స్‌లో

పరీక్షలంటే భయమా!

అయితే సైకాలజిస్ట్‌కు ఫోన్ చేయండి

- నేటి నుంచి అందుబాటులోకి హెల్ప్‌లైన్ సెంటర్
- విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రాంచంద్రన్ వెల్లడి
- రేపట్నుంచి ఇంటర్ పరీక్షలు
- నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

సాక్షి, హైదరాబాద్

పరీక్షలంటే భయపడుతున్నారా? మీ భయాన్ని పోగొట్టేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు సైకాలజిస్టులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టింది. విద్యార్థులు సైకాలజిస్ట్ (7337225803 నంబర్)కు ఫోన్ చేసి తమ ఆందోళనను పోగొట్టుకునేలా ఏర్పాట్లు చేసింది. ఈ సదుపాయాన్ని మంగళవారం నుంచి అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టింది. ఇందులో మొదట ఒక సైకాలజిస్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. తర్వాత మరో ఐదుగురిని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. వీరంతా ఇప్పటినుంచి పరీక్షలు పూర్తయి, ఫలితాలు వెల్లడైన తర్వాత దాదాపు 2 నెలల పాటు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉండనున్నారు. ఈ నెల 4 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. సోమవారం బోర్డు కార్యాలయంలో విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చిత్రా రాంచంద్రన్, బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ పరీక్షల ఏర్పాట్లగురించి వివరించారు. ఈ సందర్భంగా చిత్రా రాంచంద్రన్ మాట్లాడారు. మంత్రి సబితా ఇంద్రారెడ్డి గొంతు సమస్య కారణంగా ఆమె చెప్పిన అంశాలను కూడా చిత్రా రాంచంద్రన్ వివరించారు. పరీక్షలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు.

15 నిమిషాలు గ్రేస్ పీరియడ్..

విద్యార్థులు 8.45 గంటలలోపు పరీక్ష హాల్లో ఉండాలని పేర్కొన్నారు. 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని, ప్రతి విద్యార్థి 9 గంటలలోపు పరీక్ష హాల్లో ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లో అనుమతించేది లేదన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటల కల్లా పరీక్ష కేంద్రంలో ఉండేలా చూసుకోవాలని, 8 గంటల నుంచే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. 'సెంటర్ లొకేటర్'యాప్ ఉపయోగించుకొని పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, వీలైనంత ముందుగా పరీక్షకు బయల్దేరాలని సూచించారు. పరీక్షలకు సంబంధించిన సమస్యలు, హాల్‌టికెట్లకు సంబంధించిన సమస్యలు తలెత్తితే విద్యార్థులు నివృత్తి చేసుకునేందుకు

మిగతా 2వ పేజీలో ▶

ఎంటర్ ద 'వైరస్'

రాష్ట్రంలో తొలి 'కోవిడ్' కేసు నమోదు

- దుబాయ్ వెళ్లొచ్చిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు సోకిన మహమ్మారి
- హైదరాబాద్ గాంధీ ఆస్పత్రిలో బాధితుడికి ప్రత్యేక చికిత్స
- అతడు కలసిన 80 మందికీ పరీక్షలు
- ఎవరూ భయపడొద్దని మంత్రి ఈటల రాజేందర్ సూచన

సాక్షి, హైదరాబాద్: ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కోవిడ్ మహమ్మారి మన రాష్ట్రంలోనూ ప్రవేశించింది. రాజధాని హైదరాబాద్‌లో తొలి కోవిడ్ కేసు నమోదైంది. దుబాయ్ నుంచి బెంగళూరు ద్వారా నగరానికి వచ్చిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు ఈ వైరస్ సోకినట్టు నిర్ధారణ అయింది. అయితే ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందొద్దని, ప్రభుత్వం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుందని, వైద్య ఆరోగ్యశాఖ ఇచ్చే సూచనలు, సలహాలను పాటించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ

మిగతా 2వ పేజీలో ▶

ఇవీ జాగ్రత్తలు

- జలుబు, దగ్గు, జ్వరం, ఛాతీలో నొప్పి, శ్వాస తీసుకోవడం ఇబ్బంది మొదలైన లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.
- జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మాస్క్‌లు/కర్చీఫ్‌లు కట్టుకోవాలి.
- చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కోవాలి.
- దూర ప్రయాణాల వాయిదా మంచిది.
- పెంపుడు జంతువులకు దూరంగా ఉండాలి.
- దగ్గు, జ్వరం ఉన్నవారికి దూరంగా ఉండాలి.
- అనుమానిత లక్షణాలుంటే 14 రోజుల వరకు ప్రత్యేక గదిలో నిద్రించాలి.
- ఏదైనా అనుమానం ఉంటే వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ 040-24651119కు కాల్ చేయాలి.

గాంధీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వార్డు

ఉరి మూడో సారీ?

నిర్భయ దోషుల ఉరితీత మళ్లీ వాయిదా

ఒక దోషి పవన్ గుప్తా క్షమాభిక్ష పిటిషన్ పెండింగ్‌లో ఉండటంతో ఢిల్లీ కోర్టు నిర్ణయం

నిప్పుతో చెలగాటం తగదని దోషి తరపు న్యాయవాదిపై కోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ

నిర్భయపై అత్యాచారం, హత్య కేసులో దోషుల ఉరిశిక్ష అమలు మూడోసారి కూడా వాయిదాపడింది. నలుగురు దోషుల్లో ఒకరైన పవన్ గుప్తా రాష్ట్రపతి ముందు పెట్టుకున్న క్షమాభిక్ష పిటిషన్ పరిశీలనలో ఉండడంతో తదుపరి ఆదేశాలిచ్చే వరకు ఉరిశిక్షను నిలిపివేయాలని ఢిల్లీ కోర్టు ఆదేశించింది. క్షమాభిక్ష ఒక ముఖ్యమైన రాజ్యాంగబద్ధ అవకాశం అని కోర్టు వ్యాఖ్యానించింది. నిజానికి, ట్రయల్ కోర్టు ఫిబ్రవరి 17న జారీ చేసిన డెత్ వారెంట్ ప్రకారం.. నిర్భయ దోషులు నలుగురినీ నేటి(మార్చి 3) ఉదయం ఆరు గంటలకు ఉరితీయాల్సి ఉంది. తాజా, ఆదేశాలతో ఆ ఉరిశిక్ష అమలు మరోసారి వాయిదా పడింది. రాష్ట్రపతి వద్ద క్షమాభిక్ష పిటిషన్ పరిశీలనలో ఉండగా మరణ శిక్ష విధించడం సరికాదని అదనపు సెషన్స్ జడ్జి జస్టిస్ ధర్మేంద్ర రానా స్పష్టం చేశారు. బాధితుల వైపునుంచి తీవ్రమైన ఒత్తిడి ఉన్నప్పటికీ.. ఏ దోషి అయినా తనకున్న అన్ని న్యాయపరమైన అవకాశాలనూ వినియోగించుకోకుండా ఆపకూడదని ఆయన పేర్కొన్నారు. క్షమాభిక్ష పిటిషన్ ఒక ముఖ్యమైన చట్టబద్ధ అవకాశం అనీ, అందుకే ఉరిని వాయిదా వేయడానికి తాను సంకోచించడం లేదన్నారు. మరణ శిక్షపై స్టే విధించాలన్న పవన్ గుప్తా చేసుకున్న విజ్ఞప్తిపై ఆదేశాలను రిజర్వులో ఉంచిన కోర్టు.. క్యూరేటివ్, మెర్సీ పిటిషన్లను ఆలస్యంగా దాఖలు చేయడంపై దోషి తరపు న్యాయవాది ఏపీ సింగ్‌పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. 'మీరు నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు. జాగ్రత్త' అని ఆయనపై మండిపడింది. ఎవరైనా తప్పు చేస్తే పరిణామాలెలా ఉంటాయో

మిగతా 2వ పేజీలో ▶

"ఇది వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తోంది. ఈ దేశంలో న్యాయం ఎలా ఆలస్యం అవుతోందో ప్రపంచమంతా గమనిస్తోంది. ఏం చేసినా దోషులకు ఉరిశిక్ష పడాల్సిందే."
- నిర్భయ తల్లి ఆశాదేవి

దివ్యాంగులకు ఉపాధి 150 రోజులు

సాక్షి, హైదరాబాద్: దివ్యాంగ కూలీలకు 150 రోజుల వరకు పనిదినాలు కల్పించాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ నిర్ణయించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద దివ్యాంగ కూలీలకు ప్రత్యేక జాబుకార్డులు జారీ చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ రఘునందన్‌రావు మార్గదర్శకాలు జారీ చేశారు. జాబుకార్డుగల దివ్యాంగులకు ఆర్థిక సంవత్సరంలో 150 రోజుల పనిదినాలు చూపాలన్నారు. దివ్యాంగ కూలీలతో కూడిన ప్రత్యేక శ్రమశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. శ్రమశక్తి సంఘాల ద్వారా పనిచేసిన దివ్యాంగులకు కేటాయించిన పనిలో 30 శాతం తక్కువ చేసినా సాధారణ కూలీలతో సమానంగా కూలీ చెల్లించనున్నట్లు పేర్కొన్నారు.

త్వరలోనే రుణమాఫీ ప్రక్రియ ప్రారంభం

- ఆర్థిక పరిమితులున్నా దృఢ సంకల్పంతో కేసీఆర్ నిర్ణయం
- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో భేటీలో మంత్రి కేటీఆర్ వెల్లడి

- వివరాలు 4లో

నాకింత కంటే మార్గం లేదు..

క్షమించు నాన్నా!

భార్యా పిల్లలతో ప్రదీప్ కుమార్ (ఫైల్)

- హైదరాబాద్‌లో భార్య, ఇద్దరు పిల్లలతో సహా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య
- మంచి ఉద్యోగం, ఆస్తులున్నా.. రూ.22 లక్షల అప్పుతో కలత
- డైరీలో తండ్రిని ఉద్దేశించి సూసైడ్ లేఖ రాసిన ప్రదీప్ కుమార్

హైదరాబాద్: ప్రదీప్ కుమార్ ఐబీఎంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. నెలకు రూ.70 వేల జీతం.. హస్తినాపురం సంతోషిమాత కాలనీలో జీప్లస్ వన్ ఇల్లు.. నెలకు అద్దె రూపేణా రూ.20 వేల ఆదాయం.. సొంత ఊళ్లో పదెకరాల భూమి.. భార్య, ఇద్దరు పిల్లలతో సాఫీగా సాగుతున్న ప్రయాణం..

ఉద్యోగమే కాదు సొంత కాళ్లపై నిలబడాలన్న తాపత్రయం.. భవిష్యత్‌లో పిల్లల జీవితం బాగుండాలనే ఉద్దేశంతో వ్యాపారాల్లో పెట్టుబడులు.. వరుస నష్టాలతో మిగిలిన రూ.22 లక్షల అప్పు..దీంతో జీవితంలో ఒక్కసారిగా కుదుపు.. నిజానికి తనకున్న ఆస్తులు, భూములు, ఉద్యోగం ముందు ఈ అప్పు దిగదుడుపే. కానీ తన కలలన్నీ కల్లలై కలతే చెందాడో.. ఎవరికీ చెప్పుకోలేని బాధతో మనస్తాపానికే గురయ్యాడో.. భార్య, ఇద్దరు పిల్లలకు పురుగుల మందు కలిపిన రాగి జావ ఇచ్చాడు. వారు ప్రాణాలు విడిచాక తానూ తనువు చాలించాడు. అంతకుముందు తండ్రిని ఉద్దేశించి లేఖ రాశాడు. ఎల్‌బీ నగర్‌లోని హస్తినాపురం సంతోషిమాత కాలనీలో ఆదివారం అర్ధరాత్రి దాటాక

మిగతా 2వ పేజీలో ▶

కుండకత్

ఎన్‌పీఆర్ ఒక ప్రత్యామ్నాయమే

పిల్‌పై విచారణ ముగించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) వినియోగదారుల గుర్తింపునకు సమర్పించాల్సిన పత్రాల్లో జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) చేర్చడాన్ని హైకోర్టు సమర్థించింది. ఓటరు గుర్తింపు, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ వంటి వాటితో పాటు ఎన్‌పీఆర్ చేర్చడం తప్పుకాదని హైకోర్టు స్పష్టంచేసింది. ఎన్‌పీఆర్‌ను చేర్చడాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది ఖాజా అయిజాజుద్దీన్ దాఖలు చేసిన పిల్‌ను సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం విచారించింది. గుర్తింపునకు ప్రత్యామ్నాయాల్లో ఎన్‌పీఆర్ ఒకటని, దీన్ని కచ్చితంగా సమర్పించాలని ఎస్‌బీఐ పేర్కొనలేదని స్పష్టం చేసిన ధర్మాసనం పిల్‌పై విచారణ ముగిసినట్లుగా ప్రకటించింది.

ప్రాణహిత ప్రాజెక్టు డీపీఆర్ సీడబ్ల్యూసీకి సమర్పించలేదు

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి రతన్ లాల్ కటారియా

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను తొలుత 2010లో సీడబ్ల్యూసీకి సమర్పించారని, తదుపరి ఈ ప్రాజెక్టును రెండు భాగాలుగా విభజించి 2017లో కాళేశ్వరం ప్రాజెక్టుకు డీపీఆర్ సమర్పించారని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. అయితే రెండో భాగమైన బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్‌ను ఇంకా సాంకేతిక, ఆర్థిక మదింపునకు సమర్పించలేదని ఆ శాఖ సహాయ మంత్రి రతన్‌లాల్ కటారియా తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా అంశంపై రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు సోమవారం ఆయన రాతపూర్వకంగా సమాధానం ఇచ్చారు. అలాగే జూన్ 2018లో కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.80,190 కోట్ల అంచనా వ్యయం అవుతుందని జల వనరుల శాఖ అడ్వయిజరీ కమిటీ ఆమోదించిందని వివరించారు. అయితే ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ప్రతిపాదనపై చేసిన సూచనలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసినట్లుగా వివరాలు సమర్పించలేదని చెప్పారు. చట్టబద్ధమైన అనుమతులు, ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్, స్కీమ్ మార్గదర్శకాలను సంతృప్తిపరచడం, నిధుల లభ్యత వంటి అనేక అంశాలు జాతీయ ప్రాజెక్టుగా గుర్తించడంలో పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

జాతీయ నీటి నాణ్యత సబ్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.700 కోట్లు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు జాతీయ నీటి నాణ్యత సబ్ మిషన్ (ఎన్‌డబ్ల్యూక్యూఎస్ఎం) కింద రూ.700 కోట్లు, నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు ఫ్లోరైడ్ ప్రభావిత రాష్ట్రాలకు ఇచ్చిన నిధుల్లో రాష్ట్రానికి రూ.94.58 కోట్లు ఇచ్చినట్లు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రతన్ లాల్ కటారియా తెలిపారు. సోమవారం ఆయన టీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ నల్లా నీరు ఇచ్చే పథకంలో భాగంగా ఆర్సెనిక్, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలున్న రాష్ట్రాలకు 10 శాతం వెయిటేజీ ఇచ్చి నిధులు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

ఆ ఫిర్యాదును ఐటీ, పోలీస్ విభాగానికి పంపే అవకాశం: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: 'బంగారు కూలీ'పేరుతో టీఆర్ఎస్ పార్టీ వ్యక్తులు, సంస్థల నుంచి సేకరించిన విరాళాలకు సంబంధించిన ఫిర్యాదుపై తగిన చర్యల కోసం ఆదాయ పన్ను శాఖ, పోలీసు యంత్రాంగానికి పంపించే అవకాశముందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ తెలిపారు. కాంగ్రెస్ ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి సోమవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు. 'కేంద్ర ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి అందించిన వివరాలిలా ఉన్నాయి. అప్పటి టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి, ఎంపీ గరికపాటి రామమోహన్‌రావుల నుంచి వచ్చిన లేఖలను 2018లో హైకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలించింది. ఆయా అంశాలను ఆదాయ పన్ను శాఖకు, పోలీస్ యంత్రాంగానికి ఇవ్వాలని ఎన్నికల సంఘం పిటిషనర్‌కు సూచించింది. రేవంత్‌రెడ్డి 2018 డిసెంబర్ 18, 31న తిరిగి ఇవే అంశాలను కేంద్ర ఎన్నికల సంఘం ముందు ప్రస్తావించారు. పిటిషనర్ కోరిన మేరకు ఈ ఫిర్యాదులను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డుకు కేంద్ర ఎన్నికల సంఘం పంపింది. అలాగే రేవంత్‌రెడ్డి నవంబర్ 20, 2019న మరోసారి లేఖ రాస్తూ తమ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తెలపాల్సిందిగా కోరారు. దీనిపై గత ఫిబ్రవరి 17న కేంద్ర ఎన్నికల సంఘం పిటిషనర్‌కు లేఖ రాస్తూ ఆయా అంశాలపై తగిన చర్యల కోసం పోలీసు యంత్రాంగానికి, ఆదాయ పన్ను శాఖకు పంపే అవకాశం ఉందని తెలిపింది'అని వివరించారు.

ట్రైనీ కానిస్టేబుళ్లకు స్వైన్‌ఫ్లూ!

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లో పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పొందుతున్న పలువురు అభ్యర్థులు స్వైన్‌ఫ్లూ బారిన పడ్డారని సమాచారం. రెండు మూడు రోజులుగా స్వైన్‌ఫ్లూ లక్షణాలతో బాధపడుతున్న దాదాపు 35 మంది హైదరాబాద్ నాంపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వచ్చారని, వారిలో ఒక్కరికి మాత్రం స్వైన్‌ఫ్లూ పాజిటివ్ అని తేలిందని అధికారులు తెలిపారు. కేవలం ఒక్కరు మాత్రమే తమ వద్ద స్వైన్‌ఫ్లూతో చికిత్స పొందుతున్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. నగరంలో కోవిడ్–19 పాజిటివ్ కేసు నమోదైన దరిమిలా.. పోలీస్ కానిస్టేబుళ్లకు స్వైన్‌ఫ్లూ రావడం కలకలం రేపుతోంది.

సోమవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎంపీ నామా నాగేశ్వరరావు, మంత్రి కొప్పుల ఈశ్వర్

నితిన్ గడ్కరీతో మంత్రి కొప్పుల ఈశ్వర్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో రాష్ట్ర సంక్షేమ శాఖల మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. మంత్రితో పాటు టీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు కూడా ఉన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం పరిధిలో 15 రహదారుల అభివృద్ధి ప్రతిపాదనలకు సంబంధించి రూ.120 కోట్ల మేర నిధులివ్వాలని కోరుతూ ఒక వినతిపత్రం ఇచ్చారు. సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్) గ్రాంటు కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే జగదల్‌పూర్–నిజామాబాద్ జాతీయ రహదారి–63కు సంబంధించి 7 కి.మీ. మేర రహదారిని నాలుగు వరుసల రహదారిగా విస్తరించాల్సి ఉందని, దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ఎంటర్ ద 'వైరస్'

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో శాంతికుమారి తదితరులు

▶ మొదటి పేజీ తరువాయి

మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. దేశంలో ఢిల్లీ, హైదరాబాద్‌లలో ఒక్కో కోవిడ్ పాజిటివ్ కేసు నమోదైందని సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని మహేంద్ర హిల్స్‌కు చెందిన 24 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కి వైరస్ సోకినట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. ''బెంగళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే ఆ యువకుడు కంపెనీ పని మీద గతనెల 15న దుబాయ్ వెళ్లి, అక్కడ హాంకాంగ్ ప్రతినిధులతో కలిసిమెలిసి ఉండడం వల్ల వైరస్ సోకినట్లు తేలింది. అనంతరం 20న దుబాయ్ నుంచి బెంగళూరు వచ్చి, ఓ రోజు ఆఫీసుకు కూడా వెళ్లాడు. 22న బెంగళూరు నుంచి బస్సులో హైదరాబాద్ వచ్చాడు. ఐదారు రోజులు ఇంట్లోనే ఉన్న తర్వాత దగ్గు, తుమ్ములతో సికింద్రాబాద్ అపోలో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నాడు. అపోలో సిబ్బందికి అనుమానం రావడంతో ఆదివారం గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. ముందుగా స్వైన్‌ఫ్లూ పరీక్ష చేశారు. అది కాదని తేలడంతో కోవిడ్ పరీక్ష చేశారు. అందులో పాజిటివ్ వచ్చింది. దీంతో మరోసారి నిర్ధారించేందుకు పుణేలోని వైరాలజీ సెంటర్‌కు నమూనాలు పంపించారు. అక్కడ కూడా అదే తేలింది. ప్రస్తుతం ఆ యువకుడికి గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేటెడ్ వార్డులో చికిత్స అందిస్తున్నాం. అపోలోలో ఆ యువకుడికి చికిత్స అందించిన 23 మంది వైద్య సిబ్బందితోపాటు ఆ యువకుడు బెంగళూరు నుంచి హైదరాబాద్ వచ్చిన బస్సులో ప్రయాణించిన మరో 27 మందిలో కొందరిని గుర్తించాం. మొత్తమ్మీద ఆ యువకుడు కలిసినవారిలో ఇప్పటివరకు మొత్తం 80 మందిని ట్రాక్ చేశాం''అని వివరించారు.

నేడు ఉపసంఘం భేటీ...

బాధిత యువకుడిని గాంధీ ఆస్పత్రిలోని ఐసోలేటెట్ గదిలో ఉంచి చికిత్స ఇవ్వాలని, ఇతరులకు వైరస్ సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించినట్టు ఈటల వెల్లడించారు. ఈ విషయంలో వైద్య ఆరోగ్యంపై ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం తగిన చర్యలు తీసుకోవాలంటూ ఆయన ఆదేశించినట్టు చెప్పారు. మంత్రులు కేటీఆర్, ఎర్రబెల్లి తదితరులున్న ఈ ఉపసంఘం మంగళవారం భేటీ అవుతుందన్నారు. అలాగే పురపాలక శాఖ అధికారులతో కూడా సమావేశాన్ని నిర్వహించి, తగిన చర్యలు చేపట్టాలని కేసీఆర్ సూచించినట్టు తెలిపారు. ప్రజలు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఈటల విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా జన సమ్మర్థం ఉన్న ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టంచేశారు. ''దేశంలోగానీ, మన రాష్ట్రంలో గానీ ఇక్కడ ఉన్నవారిలో ఇంత వరకు వైరస్ సోకలేదు. చైనా, ఇటలీ, హాంకాంగ్, ఇతర దేశాల నుంచి ఇన్‌ఫెక్ట్ అయి వస్తున్నారే తప్ప.. ఇక్కడి వారికి మాత్రం ఆ వైరస్ లేదు. ఇక్కడ ఉష్ణోగ్రత ఎక్కువగా, తేమ తక్కువగా ఉన్నందున కోవిడ్ విస్తరించే అవకాశాలు పెద్దగా లేవు. మన జీవన విధానాన్ని పరిశీలించినా వైరస్ సోకే అవకాశం లేదు. అయితే, ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలి. ఎవరికైనా జలుబు చేసినా, ముక్కు కారినా, జ్వరం వచ్చినా.. తక్షణమే వైద్యులను సంప్రదించాలి. తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి. జలుబు, జ్వరం వంటివి ఉన్నవారు బహిరంగంగా తుమ్మడం, దగ్గడం వంటివి చేయకూడదు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, ముక్కుకు రుమాలు అడ్డుగా పెట్టుకోవడం విధిగా చేయాలి. అన్ని స్థానిక, బోధనాసుపత్రులు, జిల్లాల్లోని పెద్దాసుపత్రుల్లో పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. హైదరాబాద్‌లోని గాంధీ, ఫీవర్, చెస్ట్ ఆస్పత్రుల్లో 40 పడకల చొప్పున ఐసోలేటెడ్ వార్డులను ఏర్పాటుచేశాం. పల్మనాలజిస్టులను కూడా నియమించాం. నిజానికి 100 శాతం మంది వ్యాధిగ్రస్తుల్లో 5 శాతం మందికే న్యూమోనియా వచ్చే ఆస్కారముంటుంది. ఇతర దేశాల నుంచి ఇన్‌ఫెక్ట్ అయి వచ్చినవారికి చికిత్స చేయడంతో ఎవరికీ ప్రాణాపాయం కలగలేదు. ఈ వైరస్‌తో చనిపోయిన సంఘటనలు మనదగ్గర లేవు. కేంద్రం కూడా వివిధ దేశాల నుంచి వచ్చిన అనుమానితులను ఐసోలేటెడ్ వార్డుల్లో పెట్టి చికిత్స ఇవ్వడంతో వారికి ముప్పు తప్పింది. హైదరాబాద్‌లోని మిలటరీ ఆస్పత్రిలోనూ 100 పడకల ఐసోలేటెడ్ వార్డు ఉంది''అని ఈటల వివరించారు.

వైరస్ విస్తరించకుండా పకడ్బందీ చర్యలు...

కోవిడ్ వైరస్ సోకిన యువకుడు ఏ బస్సులో ప్రయాణించాడు? ఏ కంపెనీలో పని చేస్తున్నాడు? ఆయనతో కలిసిమెలిసి ఉన్నవారెవరు అన్న వివరాలన్నింటినీ గుర్తించినట్టు మంత్రి తెలిపారు. వాళ్లకు కూడా పరీక్షలు చేస్తున్నట్టు వెల్లడించారు. అలాగే ఆ యువకుడు పనిచేసిన బెంగళూరు కంపెనీకి కూడా సమాచారం ఇచ్చినట్టు చెప్పారు. వైరస్ విస్తరించకుండా ఉండడానికి అన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న ఆ యువకుడి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని, త్వరలోనే నయం అవుతుందని చెప్పారు. డాక్టర్లు, స్పెషలిస్టులు, ల్యాబ్ వంటి అన్ని ఏర్పాట్లు ఉండటంతో గాంధీ ఆస్పత్రిలోనే బాధితుడికి చికిత్స ఇస్తున్నట్టు వివరించారు. ఐసోలేటెడ్ వార్డు దరిదాపుల్లోకి ఎవరూ వెళ్లరని, దాంతో ఎవరికీ ఎలాంటి సంబంధం ఉండదని, అందువల్ల ఇతరులకు వైరస్ సోకే ప్రమాదం ఉండదని స్పష్టంచేశారు. ఆ యువకుడు ప్రయాణించిన బస్సులో ఉన్న 27 మందికీ వైరస్ ఉన్నట్టు భావించొద్దన్నారు. అతడి కుటుంబ సభ్యులను కూడా కలిశామని, వారందరినీ ఐసోలేషన్‌లో ఉంచామని తెలిపారు. రాష్ట్రంలో మాస్కుల కొరత లేదని, ఇంకా అవసరమైన మేరకు ఆర్డర్లు ఇచ్చామని మంత్రి వెల్లడించారు. వైరస్‌ను ఎదుర్కొనేందుకు అవసరమైతే ప్రత్యేక నిధిని తీసుకోవాలని సీఎం చెప్పారన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రోగులను 14 రోజుల పాటు వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో ఉంచి చికిత్స అందిస్తామని వివరించారు. మీడియా సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, హైదరాబాద్ కలెక్టర్ శ్వేతా మహంతి, ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ యోగితా రాణా, వైద్య విద్య సంచాలకుడు రమేశ్‌రెడ్డి, ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ గడల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉరి మూడో సారీ

▶ మొదటి పేజీ తరువాయి

మీకు తెలుసనే అనుకుంటున్నామని హెచ్చరించింది. విచారణ మంగళవారం కొనసాగుతుందని తెలిపింది. కాగా, పవన్ గుప్తా క్యూరేటివ్ పిటిషన్‌ని సైతం సుప్రీంకోర్టు తిరస్కరించింది. మరణ శిక్షపై స్టే విధించాలని కోరుతూ అక్షయ్ కుమార్, పవన్ గుప్తాలు దాఖలుచేసుకున్న పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. ముకేశ్ కుమార్ సింగ్, వినయ్ కుమార్ శర్మ, అక్షయ్ కుమార్‌ల క్షమాభిక్ష పిటిషన్లను ఇప్పటికే రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తిరస్కరించారు. రాష్ట్రపతి క్షమాభిక్ష పిటిషన్‌లను తిరస్కరణను సవాల్ చేస్తూ ముకేశ్, వినయ్ కుమార్‌లు విడివిడిగా దాఖలు చేసుకున్న పిటిషన్‌లను సైతం సుప్రీంకోర్టు గతంలో కోర్టు తోసిపుచ్చింది. అయితే అక్షయ్ కుమార్ మాత్రం తన క్షమాభిక్ష పిటిషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టుకి వెళ్లలేదు.

వ్యవస్థ వైఫల్యం: నిర్భయ తల్లి

నిర్భయ కేసులో దోషులకు ఉరిశిక్ష మరోమారు వాయిదాపడడంపై నిర్భయ తల్లి ఆశాదేవి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది వ్యవస్థ వైఫల్యాన్ని సూచిస్తోందనీ, ఈ దేశంలో న్యాయం ఎలా ఆలస్యం అవుతోందో ప్రపంచమంతా గమనిస్తోందనీ ఆమె వ్యాఖ్యానించారు. రోజు రోజుకీ విశ్వాసాన్ని కోల్పోతున్నా ననీ, అయినా గట్టిగా నిలబడతాననీ, దోషులకు ఉరిశిక్ష పడాల్సిందేనని తేల్చి చెప్పారు. కోర్టులు మాత్రం చోద్యం చూస్తూ కూర్చుంటున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

ఎవరీ ఏపీ సింగ్?

నిర్భయ హత్యాచారం కేసులో ఇద్దరు దోషులు అక్షయ్ సింగ్, పవన్ గుప్తాల తరపున వాదిస్తోన్న న్యాయవాది ఏపీ సింగ్ చర్చనీయాంశంగా మారారు. చట్టంలోని అవకాశాలను ఉపయోగించుకుని, పదేపదే ఉరిశిక్షను వాయిదా వేయిస్తున్నందుకు ఆయన వార్తల్లో వ్యక్తిగా ఉన్నారు. నిర్భయపై అత్యాచారం జరగడానికి ఆమె వేసుకున్న దుస్తులూ, ఆమె జీవన విధానం కారణమని ఆయన గతంలో లింగ వివక్షతో కూడిన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'నా కూతురు ఇలా పెళ్ళికి ముందు బాయ్ ఫ్రెండ్‌తో తిరుగుతుంటే సజీవంగా దహనం చేసేవాడిని. ఇలాంటి ఘటన జరగనిచ్చేవాడిని కాదు' అని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

ఆ 80 మందీ ఎంతమందిని కలిశారో?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కోవిడ్ వ్యాప్తిపై కలకలం రేగుతోంది. సర్కారు వెల్లడించిన లెక్కల ప్రకారమే బాధితుడు 80 మందిని కలిసినట్టు తేలింది. అయితే వారు ఎంతమందిని కలిసి ఉంటారో అన్న ప్రశ్న ఇప్పుడు అందరినీ వేధిస్తోంది. కోవిడ్ సోకినట్టు తేలిన వ్యక్తి గత నెల 22న బెంగళూరు నుంచి బస్సులో హైదరాబాద్ వచ్చాడు. ఆ బస్సులో అతడితోపాటు ప్రయాణించిన 27 మంది ఇప్పటికే వందల మందిని కలిసి ఉంటారని అనుమానిస్తున్నారు. అలాగే బాధితుడు హైదరాబాద్‌లో 9 రోజులపాటు తిరిగాడు. అతడు చికిత్స చేయించుకున్న అపోలో ఆస్పత్రిలో 23 మందిని గుర్తించారు. వీరు కాకుండా అతడు ఇంకా ఎవరెవరిని కలిశాడు అనేదానిపై అధికారులు ఆరా తీస్తున్నారు. అయితే అందరినీ ట్రేస్ చేయడం కష్టసాధ్యమని చెబుతున్నారు. ఇప్పటివరకు మన దేశంలో ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకలేదు. అయినప్పటికీ బాధితుడు ఎక్కువ మందిని కలవడం అధికారులను కలవరపెడుతోంది. బాధితుడు నేరుగా కలిసిన వారికి మాత్రమే వైరస్ విస్తరించే అవకాశం ఉంటుందని డాక్టర్లు చెబుతున్నారు. ఇందులోనూ రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే వృద్ధులు, చిన్న పిల్లలకు వైరస్ త్వరగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంటుంది. ఇతర దేశాల నుంచి వచ్చి.. జలుబు, దగ్గుతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చినవారిని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రులకు పంపించాలని ప్రైవేటు హాస్పిటళ్లకు సూచించినట్టు ఆరోగ్యశాఖ చెబుతుండగా, ఆ ప్రకారం వారు వ్యవహరించడంలేదనే చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కోవిడ్ సోకిన యువకుడికి నిపుణులైన డాక్టర్లు, శిక్షణ పొందిన నర్సులు చికిత్స అందిస్తున్నారు. కేరళలో ఈ వైరస్ సోకిన ముగ్గురు వ్యక్తులకు అక్కడి వైద్యులు చేసిన చికిత్సతో పూర్తిగా నయమైంది. దీంతో గాంధీ ఆస్పత్రిలో ఉన్న బాధితుడికి ఇవ్వాల్సిన చికిత్సపై కేరళ డాక్టర్లను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ సంప్రదించింది. అలాగే కోవిడ్ బాధితులకు చేయాల్సిన చికిత్సా విధానాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసింది. కోవిడ్ కూడా స్వైన్‌ఫ్లూ తరహాలోనే శ్వాస వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. దీంతో ఫ్లూ నివారణకు అనుసరించే విధానంలోనే ఈ బాధితుడికి చికిత్స చేయనున్నట్టు డాక్టర్లు చెబుతున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ వైరస్ సోకకుండా కాపాడుకోవచ్చని డాక్టర్లు పేర్కొంటున్నారు. కాగా, ఇప్పటివరకు హైదరాబాద్ విమానాశ్రయంలో వివిధ దేశాల నుంచి వచ్చిన వారిలో 17,662 మందికి కోవిడ్ థర్మల్ స్క్రీనింగ్ చేశారు. 272 మందిని ఇంట్లోనే ఒంటరిగా ఉండాలని సూచించారు. ఇప్పటివరకు 112 మందిని పరీక్షించగా, ఒకరికి మినహా అందరికీ నెగిటివ్ వచ్చింది.

ఇవీ కోవిడ్ లక్షణాలు...

జ్వరం, అలసట, పొడి దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది కోవిడ్ సాధారణ లక్షణాలు. గొంతునొప్పి, అతిసారం, వాంతులు వంటి లక్షణాలు 20 శాతం కేసులలో కనిపిస్తాయి. చైనా వైద్య ఆరోగ్యశాఖ అంచనా ప్రకారం ఇటువంటి లక్షణాల్లో 81 శాతం కేసులు తేలికపాటివి, 14 శాతం మందికి ఆస్పత్రి అవసరం ఉంటుంది. 5 శాతం మందికి వెంటిలేటర్ లేదా క్లిష్టమైన సంరక్షణ నిర్వహణ చర్యలు అవసరం. కోవిడ్ లక్షణాలు రెండు నుంచి 14 రోజుల్లో బయటపడతాయి. శ్వాసకోశ స్రావాల ద్వారా ఇది ఇతరులకు సోకుతుంది. దగ్గు లేదా తుమ్ము నుంచి వచ్చే బిందువుల ద్వారా నేరుగా.. కలుషితమైన వస్తువులు, దగ్గరి పరిచయాల ద్వారా పరోక్షంగా ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.

పరీక్షలంటే భయమా..?

▶ మొదటి పేజీ తరువాయి

బోర్డు కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, 040–24600110, 040–24732369 ఫోన్ నంబర్లలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సంప్రదించవచ్చని, జిల్లా కేంద్రాల్లోనూ కంట్రోల్ రూంలు ఏర్పాటు చేశామన్నారు. మెయిల్ ద్వారా కూడా (**helpdesk_ie@telangana.gov.in**) సంప్రదించొచ్చన్నారు. అయినా సమాధానం దొరక్కపోయినా, సంతృప్తి చెందకపోయినా విద్యార్థులు ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయొచ్చని, ఇందుకు బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టం వెబ్‌సైట్‌ను (**bigrs.telangana.gov.in**) అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రత్యేకంగా విద్యార్థుల సౌలభ్యం కోసం ఈసారి వెబ్‌సైట్ (tsbie.cgg. gov.in) నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేలా వెసులుబాటు కల్పించామని చెప్పారు. ఇప్పటివరకు దాదాపు 4 లక్షల మంది హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. హాల్‌టికెట్లపై ఎవరి సంతకం అవసరం లేదన్నారు. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లతో నేరుగా పరీక్షలకు హాజరు కావొచ్చని, చీఫ్ సూపరింటెండెంట్లు విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని ఆదేశించారు.

2,500 మంది స్టూడెంట్ కౌన్సెలర్లు..

పరీక్షల విషయంలో ఆందోళన చెందొద్దని, ప్రతి కాలేజీలో స్టూడెంట్ కౌన్సెలర్లు (మొత్తం 2,500 మంది) ఉన్నారని, వారి సహకారం తీసుకోవాలన్నారు. హాల్‌టికెట్లలో పొరపాట్లు ఉంటే వెంటనే ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఓఎంఆర్ షీట్‌లోని విద్యార్థుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని, పొరపాటేమైనా ఉంటే ఎగ్జామినర్ దృష్టికి, చీఫ్‌సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకువెళ్లవద్దని, పరీక్ష విధుల్లో ఉన్న అధికారులు, ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లు తీసుకెళ్లొద్దన్నారు. బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ మాట్లాడుతూ.. పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రాసెస్‌లో సీజీజీ సహకారం తీసుకున్నామని చెప్పారు. ప్రతి సెంటర్‌లో నాలుగు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వాటి నిఘాలోనే ప్రశ్నపత్రాల బండిల్ ఓపెన్ చేస్తారన్నారు. గతంలో జవాబు పత్రాల కరెక్షన్‌లో తప్పులు చేసిన వారికి జరిమానా విధించామని, ఈసారి వారికి డ్యూటీలు వేయలేదన్నారు. పరీక్షలకు హాజరయ్యే బాలికలను తనిఖీ చేసేందుకు మహిళా సిబ్బందిని నియమించామని, బురఖా ధరించే వారిని ప్రత్యేక గదిలో మహిళలే తనిఖీ చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. సీజీజీ డైరెక్టర్ రాజేంద్ర నిమ్జే మాట్లాడుతూ.. ఈసారి పరీక్షల్లో ఓఎంఆర్, ఐసీఆర్ టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు తెలిపారు. సెంటర్ లొకేటర్ యాప్ ద్వారా ఫిర్యాదు చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు.

పరీక్షలకు సంబంధించిన వివరాలు..

పరీక్ష కేంద్రాలు	1,339
చీఫ్ సూపరింటెండెంట్లు	1,339 మంది
డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు	1,339 మంది
ఇన్విజిలేటర్లు	26,964 మంది
ఫ్లయింగ్ స్క్వాడ్స్	75 మంది
సిట్టింగ్ స్క్వాడ్స్	150 మంది
కస్టోడియన్స్	450 మంది

విద్యార్థుల వివరాలు..

కేటగిరీ	మొత్తం	బాలురు	బాలికలు
ఫస్టియర్	4,80,531	2,36,430	2,44,101
సెకండియర్	4,85,345	2,46,378	2,38,966
మొత్తం	9,65,875	4,82,808	4,83,067

ఫస్టియర్‌లో..

కేటగిరీ	బాలురు	బాలికలు	మొత్తం
జనరల్	2,10,470	2,20,865	4,31,335
వొకేషనల్	25,960	23,238	49,196

సెకండియర్‌లో..

కేటగిరీ	బాలురు	బాలికలు	మొత్తం
రెగ్యులర్–జనరల్	1,78,843	1,95,616	3,74

కంది కొనుగోళ్లపై

ఆంక్షలు పెట్టకండి

మంత్రి నిరంజన్‌కు కాంగ్రెస్ నేతల వినతి

సాక్షి, హైదరాబాద్: కంది పంట కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర రైతాంగం చాలా ఇబ్బందులు పడుతోందని, కందుల కొనుగోళ్లపై ఆంక్షలు సడలించాలని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఏఐసీసీ కార్యదర్శి ఎస్. సంపత్‌కుమార్, ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్‌చైర్మన్ ఎం.కోదండరెడ్డి సోమవారం హాకాభవన్‌లో రాష్ట్ర వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డిని కలసి విజ్ఞప్తి చేశారు. కందులు పండించిన రైతు తన పంటను అమ్ముకునేందుకు తాను రైతునని నిరూపించుకోవాల్సి వస్తోందని, అధికారుల అత్యుత్సాహం కారణంగా రైతు నష్టపోతున్నాడని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మంత్రి నిరంజన్, కందుల కొనుగోళ్లలో ఆంక్షలు ఎత్తేయాలని అక్కడే ఉన్న వ్యవసాయ శాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డికి సూచించారు. ఈ మేరకు జిల్లా అధికారులకు ఆదేశాలిస్తామని కాంగ్రెస్ నేతలకు హామీ ఇచ్చారు. తమ విజ్ఞప్తికి స్పందించి వెంటనే ఆదేశాలిచ్చిన మంత్రి నిరంజన్‌కు కాంగ్రెస్ నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్‌పై ఉన్న ధ్యాస... రైతుపై లేదా: సంపత్

అంతకుముందు గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కందిరైతులు రోడ్ల మీదకు వచ్చి ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాని పట్టడం లేదని విమర్శించారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి గురవుతోందని, పండించిన పంటను అమ్ముకునేందుకు కూడా రైతులు నానా గోస పడాల్సి వస్తోందని చెప్పారు. టమాటా రైతు కూడా మద్దతు ధర అందక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో వ్యవసాయ పనిముట్లపై ఇచ్చిన సబ్సిడీని కేసీఆర్ ప్రభుత్వం ఎత్తివేసిందని, కమీషన్లు వస్తాయని ట్రాక్టర్ల పంపిణీపై దృష్టి పెట్టిందని ఆరోపించారు. రైతు సమస్యలపై కనీసం ట్విట్టర్‌లో అయినా స్పందిస్తాడేమోనని మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్ ద్వారా చెప్పినా పట్టించుకోలేదని, మంత్రి ఈటల, ఎంపీ రంజిత్‌రెడ్డి కోసం చికెన్ కొనుగోళ్లు పడిపోకుండా స్పందించిన కేటీఆర్‌కు రైతుల సమస్యలు ఎందుకు పట్టడం లేదని ప్రశ్నించారు. వెంటనే కంది, టమాటా రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పర్యావరణంపై 3 వారాల శిక్షణ

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం పర్యావరణ సుస్థిరత అనేది ప్రధాన అంశంగా ముందుకు వస్తోందని, ఇది వివిధ దేశాలకు విధానపరమైన సవాళ్లను విసురుతోందని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ సి.పార్థసారథి అన్నారు. ఈ అంశంతో ముడిపడిన పర్యావరణ యాజమాన్య పద్ధతులకు సంబంధించి పలు విషయాలపై 3 వారాల పాటు ఇస్తున్న శిక్షణ ఎంతో ఉపకరిస్తుందన్నారు. సోమవారం విదేశాంగశాఖ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని పార్థసారథి ప్రారంభించారు.

ఐటీ.. సిటీ మేటి

సాక్షి, హైదరాబాద్: ఐటీ కంపెనీలు గ్రేటర్ హైదరాబాద్‌కు జైకొడుతున్నాయి. మహా నగర శివారు ప్రాంతాలు ఈ కంపెనీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారనున్నాయి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు వీలుగా ప్రభుత్వం టీఎస్ ఐపాస్, హార్డ్‌వేర్, ఐటీ పాలసీలను ప్రవేశపెట్టడంతో మూడేళ్లుగా ఐటీ, హార్డ్‌వేర్ కంపెనీలతోపాటు తయారీ, ఏరోస్పేస్, ఫార్మా రంగాల్లో దిగ్గజ పరిశ్రమలు వందలాదిగా నగర శివార్లకు తరలి వస్తున్నాయి. పరిశ్రమల శాఖ వర్గాల ప్రకారం.. గడిచిన ఆరు నెలల్లో నగరంలో పరిశ్రమల ఏర్పాటుకు మొత్తంగా



- గ్రేటర్ శివార్లకు ఐటీ కంపెనీల వెల్లువ
- వచ్చే రెండేళ్లలో 55 కొత్త కంపెనీల ఏర్పాటు

గ్రేటర్ నుంచి ఐటీ ఎగుమతుల్లో పెరుగుదల (రూ. కోట్లలో)

సంవత్సరం	ఐటీ ఎగుమతులు
2013-14	57,258
2014-15	65,235
2015-16	75,070
2016-17	85,470
2017-18	93,422
2018-19	96,000
2020	1,20,000 (అంచనా)

255 దరఖాస్తులు అందాయి. వీటిలో 60 తయారీరంగం, 80 ప్లాస్టిక్, 40 ఏరోస్పేస్ విడిభాగాలు, 20 ఫార్మా కంపెనీలున్నాయి. ఇవికాక ఐటీ సంబంధ కంపెనీలు 55 వరకు ఉన్నాయి. ఇవన్నీ నగర శివార్లలోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, మహేశ్వరం, బుద్వేల్‌లో పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నాయి. వచ్చే రెండేళ్లలో వీటి ఏర్పాటు ద్వారా రూ.18,400 కోట్ల పెట్టుబడులు వస్తాయని, 50వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా.

2015 నుంచి ఐటీ వెల్లువ..

నూతన పరిశ్రమల ఏర్పాటు, పెట్టుబడుల ప్రవాహానికి దారులు వేయడం, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీఎస్ ఐపాస్‌కు విశేష స్పందన లభిస్తోంది. ప్రధానంగా 2015 నుంచి గ్రేటర్ శివారు ప్రాంతాల్లో వివిధ రకాల కంపెనీల ఏర్పాటుకు దాదాపు 800 దరఖాస్తులు అందగా, 478 పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుతో రూ.28,000 కోట్ల పెట్టుబడులు నగరానికి తరలివచ్చాయని పరిశ్రమల శాఖ వర్గాలు తెలిపాయి. ఆయా కంపెనీల్లో 3.29 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కాయి. రాబోయే రెండు మూడేళ్లలో మిగతా పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి.

ఇబ్బడిముబ్బడిగా ఉపాధి..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం గ్రేటర్ నగరంలో సుమారు వంద చిన్న, పెద్ద ఐటీ కంపెనీలు ఏర్పాటయ్యాయి. ఇవన్నీ ప్రధానంగా శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, హైటెక్‌సిటీ పరిసరాలకే పరిమితమయ్యాయి. వీటి ద్వారా 50 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించినట్లు ఐటీ శాఖ వర్గాలు తెలిపాయి. గ్రేటర్ కేంద్రంగా ఇప్పటికే బహుళ జాతి, దేశీయ దిగ్గజ సంస్థలకు చెందిన 647 ఐటీ కంపెనీల శాఖలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వీటిలో సుమారు 6 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు.

అంతా అనుకూలమే..

టీఎస్ ఐపాస్ కింద దరఖాస్తు చేసుకున్న కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. విస్తరణలో భాగంగా ఇవన్నీ మరిన్ని బ్రాంచీలను ఏర్పాటు చేస్తాయని ఐటీ శాఖ అధికారులు తెలిపారు. నగరంలో విశిష్ట భౌగోళిక వాతావరణ పరిస్థితులు, నైపుణ్యంగల ఐటీ నిపుణులు అందుబాటులో ఉండటంతో చాలా కంపెనీలు ఇక్కడ కంపెనీల ఏర్పాటుకు మక్కువ చూపుతున్నాయి.

యాసంగి అంచనా.. 77.73 లక్షల టన్నులు

అందుకు తగ్గట్లే పకడ్బందీ ఏర్పాట్లు చేయండి

- పౌర సరఫరాల శాఖ అధికారులకు మంత్రివర్గ ఉపసంఘం ఆదేశాలు
- నిల్వ సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

సాక్షి, హైదరాబాద్ : ఈ ఏడాది యాసంగి సీజన్‌లో వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 77.73 లక్షల టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని, ఈ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ఏప్రిల్ ఒకటి నుంచి ఆరంభమయ్యే కొనుగోళ్లకు అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని సూచించింది. 2019-20 యాసంగి కార్యాచరణపై సోమవారం హాకా భవన్‌లో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్, పౌరసరఫరాల సంస్థ చైర్మన్ మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సమీక్షించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి జనార్దన్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ కమిషనర్ పి.సత్యనారాయణ రెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయ్, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాల ఏర్పాటు, గన్నీ సంచులు, స్టోరేజ్ సదుపాయం, రవాణా తదితర అంశాలపై ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ చర్యలు, ముఖ్యంగా కాళేశ్వరం నీటి రాకతో ప్రతీ ఎకరా సాగులోకి వస్తుండటంతో సాగు విస్తీర్ణం పెరిగిందని, గత ఏడాది యాసంగిలో పౌరసరఫరాలశాఖ 37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈ ఏడాది రెండింతలు అదనంగా కొనుగోళ్లు ఉంటాయని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు ముఖ్యంగా పౌరసరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రులు సూచించారు. ధాన్యం నాణ్యతపై గత ఖరీఫ్‌లో చాలా ఫిర్యాదులు వచ్చాయని, రైతులు యంత్రాల కటింగ్‌తో నేరుగా ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావడంతో నాణ్యతా సమస్యలు ఎదురవుతున్నాయని అధికారులు మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రతి కొనుగోలు కేంద్రంలో తప్పనిసరిగా తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, విన్నోవింగ్ మెషీన్లు, టార్పాలిన్లు ఏర్పాట్లు చేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.ధాన్యం కొనుగోలుకు సంబంధించి పౌరసరఫరాల సంస్థ చెల్లిస్తున్న మార్కెట్ ఫీజు నుంచి ఇందుకు అవసరమైన నిధులు సమకూర్చుకోవాలని సూచించారు.

నిల్వ సమస్య రానీయొద్దు...

భారీగా ధాన్యం దిగుబడి అయ్యే నేపథ్యంలో గోదాముల్లో నిల్వ సమస్యపై ప్రధానంగా దృష్టి సారించాలని మంత్రులు సూచించారు. ముఖ్యంగా రాష్ట్ర, కేంద్ర గిడ్డంగుల సంస్థలతో పాటు కేంద్ర ఆహార సంస్థ,, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి స్టోరేజ్ సమస్యలు రాకుండా చూడాలన్నారు.నిరుపయోగంగా ఉన్న గోదాములను వాడుకలోకి తీసుకురావాలన్నారు. రైస్ మిల్లర్లకు చెల్లించే అదనపు మిల్లింగ్ చార్జీలపై కూడా సమావేశంలో చర్చించారు. ఇక ఇతర రాష్ట్రాల నుంచి రాష్ట్రంలోకి దళారులు ధాన్యం తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా రాష్ట్ర సరిహద్దుల్లో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

సోమవారం హైదరాబాద్‌లో మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఈటల రాజేందర్, గంగుల కమలాకర్

గొర్రెల పంపిణీ వెంటనే చేపట్టాలి

పశుసంవర్ధక కార్యాలయం ముందు జీఎంపీఎస్ ధర్నా

సాక్షి, హైదరాబాద్

రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం దార్ల సంఘం (జీఎంపీఎస్) ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గొ'ర్రెల పంపిణీ కోసం 7.29లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేసి మూడేళ్లవుతున్నా ఇప్పటివరకు 3.65లక్షల మందికి మాత్రమే పంపిణీ చేశారని చెప్పారు. గొర్రెలు వస్తాయనే ఆశతో రాష్ట్ర వ్యాప్తంగా గొల్ల కురుమలు అప్పులు చేసి డీడీలు కట్టి 18నెలలుగా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు హడావుడి చేసిన ప్రభుత్వం ఆ తర్వాత గొర్రెల పంపిణీని పక్కనపెట్టిందని, అసెంబ్లీ సాక్షిగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పినా గొర్రెల పంపిణీ జరగలేదని అన్నారు. పంపిణీ చేసిన వాటికి మేత లేదని, ఇన్సూరెన్స్ పరిహారం ఇంతవరకు ఇవ్వలేదని, గొర్రెల పంపిణీలో అవినీతికి పాల్పడిన అధికారులకు పదోన్నతులిచ్చి, గొర్రెలు అమ్ముకున్నారనే నెపంతో కురుమలను జైల్లో పెట్టారని ఆరోపించారు. వెంటనే రెండో విడత పంపిణీని చేపట్టాలని, లేదంటే ప్రగతిభవన్‌తో పాటు మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కాగా, ఆందోళన చేస్తున్న జీఎంపీఎస్ సభ్యులను పోలీసులు అదుపులోనికి తీసుకుని గోషామహల్ పీఎస్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు కిల్లె గోపాల్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

"ఈ పాలసీలో, పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి రిస్క్‌ను పాలసీ హోల్డరు భరించవలసి ఉంటుంది"
Sabse Pehle Life Insurance
ఆన్‌లైన్‌లో కూడా లభించును
ఒక SIIP - రెండు ప్రయోజనాలు
పొదుపూ ఉంది : రక్షణా ఉంది

LIC's SIIP
Plan No: 852 UIN 512L334V01
యూనిట్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్

ఎంపికకు స్వేచ్ఛ :
పొదుపు మొత్తం : మీ పొదుపు నెలవారీగా రూ. 4,000/- లేదా సంవత్సరం వారీగా రూ. 40000/- నుంచి ప్రారంభించవచ్చును మరియు మీ విస్తృత జీవిత లక్ష్యాల కోసం అధిక మొత్తంలో పొదుపు చేయవచ్చు.
4 ఫండ్ ఆప్షన్స్ : బాండ్, సెక్యూర్డ్, బ్యాలన్స్‌డ్ మరియు గ్రోత్ ఫండ్స్ నుంచి ఎంపిక చేసుకోవచ్చును.
రుసుములు లేకుండా మార్చుకోండి : గరిష్టంగా రాబడులు పొందేందుకు సంవత్సరంలో ఎలాంటి రుసుములు లేకుండా నాలుగు సార్లు ఫండ్ ఆప్షన్స్ మధ్య మీ సొమ్మును మార్చుకోవచ్చును.
మీకు అవసరమైనప్పుడు ఉపసంహరించుకోండి : 5 సంవత్సరాల తర్వాత నుంచి మీరు పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చును.*

పాలసీ ప్రయోజనాలు :
- లైఫ్ రిస్క్ కవర్ లభించును
- గ్యారంటీడ్ అడిషన్స్ : యూనిట్ ఫండ్ విలువకు అదనంగా హామీగల అదనపు చేర్పులను పొందండి.*
- పాలసీ పరిపక్వత : యూనిట్‌ఫండ్ విలువ.

అర్హత నిబంధనలు :
ప్రవేశానికి వయసు : కనీస వయసు : 90 రోజులు, గరిష్ట వయసు : 65 సంవత్సరాలు
పరిపక్వత వయసు : కనీస వయసు : 18 సంవత్సరాలు, గరిష్ట వయసు : 85 సంవత్సరాలు
పాలసీ కాలవ్యవధి : 10-25 సంవత్సరాలు

56767474కు మీ నగరం పేరును ఎస్ఎంఎస్ చేయండి
Call Centre Services (022) 6827 6827 | Download LIC Mobile App "MyLIC"
or visit www.licindia.in Follow us : LIC India Forever
* వివరాలు వర్తిస్తాయి, వివరాల కోసం మీ ఏజెంట్/సమీప ఎల్ఐసీ శాఖను సంప్రదించండి.
నకిలీ ఫోన్ కాల్స్ మరియు కల్పిత / మోసపూరిత అప్రకటిత జాగ్రత్తగా ఉండండి
రిస్క్ కారణాలు, నియమ నిబంధనల కోసం అప్లికేషన్ పూర్తి అయ్యే ముందు జాగ్రత్తగా సేల్స్ బ్రోచర్ చదువుకోండి
IRDAI Regn No.: 512
LIC భారతీయ జీవన బీమా నిగమ LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా
LIC/AR/19-20/36/ENG

"ఈ పాలసీలో, పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో పెట్టుబడి రిస్క్‌ను పాలసీ హోల్డరు భరించవలసి ఉంటుంది"
Sabse Pehle Life Insurance
ఒకసారి పొదుపు చేయండి... మీ జీవిత లక్ష్యాలను నెరవేర్చుకోండి

ఆన్‌లైన్‌లో కూడా లభించును
పాలసీ వారి నివేశ్ ప్లస్
Plan No: 849 UIN:512L317V01
యూనిట్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, సింగిల్ ప్రీమియం, వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్

ఎంపికకు స్వేచ్ఛ :
- పొదుపు మొత్తం : మీరు అతి తక్కువ మొత్తం రూ. 1 లక్ష లేదా ఏదేని విస్తృత జీవిత లక్ష్యాల కోసం అధిక మొత్తాన్ని ఏక మొత్తంగా పెట్టుబడి పెట్టవచ్చును.
- 4 ఫండ్ ఆప్షన్స్ మీరు 4 ఫండ్ ఆప్షన్స్ - బాండ్, సెక్యూర్డ్, బ్యాలన్స్‌డ్ మరియు గ్రోత్ నుంచి ఎంపిక చేసుకోవచ్చును.
- రుసుములు లేకుండా మార్చుకోవచ్చును గరిష్టంగా రాబడులు పొందేందుకు సంవత్సరంలో ఎలాంటి రుసుములు లేకుండా నాలుగు సార్లు ఫండ్ ఆప్షన్స్ మధ్య మీరు మీ సొమ్మును మార్చుకోవచ్చును.
- మీకు అవసరమైనప్పుడు ఉపసంహరించుకోండి 5 సంవత్సరాల తర్వాత నుంచి పాక్షికంగా ఉపసంహరించుకోవచ్చును.*
- లైఫ్ కవర్ ఆప్షన్స్ చెల్లించిన ప్రీమియంకు 1.25 రెట్లు లేదా 10 రెట్ల లైఫ్ కవర్ ఎంపిక చేసుకోవచ్చును.

పాలసీ ప్రయోజనాలు :
- గ్యారంటీడ్ అడిషన్స్ యూనిట్ ఫండ్ విలువకు అదనంగా హామీగల అదనపు చేర్పులను పొందండి.*
- పాలసీ పరిపక్వత : యూనిట్‌ఫండ్ విలువ.

అర్హత నిబంధనలు
- ప్రవేశానికి వయసు కనీస వయసు : 90 రోజులు, గరిష్ట వయసు : 35 సంవత్సరాలు / 70 సంవత్సరాలు (ఎంపిక చేసుకున్న లైఫ్ కవర్ ప్రకారం)
- పరిపక్వత వయసు : కనీస వయసు : 18 సంవత్సరాలు, గరిష్ట వయసు : 50 సంవత్సరాలు / 85 సంవత్సరాలు (ఎంపిక చేసుకున్న లైఫ్ కవర్ ప్రకారం)
- పాలసీ కాలవ్యవధి : 10-25 సంవత్సరాలు

* వివరాలు వర్తిస్తాయి, వివరాల కోసం మీ ఏజెంట్/సమీప ఎల్ఐసీ శాఖను సంప్రదించండి.
56767474కు మీ నగరం పేరును ఎస్ఎంఎస్ చేయండి
Call Centre Services (022) 6827 6827 | Download LIC Mobile App "MyLIC"
or visit www.licindia.in Follow us : LIC India Forever
రిస్క్ కారణాలు, నియమ నిబంధనల కోసం అప్లికేషన్ పూర్తి అయ్యే ముందు జాగ్రత్తగా సేల్స్ బ్రోచర్ చదువుకోండి
నకిలీ ఫోన్ కాల్స్ మరియు కల్పిత / మోసపూరిత అప్రకటిత జాగ్రత్తగా ఉండండి
IRDAI Regn No.: 512
LIC భారతీయ జీవన బీమా నిగమ LIFE INSURANCE CORPORATION OF INDIA
ప్రతి క్షణం మీకు తోడుగా
LIC/AR/19-20/36/ENG

తప్పులను కప్పిపుచ్చుకునేందుకే..

సాక్షి, హైదరాబాద్: గోపన్‌పల్లిలో దళితుల భూములను కబ్జా చేసిన కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి తన తప్పును కప్పిపుచ్చుకునేందుకు టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావుపై బురద చల్లుతున్నారని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విమర్శించారు. కేటీఆర్ ఫామ్‌హౌస్ అంటూ మీడియా ఎదుట హడావుడి చేసిన రేవంత్ రెడ్డి కొండను తవ్వి కనీసం ఎలుకను కూడా పట్టుకోలేక పోయారని ఎద్దేవా చేశారు. పార్టీ ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, ఎం. శ్రీనివాస్‌రెడ్డి, నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గట్టు రాంచందర్‌రావుతో కలసి సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. రేవంత్‌ది చీకటి బతుకని, ఆయన బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్ చెప్తున్న భూములకు సంబంధించిన వివరాలను 2014 ఎన్నికల అఫిడవిట్‌లోనే కేటీఆర్ వెల్లడించారని, ఫామ్‌హౌస్‌ను కేటీఆర్ నాలుగేళ్ల క్రితం లీజుకు తీసుకున్నారన్నారు. రేవంత్ చూపిన స్థలానికి కేటీఆర్ సతీమణి పేరిట భూమికి మధ్య 8 కి.మీ. దూరముందని, కేటీఆర్ సతీమణి పేరిట 8 ఎకరాల 9 గుంటల భూమి ఉందన్నారు.

రేవంత్, విశ్వేశ్వర్‌రెడ్డి అరెస్టు సరికాదు

సాక్షి, హైదరాబాద్: మంత్రి కేటీఆర్ ఫాంహౌస్‌కు సంబంధించి ప్రశ్నించిన తమ పార్టీ నేతలను అరెస్టు చేయడం సరికాదని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తాము లేవనెత్తిన అంశాలపై వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. జన్వాడ వద్ద సోమవారం ఎంపీ రేవంత్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిలను అరెస్టు చేయడాన్ని తాము ఖండిస్తున్నామని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి షబ్బీర్ అలీలు ఓ ప్రకటనలో తెలిపారు. 111 జీవోను అమలు చేయాల్సిన పాలకులే దాన్ని తుంగలో తొక్కితే ఎవరు కాపాడాలని ప్రశ్నించారు. కేటీఆర్ ఫాంహౌస్ నిర్మాణంపై వెంటనే విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు.

పీఆర్సీ, రిటైర్మెంట్ వయసు పెంచాలి..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలుతో పాటు, ఉద్యోగ విరమణ వయసును 60 ఏళ్లకు పెంచుతూ వెంటనే ఉత్తర్వులు జారీచేయాలని సీఎం కేసీఆర్‌కు సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం రాసిన లేఖలో విజ్ఞప్తిచేశారు. దీంతో పాటు కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమానపనికి సమాన వేతనం వర్తింపు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు, ఉద్యోగులకు సర్వీస్ రూల్స్, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త పీఆర్సీ గడువు ముగిసి ఏడాదిన్నర కావొస్తోందని, 2018 జూన్ నుంచి ఇంటరిమ్ రిలీఫ్, ఆగస్టు 15నుంచి రాష్ట్రంలో మొదటి పీఆర్సీ అమలు చేస్తామని, ఉద్యోగుల విరమణ వయసు 60 ఏళ్లకు పెంచుతామని గతంలో సీఎం ప్రకటించారని తమ్మినేని తన లేఖలో గుర్తుచేశారు.

'విభజన హామీల అమలు కోసం ఉద్యమం'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి సంబంధించి ఏపీ పునర్విభజన చట్టంలోని హామీల సాధనలో అధికార టీఆర్ఎస్‌తో పాటు రాష్ట్ర బీజేపీ నాయకత్వం విఫలమయ్యాయని సీపీఐ ధ్వజమెత్తింది. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఒత్తిడి తెచ్చి హామీల అమలుకు కలిసొచ్చే ఇతర పార్టీలతో కలసి ఉద్యమించాలని నిర్ణయించింది. సోమవారం మఖ్దూంభవన్‌లో రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వ తిరోగమన ఆర్థిక విధానాలు, మతతత్వ విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ఈనెల 23 వరకు రాజకీయ ప్రచార ఆందోళనలో భాగంగా బీజేపీ మతతత్వ రాజకీయాలు, ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను ఎండగడుతూ సభలు, సమావేశాలు నిర్వహించాలని ఈ భేటీ పిలుపునిచ్చింది. రాష్ట్రంలో వెంటనే రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనకు సమగ్ర భూసర్వే చేపట్టాలని, ఇందుకు సర్వే నెంబర్లను ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది.

అసద్‌ను ప్రభుత్వం అరెస్టు చేస్తుందా?

సాక్షి, హైదరాబాద్: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని, ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం అదుపులో పెడుతుందా.. అరెస్టు చేస్తుందా? అని బీజేపీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు ప్రశ్నించారు. అసద్ వాడిన 'జీనోసైడ్'అనే పదంపై బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పాతబస్తీలో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) మార్చ్ చేయాలనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వానిదని, కానీ పాతబస్తీలో మార్చ్ చేస్తారు... హైటెక్ సిటీలో ఎందుకు చేయరంటూ అసద్ అక్కడి ప్రజలను అవమానపరుస్తున్నారని వ్యాఖ్యానించారు. కృష్ణప్రసాద్ అనే పోలీసు అధికారిని చంపిన వారు దొరికింది పాతబస్తీలోనేనని, అక్కడ మతకల్లోలాలు సృష్టించింది ఎంఐఎం పార్టీనేనని అన్నారు. ఎంఐఎంకు టీఆర్ఎస్ మద్దతు ఉన్నందునే అసద్ అలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఢిల్లీలో అల్లర్లకు ఎంఐఎం, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలే కారణమన్నారు.

బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయించండి

హైదరాబాద్: వచ్చే బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని, బీసీ కార్పొరేషన్‌కు సబ్సిడీ రుణాల కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆర్థిక మంత్రి హరీశ్‌రావును కోరారు. సోమవారం ఈ మేరకు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. 12 బీసీ కులాల ఫెడరేషన్‌కు జనాభా నిష్పత్తిలో రూ.2 వేల కోట్లు కేటాయించాలని కోరారు. ఈ బడ్జెట్‌లో బీసీలకు రూ.10 వేల కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్‌తో బీసీ బడ్జెట్ గురించి చర్చించి నిధులు పెంచేందుకు కృషి చేస్తానని మంత్రి హరీశ్ హామీనిచ్చినట్లు తెలిపారు.

కులగణన చేయకుంటే పార్లమెంట్ ముట్టడి

సాక్షి, హైదరాబాద్: త్వరలో చేపట్టబోయే జనగణనలో బీసీల కులగణన చేపట్టకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23న పార్లమెంట్‌ను ముట్టడించనున్నట్లు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం హెచ్చరించింది. వచ్చే నెల 1 నుంచి చేపట్టే జనగణనలో బీసీలను కులాల వారీగా లెక్కించకపోతే వేలాదిమందితో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని 60 కోట్ల మంది బీసీలను లెక్కలోకి తీసుకోకుండా రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కకుండా చేయడానికే బీసీల లెక్కలు తీయడం లేదని ఆరోపించారు. జనగణనలో బీసీల లెక్కలు తీయకపోతే భవిష్యత్‌లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు రాకపోగా, ఇప్పుడున్న రిజర్వేషన్లను కోర్టులు కొట్టేసే ప్రమాదముందన్నారు.

'సర్వాయి' జయంతిని అధికారికంగా జరపాలి

రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన పలువురు వక్తలు

హైదరాబాద్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ గౌడ జన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో మోకుదెబ్బ జనజాతర నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ మాట్లాడుతూ.. బీసీలంతా ఐక్యంగా ఉండాలని సూచించారు. రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో సర్దార్ పాపన్న గౌడ్, బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాలను ప్రతిష్టించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి రాజేశంగౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, జర్నలిస్టుల సంఘం నేత పల్లె రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో కొత్తగా ఎన్నికైన డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

త్వరలోనే రుణమాఫీ ప్రక్రియ

- ఆర్థిక పరిమితులున్నా దృఢ సంకల్పంతో కేసీఆర్ నిర్ణయం
- డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్లతో భేటీలో కేటీఆర్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక మందగమనం ఉన్నా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ ప్రక్రియ త్వరలోనే ప్రారంభించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఆర్థిక పరిమితులు ఉన్నా దృఢ సంకల్పంతో సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. రైతుల సంఘటిత శక్తిని వారి సంక్షేమానికి ఉపయోగపడేలా కొత్తగా ఎన్నికైన సహకార సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైతుల సమస్యలపై ప్రతిపక్షాలు చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టే బాధ్యతను సహకార సంఘాల నేతలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన జిల్లా కేంద్ర సహకార సంఘాలు (డీసీసీబీ), జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల (డీసీఎంఎస్) చైర్మన్లు సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. సహకార ఎన్నికలను సవాల్‌గా తీసుకుని టీఆర్ఎస్‌కు భారీ విజయాన్ని అందించిన మంత్రులను కేటీఆర్ అభినందించారు. అన్ని ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌కు తిరుగులేని విజయాన్ని అందిస్తున్న రాష్ట్ర ప్రజలు సహకార ఎన్నికల్లోనూ టీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేశారన్నారు. డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 48 శాతం మేర ప్రాతినిధ్యం కల్పించామని చెప్పారు. ఆదిలాబాద్‌లో ఎస్సీ, మహబూబ్‌నగర్‌లో మైనారిటీ వర్గానికి చెందిన వారిని చైర్మన్లుగా ఎంపిక చేసిట్లు గుర్తు చేశారు. సహకార ఎన్నికల్లో రిజర్వేషన్లు లేకున్నా సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో బలహీన, బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేలా డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ పేర్లను ఖరారు చేశారన్నారు. పురపాలక ఎన్నికల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాలకు తమ పార్టీ పెద్దపీట వేసిన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు.

ఖర్చుకు వెనుకాడకుండా రైతు సంక్షేమం

ఖర్చుకు వెనుకాడకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్నందునే రాష్ట్రంలోని 906 సహకార సంఘాల్లో 94 శాతానికి పైగా తమ పార్టీ మద్దతుదారులే గెలుపొందారని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వ్యవసాయరంగం కొత్త పుంతలు తొక్కుతోందని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా అందుతున్న ఫలాలను విమర్శకులు కూడా అంగీకరిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు రైతు బీమా, రైతుబంధు లాంటి ప్రత్యేక పథకాలను దేశంలోనే తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. కేంద్ర అసంబద్ధ నిర్ణయాలతో దేశవ్యాప్తంగా ఆర్థిక మందగమనం నెలకొందని ఆరోపించారు. ఈ సమావేశంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, సత్యవతిరాథోడ్, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యత

సాక్షి, హైదరాబాద్: కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, పట్టణ స్థానిక సంస్థలు, గ్రామాల్లో మూడో ఫేజ్ విద్యుత్ కనెక్షన్లు, మరింత మెరుగైన గురుకుల విద్యా సౌకర్యాలు తదితర అంశాలకు వచ్చే బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఎస్టీ సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించారు. సోమవారం డీఎస్ఎస్ భవన్‌లో జరిగిన ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి నోడల్ ఏజెన్సీ సమావేశంలో గిరిజనుల జనాభా దామాషా ప్రకారం కేటాయించిన నిధులను ఆయా శాఖల్లో ఏ మేరకు ఖర్చు చేస్తున్నాయన్న అంశంపై ఎస్టీ శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తూ, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం సత్యవతి మీడియాతో మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక నిధి కింద గత బడ్జెట్‌లో ఎస్టీలకు రూ.7,184 కోట్లు కేటాయిస్తే.. రూ.5 వేల కోట్ల వరకు (70%) ఖర్చు చేశారని, మిగతావి ఈ ఏడాది లోపు ఖర్చు చేయాలని ఆదేశించామన్నారు. కొత్త పంచాయతీలలో మౌలిక వసతులకు రూ.500 కోట్లు, త్రీ ఫేజ్ కరెంట్ కోసం రూ. 150 కోట్లు, ఇతర పథకాలకు తగిన నిధులిచ్చేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

టెస్కాబ్, మార్క్‌ఫెడ్ చైర్మన్ల ఎన్నికకు నోటిఫికేషన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్), తెలంగాణ రాష్ట్ర సహకార మార్కెటింగ్ ఫెడరేషన్ (మార్క్‌ఫెడ్) మేనేజింగ్ కమిటీకి ఎన్నికల కోసం సోమవారం రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక ఈ నెల ఐదో తేదీన, మార్కెటింగ్ ఫెడరేషన్ మేనేజింగ్ కమిటీ డైరెక్టర్ల ఎన్నిక ఈ నెల 10వ తేదీన జరగనుంది. ఇక మార్క్‌ఫెడ్ చైర్మన్ ఎన్నిక 11వ తేదీన జరగనుంది. ఐదో తేదీన ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్లకు నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. 11.30 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ఉంటాయి. ఎవరైనా ఆ పదవులకు పోటీలో ఉంటే అదేరోజు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఉపసంహరణ అనంతరం ఒకరే మిగిలితే ఆయా పదవులను ఏకగ్రీవం అయినట్లుగా ప్రకటిస్తామని రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ వెల్లడించింది. ఇదిలావుంటే డీసీసీబీ చైర్మన్లంతా టెస్కాబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఉంటారు. డీసీసీబీ చైర్మన్లు టెస్కాబ్ చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. ఇక తెలంగాణ సహకార మార్కెటింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు డైరెక్టర్ పదవులకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ తరువాత నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు సాయంత్రం ఐదు గంటల వరకు సమయం ఇచ్చారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. ఓటింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. ఇందులో ఏడుగురు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీల అధ్యక్షులు డైరెక్టర్లను ఎన్నుకుంటారు. ఈ నెల 11వ తేదీన రాష్ట్ర సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌ను ఎన్నుకుంటారు.

చెప్పాపెట్టకుండా కూల్చే అధికారం మీకెక్కడిది?

- ఉరి శిక్ష కేసులో కూడా వాదనలు వింటాం?
- అనుమతి పొందిన ప్లాన్ ఉల్లంఘిస్తే నోటీసు ఇవ్వరా?
- రాజ్యాంగానికి లోబడే చట్టాలుండాలి
- మున్సిపల్ కమిషనర్లకు అధికారాలు కట్టబెట్టడంపై సీరియస్

సాక్షి, హైదరాబాద్: ఉరి తీయబోయేటప్పుడు కూడా చివరి కోరిక అడుగుతారు. అలాంటిది అక్రమ నిర్మాణమని నోటీసు కూడా ఇవ్వకుండానే ఇంటిని కూల్చేస్తారా? నోటీసు కూడా జారీ చేయకుండా వాటిని కూల్చేసే అధికారాన్ని మున్సిపల్ కమిషనర్లకు కట్టబెడతారా? అధికారంలో ఉన్నామని ఇష్టానుసారంగా చట్టాలు చేస్తామంటే కుదరదు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకే ప్రభుత్వ చర్యలు ఉండాలి'అంటూ రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు మండిపడింది. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 174 (4), సెక్షన్ 178 (2) రెండింటినీ కలిపి చట్టాన్ని అన్వయించాలే గాని, ఒక సెక్షన్‌కే పరిమితమై చర్యలు ఉండకూడదని స్పష్టం చేసింది. నోటీసు జారీ చేయకుండానే అక్రమ నిర్మాణాలను కూల్చేసేలా మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 178 (2)ను సవాల్ చేస్తూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డి లతో కూడిన ధర్మాసనం సోమవారం విచారించింది. ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. తెల్లారేసరికి ఇంటి ముందు బుల్డోజర్ ఉంటే ఆ ఇంటి యజమాని పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని పేర్కొంది. దీనిపై ప్రభుత్వ న్యాయవాది గిరి కల్పించుకుని పలానా ప్లాన్ ప్రకారం నిర్మాణం చేస్తామని భరోసా ఇచ్చి దాన్ని ఉల్లంఘిస్తే నోటీసు జారీ చేయాల్సిన అవసరం ఏముంటుందని ప్రశ్నించారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ.. ఉరి శిక్ష విధించే కేసులోనైనా నేరస్తుల వాదనలు వినాలని రాజ్యాంగం నిర్దేశిస్తోందని, అలాంటిది అనుమతి పొందిన ప్లాన్‌ను అతిక్రమించి నిర్మాణం చేస్తే వాళ్ల వాదన వినేందుకు నోటీసు కూడా ఇవ్వరా అని తిరిగి ప్రశ్నించింది. ఏ చర్యలూ ఏకపక్షంగా ఉండకూడదని తేల్చి చెప్పింది. రోడ్డు పక్కనో, ఫుట్‌పాత్‌లపైనో గుడిసెలను తొలగించేటప్పుడు కూడా అందులో నివాసం ఉన్న వారికి నోటీసులు ఇవ్వాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పింది. 'ఒక ప్లాన్ ప్రకారం ఒక అంతస్తుకు అనుమతి తీసుకుని, రెండో అంతస్తు నిర్మించారనుకుందాం. మున్సిపల్ కమిషనర్‌కు తెలియకుండానే రెండో అంతస్తు నిర్మాణానికి టౌన్‌ప్లానింగ్ అధికారి అనుమతిచ్చారని అనుకుందాం. మీరు బుల్డోజర్లతో కూల్చేసే అధికారం మున్సిపల్ కమిషనర్లకు ఇవ్వడం ఎంత వరకు చట్టబద్ధత అవుతుంది? అప్పుడు ఆ భవనాన్ని కూల్చేయడం న్యాయం అవుతుందో లేదో ప్రభుత్వం ఆలోచించుకోవాలి' అని పేర్కొంది.

సాంకేతిక కారణాల సాకుతో అడ్డుకోవద్దు

మంజూరు చేసిన ప్లాన్‌ను ఉల్లంఘించి నిర్మాణాలు చేసి వాటి విషయంలోనే ఆ విధమైన చర్యలు ఉంటాయని ప్రభుత్వ న్యాయవాది గిరి వివరించారు. చట్టాన్ని ప్రశ్నిస్తున్నప్పుడు రిట్ పిటిషన్ దాఖలు చేయాల్సి ఉంటుందని, పిల్‌ను విచారించడానికి వీల్లేదని పేర్కొన్నారు. దీంతో వెంటనే ధర్మాసనం కల్పించుకుని.. సాంకేతిక కారణాలతో అడ్డుకునే ప్రయత్నాలు చేయొద్దని, ఒక ఇంటి నిర్మాణానికి అనుమతి పొందిన ప్లాన్‌లో మార్పు చేసి నిర్మాణం చేస్తే నోటీసు కూడా ఇవ్వకుండా ఏ చట్టం కింద కూల్చేస్తారని, ప్రభుత్వం కూడా రాజ్యాంగానికి లోబడి పనిచేయాలని చీవాట్లు పెట్టింది. అధికారంలో ఉన్నామని ఏకపక్షంగా అధికారాలను చెలాయిస్తామంటే ఎలాగంటూ ప్రశ్నించింది. అయితే ఇటీవల అక్రమ నిర్మాణాలపై హైకోర్టు ఆందోళన వెలిబుచ్చిందని అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ గుర్తు చేశారు. దీనిపై తిరిగి ధర్మాసనం కల్పించుకుని, అది నిజమేనని, అయితే ఏకపక్షంగా కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా అక్రమ నిర్మాణాలతో పాటు అనుమతి పొందిన ప్లాన్ డీవియేట్ అయ్యే నిర్మాణాలను కూడా కూల్చేసే అధికారాలను మున్సిపల్ కమిషనర్లకు ఇస్తారా అని ప్రశ్నించింది. ఈ వివాదాల పరిష్కారానికి ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని, దీన్ని మరో రెండేళ్ల వరకు ఏర్పాటు చేయకపోతే ఇళ్ల నిర్మాణాల వివాదాలను ఎదుర్కొనే వాళ్ల పరిస్థితి ఏం కావాలని నిలదీసింది.

మిడతే!

పచ్చని చిగురుటాకును పోలిన మిడత హైదరాబాద్ నగరంలోని ఎల్‌బీనగర్ మన్సూరాబాద్‌లో కనిపించింది. మన్సూరాబాద్‌ని ఆనుకుని ఉన్న హరిణ వనస్థలి అటవీ ప్రాంతంలో వింత కీటకాలు జీవిస్తుంటాయి. ఇవి పరిసర ప్రాంతాల్లోని కాలనీలలో ఇలా కనిపిస్తుంటాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, హైదరాబాద్

'ఫైర్ సేఫ్టీ' పాటించని కాలేజీలను మూసేస్తాం

- ఆ భవనాల్లో కాలేజీలను కొనసాగించేది లేదు
- ఫస్టియర్ పూర్తయ్యే విద్యార్థులను మరో కాలేజీకి పంపించాల్సిందే..
- ఆ కాలేజీలను ఇతర భవనాల్లోకి మార్చేందుకు దరఖాస్తు చేసుకోవాలి
- ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించని భవనాల్లో కొనసాగుతున్న జూనియర్ కాలేజీలను మూసేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి సయ్యద్ ఉమర్ జలీల్ పేర్కొన్నారు. 2020-21 విద్యా సంవత్సరంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయా భవనాల్లో ఆ కాలేజీలను కొనసాగించేది లేదని స్పష్టం చేశారు. ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయంలో సోమవారం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఇప్పుడు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్నారు. పరీక్షలు పూర్తయ్యాక ఆయా భవనాల్లో కాలేజీలను కొనసాగించకుండా చూస్తామని చెప్పారు. ఇప్పుడు ప్రథమ సంవత్సరం పూర్తయ్యే విద్యార్థులను ఇతర కాలేజీల్లోకి పంపించాలని స్పష్టం చేశారు. ఆయా కాలేజీలు నిబంధనలు పాటించని వైనంపై ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, వారు చెప్పిన సమాధానం పట్ల బోర్డు సంతృప్తి చెందలేదని పేర్కొన్నారు. అందుకే త్వరలోనే మూసివేత నోటీసులు ఇస్తామని తెలిపారు. మరోవైపు కావాలనుకుంటే ఆయా యాజమాన్యాలు ఆ కాలేజీలను ఇతర భవనాల్లోకి షిఫ్ట్ చేసుకోవచ్చని సూచించారు. అందుకోసం అఫిలియేషన్ దరఖాస్తుల సమయంలో కొత్త భవనాలకు సంబంధించి షిఫ్టింగ్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించని యాజమాన్యాల్లో శ్రీచైతన్య విద్యా సంస్థలకు చెందిన 18 కాలేజీలు, నారాయణ విద్యా సంస్థలకు చెందిన 26 కాలేజీలు, శ్రీ గాయత్రి విద్యా సంస్థలకు చెందిన 8 కాలేజీలు, ఎస్ఆర్ఐ విద్యా సంస్థలకు చెందిన 5 కాలేజీలు, ఇతర విద్యా సంస్థలు 11 ఉన్నట్లు వెల్లడించారు. ఇతర విద్యా సంస్థల్లో ఎస్ఆర్ జూనియర్ కాలేజీ, తపస్యా జూనియర్ కాలేజీ, గౌతమి గర్ల్స్ జూనియర్ కాలేజీ, క్వీన్ మేరీ జూనియర్ కాలేజీ, లియో ఒకేషనల్ జూనియర్ కాలేజీ, పులిపాటి ప్రసాద్ ఒకేషనల్ జూనియర్ కాలేజీ, సరస్వతి సాయి రాఘవేంద్ర జూనియర్ కాలేజీ, క్షత్రీయ జూనియర్ కాలేజీ తదితర విద్యా సంస్థలు ఉన్నట్లు వెల్లడించారు. అలాగే కాలేజీలు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కాలేజీ హాస్టళ్లను నియంత్రించేందుకు పక్కాగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులను త్వరలోనే జారీ చేస్తామని స్పష్టం చేశారు.

ఒత్తిడిని అధిగమించేందుకు ప్రత్యేక శిక్షణ..

ఒత్తిడిని అధిగమించేలా, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేలా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నట్లు సయ్యద్ ఉమర్ జలీల్ వెల్లడించారు. హార్వర్డ్‌లీడర్స్ సొసైటీ ద్వారా ఈ శిక్షణ ఇప్పించనున్నట్లు తెలిపారు. దీనిపై త్వరలోన

ట్విట్టర్‌లో మోదీ చేసిన ప్రకటన

ప్రధాని మోదీ సోషల్ మీడియా సన్యాసం!

- వదిలేద్దామనుకుంటున్నా: ప్రధాని
- అది కాదు.. విద్వేషాన్ని వదలండి: రాహుల్

న్యూఢిల్లీ: సామాజిక మాధ్యమాల్లో అనునిత్యం చురుగ్గా ఉండే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. వచ్చే ఆదివారం నుంచి సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు సోమవారం వెల్లడించారు. 'ఈ ఆదివారం నుంచి ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగామ్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఆలోచిస్తున్నా' అని సోమవారం ఆయన సంచలన ట్వీట్ చేశారు. ఎందుకు దూరంగా ఉండాలనుకుంటున్నారనే వివరాలను ఆయన వెల్లడించలేదు. సంబంధిత వర్గాలను సంప్రదించగా, భవిష్యత్ ప్రణాళిక త్వరలో వెల్లడించే అవకాశముందని తెలిపాయి. మోదీ తాజా నిర్ణయం సంచలనాత్మకంగా మారింది. గంటలో 26వేల సార్లు రీట్వీట్ అయింది. క్షణక్షణానికో కామెంట్ వచ్చింది. నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ వివిధ ఎమోజీలతో స్పందించడం ప్రారంభించారు. నిర్ణయం మార్చుకోవాలని కోరుతూ అదే సోషల్ మీడియా కేంద్రంగా 'నో సర్' అని వేలాదిగా అభ్యర్థనలు వెల్లువెత్తాయి. 'నో సర్' ట్రెండవుతున్న హ్యాష్‌ట్యాగ్‌గా మారింది. 'ప్రపంచవ్యాప్తంగా మీ అభిమానులున్నారు. కావాలంటే చిన్న బ్రేక్ తీసుకోండి. కానీ పూర్తిగా వదిలేయవద్దు' అని ఓ నెటిజన్ అభ్యర్థించారు. 'నేను మోదీజీ అభిమానిని. ఆయన వదిలేస్తే.. సోషల్ మీడియాను నేనూ వదలేస్తా' అని మరో యూజర్ హెచ్చరించారు. మరోవైపు, మోదీ ట్వీట్‌పై మీమ్స్ కూడా ప్రారంభమయ్యాయి. బ్లాక్‌బస్టర్ సినిమా '3 ఇడియట్స్' సినిమా సీన్ నేపథ్యంలో 'జానే నహీ దేంగే తుఝే' అనే పాటను ప్లే చేస్తూ ఒక మీమ్‌ను రూపొందించారు.

విద్వేషం వదలండి: మరోవైపు, విపక్షాల నుంచి కామెంట్స్ కూడా వచ్చాయి. 'ద్వేషాన్ని విడనాడు.. సోషల్ మీడియాను కాదు' అని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌కు ప్రధాని మోదీని ట్యాగ్ చేశారు. 'మీరు సోషల్ మీడియాకు దూరంగా ఉండటం కాదు.. వ్యతిరేకించే ప్రతి ఒక్కరిని సోషల్ మీడియాలో వేధింపులకు గురిచేసే, బెదిరించే, హెచ్చరించే మీ ఆర్మీకి ఈ సలహా ఇవ్వండి– ఇట్లు భారత పౌరులు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సూర్జెవాలా వ్యంగ్య ట్వీట్ చేశారు.

టాప్ 'సోషల్' స్టార్: ట్విటర్, ఫేస్‌బుక్‌ల్లో మోదీ చాలా చురుగ్గా ఉంటారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఈ విషయాన్ని ఇటీవల ప్రస్తావించారు. ట్విటర్‌లో మోదీకి 5.33 కోట్లమంది ఫాలోవర్లున్నారు. 5 కోట్లకు పైగా ట్విటర్ ఫాలోవర్లు ఉన్న తొలి భారతీయుడు మోదీనే. ఫేస్‌బుక్‌లో 4.4 కోట్ల మంది, ఇన్‌స్టాగామ్‌లో 3.52 కోట్ల మంది ఆయనను ఫాలో అవుతుంటారు. ప్రధాని కార్యాలయ ట్విటర్ అకౌంట్‌ను 3.2 కోట్ల మంది అనుసరిస్తున్నారు. సెప్టెంబర్ 2019లో ప్రపంచవ్యాప్తంగా ట్విటర్‌లో అత్యధికులు ఫాలో అవుతున్న మూడో నేత నరేంద్ర మోదీనే. తొలి రెండు స్థానాల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, యూఎస్ మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఉన్నారు.

నెట్టుకున్నారు.. తోసేసుకున్నారు!

- ఢిల్లీ అల్లర్లపై లోక్‌సభలో విపక్ష, అధికార సభ్యుల తీరు
- ప్రారంభమైన బడ్జెట్ మలి దశ పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ: బడ్జెట్ సమావేశాల మలి దశ తొలి రోజే లోక్‌సభ దద్దరిల్లింది. ఢిల్లీ అల్లర్లపై అధికార, విపక్ష సభ్యులు ఆవేశంగా ఒకరినొకరు గట్టిగా తోసుకోవడంతో సభలో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. సభలో నెలకొన్న తోపులాటపై స్పీకర్ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో సభను నిర్వహించలేనంటూ అశక్తత వ్యక్తం చేశారు. సభలో తమ మహిళా సభ్యులపై అనుచితంగా ప్రవర్తించారంటూ కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకున్నారు.

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల మలి దశ సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉదయం లోక్‌సభ ప్రారంభం కాగానే.. ఫిబ్రవరి 28వ తేదీన మరణించిన జేడీయూ ఎంపీ బైద్యనాథ్ ప్రసాద్‌కు నివాళి అర్పించి, అనంతరం ఆయనకు గౌరవ సూచకంగా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభం కాగానే గందరగోళం మొదలైంది. ఇటీవలి ఢిల్లీ అల్లర్ల అంశాన్ని లేవనెత్తిన కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి.. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేయడం ప్రారంభించారు. హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అధికార పక్ష సభ్యులు కూర్చున్న వైపు కూడా వెళ్లి అమిత్‌షా రాజీనామా డిమాండ్ ఉన్న నల్లని బ్యానర్‌ను ప్రదర్శించారు. 'అల్లర్లకు కారణం వీరే. వీరే రెచ్చగొట్టారు. 1984లోనూ వీరు 3000 మందిని హతమార్చారు. వీరికి శాంతి నెలకొనడం ఇష్టం లేదు' అని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. దీంతో విపక్ష సభ్యులు మరింత బిగ్గరగా.. 'వి వాంట్ జస్టిస్', 'అమిత్ షా ముర్దాబాద్' అని నినాదాలు చేయసాగారు. ఈ సమయంలో, కాంగ్రెస్ సభ్యులు నల్ల బ్యాసర్‌తో అధికార పక్ష సభ్యుల వైపు వెళ్లారు. బీజేపీ సభ్యులు వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కొందరు ప్రతిపక్ష సభ్యులు చేతిలోని కాగితాలను చించి, విసిరేశారు. ఈ సమయంలో, ఇరు వర్గాల సభ్యుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. గట్టిగా నెట్టివేసుకున్నారు. దీంతో సభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. 3 గంటలకు సభ ప్రారంభమైన తరువాత కూడా పరిస్థితిలో మార్పు రాలేదు. తమవైపు నుంచి వెల్‌లోకి వెళ్లనివ్వకుండా బీజేపీ సభ్యులు విపక్ష సభ్యులను అడ్డుకున్నారు. ఈ సమయంలో బీజేపీ మహిళా ఎంపీ ఒకరు తనపై దాడి చేశారని కాంగ్రెస్ ఎంపీ రమ్య హరిదాస్ స్పీకర్ కు ఫిర్యాదు చేశారు. గందరగోళం మధ్య సభ పదేపదే వాయిదాపడింది.దీంతో సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు. కాగా, బీజేపీ మహిళా సభ్యులతో కాంగ్రెస్ ఎంపీలు అనుచితంగా ప్రవర్తించారని, స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తామని మంత్రి స్మృతి ఇరానీ సభ వెలుపల మీడియాకు తెలిపారు.

లోక్‌సభలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష సభ్యులు

వాయిదా పడిన రాజ్యసభ

ఢిల్లీ అల్లర్లపై రాజ్యసభలో దుమారం రేగింది. ఢిల్లీ తగలబడుతుంటే కేంద్రం నిద్రపోతోందని ప్రతిపక్షాలు విమర్శించాయి. హోం మంత్రి రాజీనామా చేయాలని కోరాయి. ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో సభ దద్దరిల్లింది. వెల్‌లోకి వచ్చి నిలబడిన సభ్యులను సీట్లలో కూర్చోవాల్సిందిగా అధ్యక్ష స్థానంలో ఉన్న డిప్యూటీ చైర్మన్ హరివంశ్ పలు పర్యాయాలు కోరినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆయన సభను మధ్యాహ్నానికి వాయిదావేశారు. ఆ తర్వాతా అదే తీరు కొనసాగడంతో చైర్మన్ వెంకయ్యనాయుడు సభను మంగళవారానికి వాయిదా వేశారు. గొడవ మధ్యనే తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠ్ సహా మూడు సంస్కృత వర్సిటీలను సెంట్రల్ వర్సిటీలుగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లును ప్రవేశపెట్టారు.

సభ్యులను సముదాయించేందుకు స్పీకర్ ఓం బిర్లా పలు సందర్భాల్లో విఫల యత్నం చేశారు. దేశ ప్రజలు చూస్తున్నారని, గౌరవ సభ్యులుగా హుందాగా వ్యవహరిద్దామని సభ్యులకు సూచించారు. సభ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత సభ్యులందరిపై ఉందన్నారు. గందరగోళం మధ్యనే మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ(అమెండ్‌మెంట్) బిల్లు, మినరల్ లాస్ అమెండ్‌మెంట్ బిల్లులను ప్రవేశపెట్టారు. ప్రత్యక్ష పన్నులకు సంబంధించిన 'వివాద్ సే విశ్వాస్' బిల్లుపై చర్చ జరిగింది.

గౌరవంగా వ్యవహరిద్దాం

చైనా తర్వాత ఇరాన్..

- కోవిడ్‌తో 66 మంది మృత్యువాత
- ప్రపంచవ్యాప్తంగా మృతులు 3 వేలు.. ఒక్క చైనాలోనే 2,900

న్యూఢిల్లీ/బీజింగ్/వాషింగ్టన్/టెహ్రాన్: కోవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా మెల్లగా విస్తరిస్తోంది. ప్రభుత్వాల్లో వణుకు పుట్టిస్తోంది. ఇప్పటి వరకు 70 దేశాల్లోని 88వేల మందికి ఈ వ్యాధి పాకింది. చైనాలో ఈ వైరస్‌తో 2,900 మంది మృత్యువాతపడగా అన్ని దేశాల్లో కలిపి 3 వేల మంది వరకు చనిపోయారు. చైనా వెలుపల అత్యధికంగా ఇరాన్‌లో 66 మంది కోవిడ్‌తో మృతి చెందడం, మరో 1,500 మందికి వ్యాధి నిర్ధారణ యినట్లు ఆ దేశం ప్రకటించడం ఆందోళన కలిగిస్తోంది. భారత్‌లోనూ కొత్తగా రెండు కోవిడ్ కేసులు బయటపడ్డాయి.

చైనా తర్వాత ఇరాన్..

చైనాలో సోమవారం కోవిడ్‌తో 42 మంది మృతి చెందగా మొత్తం బలైనవారి సంఖ్య 2,912కు చేరుకుంది. మరో 80 వేల మంది ఈ వ్యాధితో చికిత్స పొందుతున్నారు. దేశంలో జనవరి 22వ తేదీ తర్వాత కొత్తగా బయటపడుతున్న కేసులు తగ్గుముఖం పట్టడం ఊరట కలిగించే విషయమని చైనా ప్రభుత్వం పేర్కొంది. ఈ వైరస్ మొదటిగా బయటపడిన చైనా తర్వాత అత్యధికంగా ఇరాన్‌లో మరణాలు నమోదయ్యాయి. 'సుప్రీం నేత అయతొల్లా ఖమేనీ సలహాదారు మిర్‌మొహమ్మదీ(71) సహా 66 మంది ఈ వ్యాధితో చనిపోయారు. మరో 1,501 మందిలో వైరస్ లక్షణాలను గుర్తించాం' అని ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. కాగా, చైనా అధికారులు తీసుకున్న కరోనా నియంత్రణ చర్యల కారణంగా ఆ దేశంలో వాయు కాలుష్యం గణనీయంగా తగ్గిందని నాసా, యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తెలిపాయి. మరో ఘటనలో..యున్నాన్ ప్రావిన్సులో కరోనా వైరస్‌ను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు అధికారులను పొడిచి చంపిన ఓ వ్యక్తికి కోర్టు మరణశిక్ష విధించింది. గత నెల 6న ఈ ఘటన జరిగింది.

రెండు కేసులు గుర్తించాం

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ, తెలంగాణల్లో రెండు కోవిడ్ కేసులు తాజాగా వెలుగుచూశాయని ప్రభుత్వం తెలిపింది. ఢిల్లీ బాధితుడు ఇటీవలే ఇటలీ నుంచి వచ్చారని, అలాగే తెలంగాణకు చెందిన ఒకరు దుబాయ్ నుంచి వచ్చారని పేర్కొంది. 'ప్రస్తుతం ఒకరు ఢిల్లీ ఆర్ఎంఎల్ ఆస్పత్రిలో, మరొకరు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలోనూ ఉన్నారు. వీరి పరిస్థితి నిలకడగా ఉంది' అని సోమవారం కేంద్ర ఆరోగ్య మంత్రి హర్షవర్ధన్ వెల్లడించారు. అనుమానాస్పదంగా ఉన్న 3,217 మంది శాంపుల్స్ పరీక్షించగా ఐదుగురిలో కోవిడ్ పాజిటివ్ అని తేలిందని, మరో 32 శాంపుల్స్ ఫలితాలు అందాల్సి ఉంది. చైనాలో చదువుకుంటూ ఇక్కడికి వచ్చిన ముగ్గురు కేరళ వైద్య విద్యార్థులు కూడా కోలుకున్నారన్నారు. కోవిడ్ వ్యాప్తిని నిలువరించేందుకు ఏర్పాటైన మంత్రుల కమిటీ సమావేశంలో పాల్గొన్న అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కోవిడ్‌పై సమాచారం కోసం కంట్రోల్ రూమ్ 011-23978046కు కాల్ చేయాలని ప్రజలకు సూచించారు. ncvo2019@gmail.comకు మెయిల్ చేయాలని సూచించారు. జైపూర్‌కు వచ్చిన ఇటలీ యాత్రికుడొకరికి పరీక్షలు చేయగా అనుమానాస్పద ఫలితాలు వచ్చాయని, మరోసారి అతనికి పరీక్షలు చేయిస్తున్నట్లు రాజస్తాన్ ఆరోగ్య మంత్రి రఘు శర్మ మీడియాకు తెలపడం గమనార్హం.

ఆర్టికల్ 370 రద్దుపై విస్తృత ధర్మాసనానికి నో

న్యూఢిల్లీ: ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించి రాజ్యాంగబద్ధతపై విచారించేందుకు ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనం కావాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. విస్తృత ధర్మాసనానికి ఇవ్వాల్సిన కారణమేమీ కనబడటం లేదని జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌ను పీపుల్స్ యూనియన్ ఆఫ్ సివిల్ లిబర్టీస్, జమ్మూ కశ్మీర్ హైకోర్ట్ బార్ అసోసియేషన్‌లు కలసి దాఖలుచేశాయి.

శ్రీలంక పార్లమెంటు రద్దు

కొలంబో: శ్రీలంక అధ్యక్షుడు గొతబయ రాజపక్స ఆ దేశ పార్లమెంటును రద్దు చేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. మరో ఆరు నెలలు మిగిలి ఉండగానే రద్దు చేయడం గమనార్హం. మార్చి 12 నుంచి 19లోపు అభ్యర్థులు నామినేషన్ వేసుకోవచ్చని, ఏప్రిల్ 25న ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. మే 14వ తేదీన కొత్త పార్లమెంటు సమావేశమవుతుందని పేర్కొన్నారు. శ్రీలంక పార్లమెంటును రద్దు చేయడానికి కనీసం నాలుగున్నర ఏళ్ల పాలన సాగాల్సి ఉంటుంది.

ఈశాన్య ఢిల్లీ అల్లర్లు.. మృతులు 45

- భారీ భద్రత మధ్య సీబీఎస్ఈ పరీక్షలు
- వదంతులు వ్యాప్తి చేస్తున్న 40 మంది అరెస్టు
- అంకిత్ శర్మ కుటుంబానికి ఢిల్లీ ప్రభుత్వం కోటి సాయం

న్యూఢిల్లీ: వారం క్రితం అల్లర్లు జరిగిన ఈశాన్య ఢిల్లీలో పరిస్థితి ఉద్రిక్తంగా ఉన్నా ప్రశాంత వాతావరణం నెలకొంది. అయితే, సోమవారం అల్లర్లు జరిగిన ప్రాంతంలో మరో నాలుగు మృతదేహాలు బయటపడటంతో మృతుల సంఖ్య 45కు చేరుకుందని అధికారులు తెలిపారు. అల్లర్ల కారణంగా వాయిదాపడిన సీబీఎస్ఈ 10, 12వ తరగతి పరీక్షలను సోమవారం పటిష్ట బందోబస్తు మధ్య నిర్వహించారు. 98 శాతం మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అధికారులు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వ్యాపింప జేస్తున్న 40 మందిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సీబీఎస్ఈ పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులకు పూలు ఇస్తున్న ఢిల్లీ పోలీసులు

అంకిత్‌శర్మ కుటుంబానికి రూ.కోటి సాయం

అల్లర్లలో ప్రాణాలు కోల్పోయిన ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగి అంకిత్ శర్మ కుటుంబానికి రూ.కోటి పరిహారంగా అందజేయనున్నట్లు సీఎం కేజ్రీవాల్ తెలిపారు. ఆయన కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా కల్పిస్తామన్నారు.

ఢిల్లీ అల్లర్లకు సంబంధించిన పిటిషన్లపై 4న విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. రాజకీయ నాయకులు, ఇతరుల రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్ల అల్లర్లు జరిగాయని, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదుచేయాలంటూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైన సంగతి తెలిసిందే. అయితే హైకోర్టు ఈ వ్యవహారాన్ని నాలుగు వారాల పాటు వాయిదా వేసింది. దీనిపై పిటిషన్‌దారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'అల్లర్ల కారణంగా ప్రజలు చనిపోతుంటే వాయిదా ఎలా వేయగలరు ?' అంటూ పిటిషన్‌దారుల తరఫున లాయర్ కోలిన్ గొంజాల్వెజ్ సుప్రీంకోర్టును అడిగారు. అయితే అల్లర్లను నియంత్రించడం తమ పని కాదని, దానికి కార్యనిర్వాహక వ్యవస్థ ఉందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బాబ్డే నేతృత్వంలోని ధర్మాసనం చెప్పింది. బుధవారం విచారణ జరుపుతామని తెలిపింది.

అల్లర్లపై రేపు సుప్రీం విచారణ

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WALK IN INTERVIEW
WANTED SALES / MARKETING EXECUTIVES AT ALL LEVELS FOR ALL DISTRICTS OF TELENGANA/ANDHRA PRADESH FOR DOLLAR INNERWEAR.
QUALIFICATION: Minimum 12th Passed Onwards. (Freshers can also apply with a minimum salary scale of 15,000/- per month + TA + DA + incentives)
District boys will be given two way Government Bus-fare or II Class Train-fare against submission of original tickets.
FREE : CORPORATE MARKETING TRAINING & CERTIFICATE IF SELECTED.
SALARY PACKAGE BASED ON QUALIFICATIONS AND EXPERIENCE. DISTRICT BOYS WILL BE PROVIDED ACCOMMODATION IF SELECTED.
May apply through Email on the following id : career.dollarglobal@gmail.com
For any clarification please call at 90300 24059 (9am to 9pm).
INTERVIEW VENUE — DATE
Dollar — DOLLAR INDUSTRIES LTD
DOLLAR INDUSTRIES LIMITED, C/o SHREYA MARKETINGS, 4-4-90/1, KOKKONDA COMPLEX, METRO PILLLAR NO.29, SULTAN BAZAR, KOTI, HYDERABAD - 500095
MARCH 8th 2020 SUNDAY

WALK IN INTERVIEW
వాయు వేగంతో వార్తాప్రసారాలను కోరుకుంటున్న భారత వీక్షకులకు కొత్త ప్రపంచం... విశ్వవ్యాప్తంగా ఉన్న భారతీయులను అనుసంధానం చేసే బృహత్తర సాధనం... కొత్త పుంతలు తొక్కుతున్న జర్నలిజానికి నిర్వచనం చెబుతూ దేశంలోని అన్ని ప్రాంతీయ భాషల్లో డిజిటల్, కేబుల్ నెట్‌వర్క్‌లలో ప్రసారం కానున్న 24 గంటల న్యూస్ ఛానల్ "ఇండియా నౌ"కి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ క్రింది సిబ్బంది కావలెను. జర్నలిజం, మార్కెటింగ్ రంగాలలో కొత్తగా అడుగుపెట్టాలనుకునే యువతీ యువకులకు ఆహ్వానం.
జిల్లా, నియోజకవర్గ రిపోర్టర్లు | మార్కెటింగ్ స్టాఫ్ | డిటిపి ఆపరేటర్లు
కెమెరామెన్లు | వీడియో ఎడిటర్లు | పిసిఆర్ స్టాఫ్
యాంకర్లు | సబ్ ఎడిటర్లు | గ్రాఫిక్ డిజైనర్లు
లిసెనిస్ట్ | సోషల్ మీడియా స్టాఫ్ | ఫ్రీలాన్స్ జర్నలిస్టులు
Required state wide Directors for Karnataka, Tamilnadu, Kerala, Maharashtra & Delhi.
INDIA NOW — REFLECTION OF TRUTH
GNAANI BROADCASTING INDIA PVT. LTD
#193, HACA Bhavan, Opp. Telangana Assembly, Adarsh Nagar, Hyderabad - 500004, Ph.: 9440254656, 040 23234656
E-mail : careerindianow@gmail.com | www.indianow.tv

వాయిదాల ఉరి.. న్యాయమేదరి?



న్యూఢిల్లీ: యావత్ దేశాన్నీ కుదిపేసిన నిర్భయ పై సామూహిక అత్యాచారం, హత్య కేసులో ఉరిశిక్ష నుంచి తప్పించుకునేందుకు దోషులు శతవిధాలా యత్నిస్తున్నారు. న్యాయం జరుగుతుందని ఆశించిన ప్రతిసారీ నిర్భయ తల్లిదండ్రులకు నిరాశే ఎదురవుతోంది. మృత్యువు తరుముకొస్తున్న ప్రతి సందర్భంలోనూ దోషుల తరఫు న్యాయవాదులు చట్టపరిధిలో శిక్ష అమలును అడ్డుకుంటూనే ఉన్నారు. నిర్భయ దోషుల ఉరిశిక్ష అమలు వాయిదా పడడం ఇది మూడోసారి. న్యాయపరమైన అన్ని అవకాశాలనూ వినియోగించుకునే హక్కు దోషులకుందన్న న్యాయ నిబంధనల నేపథ్యంలో మరణశిక్ష వాయిదా పడుతూ వస్తోంది. మరణశిక్ష పడిన దోషులు క్యూరేటివ్ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా, లేదా క్షమాభిక్ష కోసం రాష్ట్రపతికి అర్జీ పెట్టుకోవడం ద్వారా శిక్ష అమలు కొంతకాలం వాయిదా పడేలా చేసుకోవచ్చు. ఒకసారి క్షమాభిక్షను రాష్ట్రపతి తిరస్కరించినట్టయితే, తిరస్కరణను సవాల్ చేస్తూ కూడా కోర్టుకి వెళ్ళొచ్చు. ఇలాంటి అన్ని అవకాశాలనూ వినియోగించుకుంటూ మరణశిక్షని వాయిదా వేస్తూ వచ్చారు దోషులు. చివరకు తలగోడకేసి కొట్టుకొని కూడా అనారోగ్యం, గాయాలు అయ్యాయన్న నెపంతో ఉరిశిక్షని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

➡ **జనవరి 22, 2020:** ఈ కేసులో జనవరి 7న ఢిల్లీ పటియాలా హౌస్ కోర్టు దోషులు నలుగురినీ జనవరి 22న ఉరితీయాలని తీర్పునిచ్చింది.

➡ **ఫిబ్రవరి 1, 2020:** అయితే ముకేశ్ సింగ్ క్షమాభిక్ష పిటిషన్‌ను రాష్ట్రపతి తిరస్కరించారు. క్షమాభిక్ష తిరస్కరణ అనంతరం ఉరిశిక్షకు 14 రోజుల గడువివ్వాలన్న నిబంధనల మేరకు జనవరి 17న ఢిల్లీ కోర్టు నిర్భయ దోషుల ఉరిశిక్షను తిరిగి వాయిదా వేసి, ఫిబ్రవరి 1న దోషులకు ఉరిశిక్ష అమలు చేయాలంది.

➡ **పవన్ గుప్తా 2012లో** నిర్భయ ఘటన జరిగినప్పుడు తాను మైనర్‌నంటూ జనవరి 17న సుప్రీంకోర్టుకి వెళ్ళా

సాక్షి
మంగళవారం, మార్చి, 3

జాగ్రత్త సుమా! మహా విపత్తిది

మేధ, శాస్త్రసాంకేతికంగా ఎంతో ఎత్తుకు ఎదిగినా... ప్రకృతి ప్రకోపించినపుడు మనిషి నిస్సహాయుడే అని నిరూపిస్తోంది కరోనా మహమ్మారి! దీన్ని కేవలం ఒక అంటువ్యాధిగా చూడలేం! ఒకవైపు నివారణకు మందు, వ్యాక్సిన్ కనుగునే యత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మరో వైపు చాపకింద నీరల్లె వైరస్ విస్తరిస్తోంది. సర్వశక్తులొడ్డి వ్యాప్తి నియంత్రించే ప్రయత్నాలు అత్యున్నత స్థాయిలో జరుగుతున్నాయి. అత్యధిక జనాభాగల చైనా నుంచి క్రమంగా ప్రపంచంలోని దాదాపు మూడో వంతు (60) దేశాలకు వైరస్ విస్తరించింది. ఎక్కడికక్కడ కల్లోలం రేపుతోంది. ఇది కేవలం వైద్యారోగ్య సమస్యగా పరిమితం కాలేదు. సమర్థ చైనా సమస్త మనుగడనే శాసిస్తోంది. ప్రతికూల ప్రభావం మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. విశ్వ విపణి, తుఫానులో చిగురుటాకులా అల్లాడుతోంది. ఇప్పటికే తిష్టవేసిన ఆర్థికమాంద్యాన్ని తాజా స్థితి మరింత మందగింపజేస్తోంది. 'తదుపరి ఏంటి..?' అనేదొక పెద్ద ప్రశ్నగా మానవ సమాజాన్ని భయపెడుతోంది. తమ దేశంలో వ్యాధి నిర్ధారణ అయితే, ప్రబలితే, వ్యాప్తిస్తే... పరిస్థితి ఏమిటి? అని ప్రపంచ దేశాలు బేరీజు వేసుకుంటున్నాయి. భారత్‌లోనూ తాజాగా మరో రెండు పాజిటివ్ కేసుల్ని గుర్తించినట్టు కేంద్ర వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. ఒకటి దేశ రాజధాని ఢిల్లీలో, మరోటి తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో! ఒకరు ఇటలీ నుంచి, మరొకరు దుబాయ్ నుంచి ఈ వైరస్‌తో దేశంలోకి వచ్చారు. వైరస్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికి 3,000 మంది మృత్యువాత పడగా దాదాపు 90 వేల కేసులు నమోద య్యాయి. చైనాలోనే 80 వేలు! బయట అత్యధికంగా దక్షిణ కొరియాలో 4,335 మందికి ఈ వైరస్ సోకింది. ఇరాన్‌లో (66 మరణాలు) 1,501 కేసులు, ఇటలీలో (34 మరణాలు) 1,694 కేసులు నమోద య్యాయి. ప్రభావితులైన పలు దేశాలే కాక ఐరోపా సమాజం, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఐక్య రాజ్య సమితి, ప్రపంచ ఆరోగ్య సంస్థ... ఇలా ఎవరికి వారు అప్రమత్తమై ముందు జాగ్రత్తలు తీసు కుంటున్నారు. చైనాతో, ఇతర ప్రభావిత దేశాలతో రాకపోకల్ని నియంత్రిస్తున్నారు. అటునుంచి వస్తున్న వారిపై నిఘావేసి, వైద్యపరీక్షలు జరుపుతున్నారు. ప్రతి పరిణామాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉపశమన చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వాలు, వైద్య సంస్థలు, పౌరులు విధిగా పాటించాల్సిన మార్గదర్శకాలు విడుదల చేస్తున్నారు. ప్రపంచ ప్రభుత్వాలకు, పౌరసమాజాలకు ఇప్పుడిదొక ముఖ్య ఎజెండా, అంతకు మించి సవాల్!

చైనా ఎంత వెలుగో అంత చీకటి! ఎంతటి ఉక్కుపాదమో అంతటి కార్యదక్షత! ఉత్పత్తి, మౌలికసదుపాయాల పరంగా విప్లవాత్మక ప్రగతితో ప్రపంచ మార్కెట్‌ను శాసిస్తున్న చైనా సమాచార పరంగా ప్రజల్ని చీకటిలో ఉంచే పాలనా ఉక్కుపాదం. కరోనా వైరస్, వ్యాధి లక్షణాల గురించి మొదట హెచ్చరిక చేసిన డా॥ లీ వెన్లియాంగ్‌ని చైనా పాలకులు తప్పుబట్టారు. అదీ, వైరస్ పుట్టిన వుహాన్‌లో! ఆయన చెప్పేది తప్పని, సమాజ క్రమత చెడగొట్టే యత్నమని నిందించారు. వ్యాధి సోకి డా॥ లీ తానే స్వయంగా బలి అయితే గాని నమ్మలేదు. ఆయన చెప్పిందే నిజమని తర్వాత నిర్ధారణ అయింది. వ్యాధి ప్రబలుతున్న ఆరంభంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ పక్షం రోజులకుపైగా కనబడకుండా పోవడం ఇప్పటికీ గొప్పమే! ఏ మాటకామాట... వ్యాధి ప్రమాదకరంగా ప్రబలుతోందని తేలిన తర్వాత చైనా చేపట్టిన చర్యలు అసాధారణం! వేగం అనితర సాధ్యం! ప్రపంచంలో మరే దేశమైనా ఇంతటి కఠిన నిర్బంధాన్ని అమలు చేయగలదా? అని సందేహించే స్థాయిలో చైనా కష్టపడుతోంది. వైరస్ వ్యాప్తిని కఠినంగా కట్టడి చేస్తోంది. ప్రమాణాల ప్రకారం ఏం చేయాలో అక్షరం పొల్లు పోకుండా అదే చేస్తోంది. కోటికిపైగా జనాభా ఉన్న ఒక నగరాన్నే ఏకంగా ఇతర ప్రపంచంతో సంబంధాలు లేకుండా దిగ్బంధనం చేసింది. పట్టుమని పదిరోజుల్లో వేయి పడకల ఆస్పత్రి కట్టింది. వస్తోత్పత్తి పుట్టిళ్లు చైనాలోనే ఇప్పుడు మాస్క్‌ల కొరత వేదిస్తోంది. అది చైనా సమస్య! చైనా నుంచి బయటి సమాజానికి మొత్తం సరఫరా శృంకలం నిలిచిపోయింది, ఇది ప్రపంచ సమస్య! ఆపిల్, ఆడిడాస్... ఇలా ఒక్కటేమిటి లెక్కలేనన్ని కంపెనీలు, కడకు ఐరోపా, అమెరికాతో సహా ప్రపంచమే చేష్టలుడిగి దిక్కులు చూస్తోంది. ఇంతటి కీలక స్థానంలోని చైనా నేడొక ధీనావస్థ! విమానాలు ఎగరటం లేదు. రైళ్లు పరుగెత్తడం లేదు. ఉత్పత్తి, రవాణా నిలిచిపోయింది. జనజీవనం స్తంభించింది. స్తబ్దత రాజ్యమేలుతోంది. ఎంతలో ఎంత తేడా? ఉరుకు-పరుగుల పరవళ్ల చైనాది నేడు నిస్తేజ స్థితి! కర్మాగారాలు పనిచేయట్లేదు, కాలుష్యమూ లేదు. పర్యావరణాన్ని చిన్నచూపు చూసేవారందరికీ ఒక హెచ్చరికలాంటి వాతావరణం ఈ రోజు చైనాలో నెలకొంది. దీన్నుంచి మిగతా ప్రపంచం ఏం పాఠం నేర్చుకుంటుందో చూడాలి. ఎవరి సంగతెలా ఉన్నా, భారత్ సత్వరం అప్రమత్తం కావాలి. రాగల ప్రమాదాన్ని సరిగ్గా అంచనా వేసి నివారణ చర్యలకు నడుం కట్టాలి. కేవలం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని పౌర సమాజం చేతులు కట్టుకు నిలబడితే తీరని అన్యాయమే! కొవిడ్-19ని ఒక వ్యాధిగా కాకుండా ఉపద్రవంగా చూడాలి. ఎందుకంటే, మన దేశంలో అరకొర వైద్య సదుపాయాలు, చాలీచాలని వ్యాధినివారణా వ్యవస్థలు, నిబంధనలంటే భయంలేని జనాలు.. వ్యాధి వ్యాప్తిని నిలువరించడంలో అవరోధంగా మారుతాయి. చైనా లాగా కఠిన నియంత్రణ ఇక్కడ కనీసం ఊహించలేము. వైరస్ మనిషికి సోకిన తర్వాత రెండు వారాలు లోలోపల ఉండి, అంతర్గత రోగ నిరోధక వ్యవస్థను చిద్రం చేసిన తర్వాత గాని వ్యాధి లక్షణాలు బయటపడవు. ముందే ప్రతివారూ తమ సహజ రోగనిరోధక వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల్ని, నిబంధనల్ని విధిగా పాటించాలి. వైద్య వ్యవస్థకు సహకరించాలి. వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే పరిస్థితుల్ని అధిగమించాలి. వ్యక్తులుగా, సమూహాలుగా, పౌర సమాజంగా అన్ని స్థాయిలో స్పందించి, తగు నివారణ చర్యలు చేపడితేనే ఈ విపత్తు నుంచి మనం, మన దేశం బయటపడి బాగుంటాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి శు.అష్టమి ఉ.8.45 వరకు, తదుపరి నవమి, నక్షత్రం రోహిణి ఉ.6.02 వరకు, తదుపరి మృగశిర వర్జ్యం ఉ.11.45 నుంచి 1.24 వరకు, దుర్ముహూర్తం ఉ.8.43 నుంచి 9.27 వరకు, తదుపరి రా.10.57 నుంచి 11.46 వరకు అమృతఘడియలు... రా.9.42 నుంచి 11.20 వరకు.

సూర్యోదయం : 6.22
సూర్యాస్తమయం: 6.02
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

'సుప్రీం' చైతన్యం కోల్పోతోందా?!

ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

దేశ అత్యున్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) పౌరహక్కుల్ని రక్షించే కర్తవ్యాన్ని విస్మరించింది. తాజా పౌరసత్వ సవరణ చట్టం ప్రకటిత మతాతీత లౌకిక వ్యవస్థను, దేశ రాజ్యాంగ మౌలిక వ్యవస్థనూ ఉల్లంఘిస్తోందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. పౌరుల ప్రాథమిక పౌరహక్కుల్ని, ముఖ్యంగా హెబియస్ పిటిషన్‌కి సంబంధించిన ముఖ్యమైన కేసులకు ప్రాధాన్యమివ్వడంలో ధర్మాసనం సాచివేత వైఖరి ఆశాభంగం కలిగిస్తోంది. భారత రాజ్యాంగ చట్టాన్ని ధిక్కరిస్తున్న నేటి పౌరసత్వ సవరణ చట్టం, పౌరులందరూ రాజ్యాంగ చట్టం నిర్దేశించిన సమన్యాయానికి అర్హులని నిర్దేశిస్తూ హామీ పడిన 14వ అధికరణను అయిదు స్థాయిలలో ఉల్లంఘిస్తోంది. తాజా సవరణ చట్టానికి 2014 డిసెంబర్ 31 అని ఆలోగా పౌరులు నమోదు చేసుకోవాలనే నిబంధనను నేను అర్థం చేసుకోలేకపోతున్నాను. దీనర్థం ఏతావాతా, ఆ తేదీ తర్వాత దేశంలోని మైనారిటీలను వేధించడం ఆగిపోతుందని అర్థమా లేదా ఆ తర్వాత భారత ప్రభుత్వం మైనారిటీలను పట్టించుకోబోదనా? భారత రాజ్యాంగ నిర్మాతలలో నూటికి 80 మంది హిందువులేనని వీరంతా పౌరసత్వ సవరణ చట్టాన్ని చూసి కుపితులవుతారని, ఈ తాజా చట్టం తమను మోసగించిందని భావించడం 'అనివార్యం'

- సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.పి. షా ఇంటర్వ్యూ (31-1-2020)

బీజేపీ-ఆరెస్సెస్ ఎన్డీయే పాలకులు కొత్తగా పౌరసత్వ చట్టాన్ని (సీఏఏ) జాతీయ జనాభా లెక్కల చిత్తా-ఆవర్జా రిజిస్ట్రేషన్ చట్టం (ఎన్.పి.ఆర్,), జాతీయ స్థాయిలో పౌరుల నమోదు చట్టం పేరుతో మూడురకాల గందరగోళ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన తర్వాత పాలకులు ఎందుకీ చట్టాలను పౌరులపై రుద్దుతున్నారన్న అనుమానాలు చర్చలు మొదలయ్యాయి. మొదలవటమే కాదు ఇటీవలి కాలంలో ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన గత అయిదేళ్ల కాలంలోనూ దేశ అత్యున్నత న్యాయస్థానం అనుసరిస్తున్న విధానాలలోనూ, తీర్పులలోనూ కూడా దేశ ప్రజలు కొన్ని మార్పుల్ని పసిగట్టగలుగుతున్నారు. అనేక తీర్పుల సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం పైన లేదా కొందరు న్యాయమూర్తుల పైన పాలకవర్గం ఒత్తిళ్లు ఒకమేరకు ఉన్నట్లుగా దేశప్రజలలో అనుమానాలు మొలకెత్తుతున్నాయి. పైన తెల్పిన మూడు రకాలుగా పౌరులను వేధిస్తున్న సవరణ చట్టాల విషయంలోనే గాక అంతకుముందు బాబ్రీమసీదు కూల్చివేతకు సంబంధించిన పరిణామాల పూర్వరంగంలో ఇటీవల ధర్మాసనంలోని కొందరు న్యాయమూర్తులు వెలువరించిన తీర్పులు కూడా పౌరులలో అనుమానాలకు దారితీసింది. దానికి తగినట్లుగానే ఇటీవల ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షాలు పైన తెలిపిన మూడురకాల వేధింపు చట్టాలకు సమర్థనగా చేస్తున్న ప్రకటనలు ఆడలేక మద్దెల ఓడు అన్న సామెతలా ఉంది. సుప్రీంకోర్టు తాలూకు కొన్ని ధర్మాసన తీర్పులపై 'నమ్మకం' (ఎలా కలిగిందన్న ప్రశ్న మనం వేయకూడదు) పాలకులకు ఎలా కలిగి ఉంటుందన్న ప్రశ్నకు ప్రధాని మోదీ వివరించిన తీరే సాక్ష్యం. ఫిబ్రవరి 23, 2020న దేశ రాజధానిలో ప్రారంభమైన అంతర్జాతీయ న్యాయసదస్సులో మోదీ ప్రసంగిస్తూ, మారుతున్న ప్రపంచంలో న్యాయవ్యవస్థ కూడా ఎలా ఒదిగిపోతోందో చెప్పకనే చెప్పారు.

తీర్పుల్ని జనం స్వాగతిస్తున్నారా?

మోదీ మాటల్లోనే చెప్పాలంటే, దేశంలో క్లిష్టమైన అంశాలపైన ఇటీవల కాలంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులు ప్రపంచవ్యాప్తంగా చర్చకు కారణమయ్యాయి. తీర్పు ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు ముందుగా వ్యక్తమైనా, వాటిని పట్టించుకోకుండా దేశంలోని వందకోట్ల పైగా ప్రజలు న్యాయస్థానం తీర్పులను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారని మోదీ చెప్పారు. ఇందుకు ఉదాహరణలుగా ఆయన అయోధ్య వివాదంపై భట్టిప్రోలు పంచాయితీలాగా కోర్టు ఇచ్చిన తీర్పును మోదీ ఎందుకు, ఏ పరిస్థితుల్లో తలకెత్తుకోవలసి వచ్చిందో దేశ ప్రజలకు అర్థమైపోయింది. భయాలున్నా ప్రజలు కోర్టు తీర్పుల్ని

రెండో మాట

స్వాగతించారని మోదీ చెప్పే మాటల వెనుక అంతర్లీనంగా దాచుకోలేని బెదిరింపు ధోరణి కూడా ఉంది. అదే విధంగా పౌర జీవితాలను చట్టసభలలోని 'బ్రూట్ మెజారిటీ' ద్వారా శాసించ గోరుతున్న అమిత్‌షా ఇటీవల పౌర జీవితాల్ని శాసించే మూడు ప్రజా వ్యతిరేక నిబంధనలను (సీఏఏ, ఎన్‌పీఆర్, ఎన్‌సీఆర్) సమర్థించుకుంటూ దేశవ్యాపితంగా ఆ నిబంధనలకు వ్యతిరేకంగా పెక్కు రాష్ట్రాలలో, ప్రాంతాలలో న్యాయ బద్ధంగా చెలరేగిన నిరసనల సందర్భంగా చేసిన ప్రకటనలు కూడా 'పుండుమీద కారం' చల్లినట్టుగానే ఉన్నాయి. ఎంతసేపూ పౌరులంటే-రాజ్యాంగం గుర్తించిన సర్వమత, సర్వ విశ్వాసాల సమాహారంగా నెలకొని కొనసాగుతున్న సెక్యులర్ వ్యవస్థ అన్న స్పృహను పక్కనపెట్టి, శతాబ్దాల తరబడిగా కలసిమెలసి ఉంటున్న సకల మతస్తుల లౌకిక జీవనానికి ఎసరుపెట్టి దేశ సమైక్యతా వ్యవస్థ నవనాడుల్ని కూల్చివేసే ధోరణిని పాలకులు అనుసరిస్తున్నారు.

వేరుగా చూడటం జన్యు లక్షణంగా మారిందా?

మధ్యాసియా నుంచి, వోల్గా నుంచి గంగా తీరం దాకా, సింధు నాగరికత వరకూ అసలు తొడిగి కొసలు సాగిన సకల విశ్వాసాల సమాహారంగా సాగిన ఖండాల, ఉపఖండాల మానవయాత్రలు- కలివిడిగా సాగి స్థిరపడినవేనన్న మౌలిక సత్యాన్ని మరవరాదు. అయినా ఈ మానవ వలస యాత్రలలో భాగంగా అష్టకష్టాల మధ్య భారత ఉపఖండంలో స్థిరపడినవారు-అమిత్‌షా భావిస్తున్నట్టు ఒక్క హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులే కాదు, ముస్లిములూ ఉన్నారు. అసలు 'హిందూ' పదమే 'సింధు' పదం నుంచి పుట్టింది. భారత దేశంలో ప్రవేశించిన పర్షియన్లు (మధ్యాసియా వారు) 'స' అక్షరం పలకలేరు, కనుకనే 'స'ను 'హ'గా వారు ఉచ్చరించడంవల్ల క్రమంగా 'సింధు' నాగరికత కాస్తా 'హిందూ' నాగరికత అని పేరు పడిందని మహా పండిత రాహుల్ సాంకృత్యాయన్ నిగ్గుతేల్చారు. అయినాసరే, హిందూ మహాసభ నాయకుడు డాక్టర్ మూంజీ ప్రభృతులు రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో ఫాసిస్టులయిన ముస్సోలినీ, హిట్లర్‌లను కలుసుకొచ్చింది లగాయతూ గోల్వాల్కర్ దాకా, మత ప్రాతిపదికపై దేశవిభజనకు 'ముహూర్తం' పెట్టేదాకా, ఆ దరిమిలా ఈ క్షణం దాకా భారతదేశంలో ఇంతకాలం అంతర్భాగమైన ముస్లింలను హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనుల నుంచి వేరుగా చూడటం జరుగుతోంది, అదొక జన్యు లక్షణంగా మారింది. అందుకనే అమిత్‌షా పౌరసత్వ సవరణ చట్టాన్ని 'మెలిపెట్టి' కొత్త ట్విస్ట్ ఇవ్వడానికి ప్రయత్నించాడు. 'దేశ విభజన తరువాత కాందిశీకులయినవారు డాక్యుమెంట్లు సాక్ష్యంగా చూపాల్సి ఉంటుందని కొందరు భయపెడుతున్నారు. అలాంటిదేమీ లేదంటూనే' అమిత్‌షా 'హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు ఎలాంటి పౌరసత్వ నిరూపణ పత్రాలు చూపనక్కరలేద'ని చెప్పారేగానీ, అదే సూత్రాన్ని బంగ్లాదేశ్, అఫ్గానిస్తాన్, పాకిస్తాన్ నుంచి వచ్చే కాందిశీకులకు వర్తింపజేయ నిరాకరిస్తున్నారు.

సుదీర్ఘ చరిత్ర విస్తరించి ఉన్న మానవేతిహాసంలో ముస్లిములని, హిందువులనీ, సిక్కులనీ, బౌద్ధులు, జైనులనీ విడగొట్టి సామరస్య చరిత్రను మంటగలుపుతూ, సెక్యులర్ వ్యవస్థను కూల్చజూసే దేశ విభజన 'సిద్ధాంతాల్ని' ప్రజలు బహిష్కరించవలసిన సమయం వచ్చింది. ఈ ప్రతీపశక్తులవల్ల అన్ని రకాల వలస సామ్రాజ్య పాలకులు దేశ స్వాతంత్ర్య యోధులపైన, ప్రతిఘటనా శక్తులపైన డిటెన్షన్ చట్టాలను, 'దేశద్రోహ' నేర చట్టాలను నిరంకుశంగా ప్రయోగిస్తూ వచ్చారు. ఆ 'ఎంగిలి' చట్టాలనే ఇంతకుముందు కాంగ్రెస్ (ఎమర్జెన్సీ కాలం), ఇప్పుడు బీజేపీ పాలకులూ దేశ పౌరుల నోళ్లు నొక్కడానికి, సెక్యులర్ వ్యవస్థ సంరక్షణ కోసం వాడవాడలా ఉద్యమిస్తున్న యువతను, ప్రజాతంత్ర శక్తుల ప్రతిఘటనను అణచడం కోసం వినియోగిస్తున్నారు. ఎటువంటి విచారణ లేకుండా విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల జాగృత యువత వెన్ను విరవడానికి వలస చట్టాలనే వినియోగిస్తున్నారు.

సామాన్యుల యుద్ధభేరీలు వీధుల్లోంచే మోగుతాయి

ఫ్రెంచి విప్లవ కాలంలో బాస్టిల్లీ దుర్గం విప్లవ ప్రజాగ్రహంతో కుప్పకూలిన సందర్భంగా ఫ్రెంచి మహామేధావిని వోల్టేర్ విచారణ లేకుండా నిర్బంధించినప్పుడు తన వాదనను వినిపించే అవకాశాన్ని ఆయనకు ప్రభు వర్గాలు నిరాకరించాయి. ఆ అనుభవంతో ఆయన మొత్తం ఫ్రెంచి న్యాయ వ్యవస్థనే మూలముట్టుగా సంస్కరించడానికి నడుంకట్టాడని మరవరాదు. ఎందుకంటే, దేశ పరిస్థితులు కష్టకాలంలోనే ప్రజల్ని, యువతను చైతన్యంలోకి నడిపించి ధర్మ పోరాటానికి సిద్ధపరుస్తాయి. వీధుల నుంచే సామాన్యులు యుద్ధభేరీలు మోగిస్తారు, అన్యాయాన్ని దౌర్భాగ్యపు ప్రజా వ్యతిరేక చట్టాలను బలంగా నిరసిస్తారు. ఈ మార్పు మిణుకుమిణుకుమంటూ అజ్ఞాతంలోకి జారుకుంటున్న న్యాయ వ్యవస్థను కూడా నిద్ర లేపుతుంది. ఎందుకంటే సోలన్ అన్నట్టు ఈ 'చట్టాలనేవి సాలెగూడు లాంటివి. ఆ గూడులోకి ఓ బలహీనమైన ప్రాణి దూరిందంటే, అది కాస్తా ఇరుక్కుపోయి బయటపడలేదు. కానీ అదే సాలెగూటిలోకి ఓ పెద్ద ప్రాణి దూరినా, తప్పించుకు రాగలదు. అలాంటిదే చట్టాల వల'! అలాగే ప్రజా వ్యతిరేక ఇనుప చట్టాల కింద నలిగిపోతున్న పేదవాళ్ల ఆగ్రహం పరిస్థితుల్ని ఇలాగే కొనసాగనిస్తే ఎలా ఉంటుందో ఓ మహాకవి కవితాపరంగా చెబుతున్నాడు:

'ఒక మనిషిని పది పిల్లలుగా చీల్చే ఆగ్రహం/ పది పిల్లల్ని నూరు పుప్పులుగా కూర్చే ఆగ్రహం/ నూరు పుప్పుల్ని వెయ్యి కత్తులుగా మార్చే ఆగ్రహం/పేదవాళ్ల ఆగ్రహం/ రెండు అగ్ని పర్వతాల ఎదుట/ ఒక భూకంపాన్ని నిలబెడుతుంది/ వంద డొక్కల్ని ఒక రెక్కగా చేర్చే ఆగ్రహం/లక్ష చుక్కల్ని ఒక పాటగా/ పేర్చే ఆగ్రహం పేదవాళ్ల ఆగ్రహం/ రెండు పోలీసు టోపీల ఎదుట ఈ గీతాన్ని నిలబెడుతుంది'!

అలా నిలబడిన గీతం లక్ష కంఠాల్ని కుదిపి కదుపుతోంది!!

abkprasad2006@yahoo.co.in

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నష్టం

"సీఏఏ వల్ల మైనారిటీ వర్గానికి చెందిన ఎవరికీ ఎటువంటి నష్టం ఉండదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చెబుతున్నారు. అదే నిజమైతే, సీఏఏ ఎవరి మీద ప్రభావం చూపుతుందో ఆయన దేశంలోని ప్రజలందరికీ చెప్పాల్సిన అవసరం ఉంది. సీఏఏ వల్ల ఎవరికీ నష్టం లేకపోతే, ఇప్పుడున్న పరిస్థితే తరువాత కూడా కొనసాగేటట్లయితే ప్రభుత్వం చట్టం ఎందుకు రూపొందించినట్టు? మైనారిటీలకు లబ్ధి చేకూర్చడానికే సీఏఏ తీసుకొస్తున్నట్లయితే చట్టంలో పేర్కొన్న మైనారిటీల జాబితాలో ముస్లింలను ఎందుకు మినహాయించారు?"

- పి.చిదంబరం, కాంగ్రెస్ నేత

ప్యాడ్స్

"ఇటీవల ఢిల్లీలో జరిగిన అల్లర్లలో అనేకమంది ప్రజలు సర్వస్వం కోల్పోయారు. వారికి అవసరమైన వాటిని స్వచ్ఛందంగా అందజేస్తున్న ఢిల్లీలోని వారు శానిటరీ న్యాప్‌కిన్స్ కూడా పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నా. కశ్మీర్‌లో నిర్బంధం ప్రారంభమైనప్పుడు శానిటరీ ప్యాడ్స్ లేకపోవడంతో ఎన్ని ఇబ్బందులు పడ్డామో మాకు తెలుసు"

- సఫీనా నబీ, జర్నలిస్ట్

తేదీ

"నాకు తెలిసిన సమాచారం మేరకు సల్మాన్‌ఖాన్ అక్షయ్‌కుమార్‌ను కలిసి లక్ష్మీ బాంబ్ సినిమా విడుదల తేదీని మార్చుకోవలసిందిగా విజ్ఞప్తి చేశాడు. తాను ఈ విషయమై డిస్నీవారికి విజ్ఞప్తి చేస్తానని, అయితే వారు సానుకూల నిర్ణయం తీసుకుంటారని హామీ ఇవ్వలేనని అక్షయ్ చెప్పాడు. అలా సల్మాన్‌కు అక్షయ్ ఒక సాకు చూపించి పంపాడు"

- కమాల్ రషీద్‌ఖాన్, నటుడు

చిట్టీ

"తండ్రి అధికారం పోయింది. ఎమ్మెల్సీ పదవి రేపోమాపో ఊడుతుంది. ఇంకో పక్క అక్రమ సంపాదనల డొంక కదులుతుంటే చిట్టి నాయుడు సైకోపాత్ (Psychopath)లా మారిపోయాడు. చీకట్లో కూర్చుని అందరిపైకి రాళ్లు, పిడకలు విసురుతున్నాడు. బయటకొచ్చి మాట్లాడు చిట్టీ, నీ కామెడీ కోసం అంతా ఎదురుచూస్తున్నారు"

- విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

కథనం

"ఈశాన్య ఢిల్లీలోని అల్లర్లు జరిగిన ప్రాంతాలను నేను సందర్శించా. నిజమే, ముస్లింలు ఎక్కువగా నష్టపోయారు. కానీ, హిందువులు, జైనులకు చెందిన వైష్ణవ్ దాబా, బన్నీ ఐస్‌క్రీమ్ వంటి దుకాణాలన్నీ దగ్ధమయ్యాయి. కథనాలు ప్రసారం చేసే టీవీ చానళ్లు ఈ వాస్తవాన్ని విస్మరించాలనుకుంటే, వారి కథనాలు ఏ చైనా నుంచో, ఆఫ్రికా నుంచో ప్రసారం చేస్తున్నట్టు భావించాల్సి వస్తుంది"

- శంతనూ ఎన్. శర్మ, జర్నలిస్ట్

ఆలోచన

"ఇప్పుడు షారూక్ ఖాన్ నన్ను పిలిచి తన కోసం నా కెరీర్‌నూ, జీవితాన్ని వదులుకోమంటే రెండో ఆలోచన లేకుండా వెంటనే వదులుకుంటా. ఇలా అనడంలో నాకు ఎటువంటి దురుద్దేశమూ లేదు"

- కరణ్ జోహార్, దర్శకుడు

ఇన్‌బాక్స్

వన్య ప్రాణులను రక్షిద్దాం

ప్రపంచ భూభాగం పరిమాణంలో 2.4% ఆక్రమించిన భారతదేశం జీవవైవిధ్యంలో 8% ఆవాసంగా ఉంది. జీవ వైవిధ్యంలో భాగమైన జీవ జాతులకు భారతదేశంతో పాటు ప్రపంచదేశాలలో గత కొంత కాలంగా రక్షణ కరువై అంతరించిపోవడం జరుగుతున్నాయని అనేక అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా భారత్‌లో గత రెండున్నర దశాబ్దాలుగా చాలా పక్షిజాతుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని 15 వేల మందికి పైగా ఔత్సాహికులు అందించిన వివరాల ఆధారంగా 'ద స్టేట్ ఆఫ్ ఇండియాస్ బర్డ్స్' పేరుతో వెలువడిన అధ్యయనం పేర్కొన్నది.

వన్యమృగాలు, మత్స్య సంపద, వృక్షాల రకాలు, దాదాపు మొత్తం మరో ఏడు వేల రకాలు అంతరించి పోయే జాబితాలో ఇప్పుడు చేరాయని ప్రకృతి సంరక్షణ అంతర్జాతీయ సమాజం హెచ్చరించింది. ఇది ప్రపంచం మొత్తం మీద 1,05,000 తెగలను సమీక్షించింది. వీటిలో 28,000 తెగలు చాలా ప్రమాదంలో ఉన్నాయని, వివరించింది. చారిత్రకంగా వన్య ప్రాణులకు మానవునికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. భారత్ వన్యప్రాణుల కోసం అనేక ప్రత్యేక సంరక్షణ చర్యలతో పాటు చట్టపరమైన చర్యలు కూడా చేపట్టడం జరుగుతుంది. ముఖ్యంగా వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972, జీవ వైవిధ్య సంరక్షణ చట్టం 2002, అడవుల సంరక్షణ చట్టం 1980ను పటిష్టంగా అమలు పరచాలి.

అదేవిధంగా జీవ వైవిధ్య సమతుల్యతలో వన్యప్రాణుల ప్రాముఖ్యతపై పాఠశాల స్థాయిలోనే అవగాహన కలిగించాలి. వన్యప్రాణుల సంరక్షణలో ప్రభుత్వానికి మరియు అటవీ అధికారులకు సహకరించాలి మరియు వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని భావించాలి. లేదంటే వాటి అస్తిత్వాన్ని చారిత్రకంగా చెప్పుకోవడం తప్ప, భౌతికంగా ముందు తరాలకు చూపించలేము.

(నేడు ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం)

సంపతి రమేష్ మహారాజ్,
జన విజ్ఞాన వేదిక
మొబైల్ : 99595 56367

ట్రంపూ-విశాఖపట్టణం-మనమూ!

సందర్భం

జాన్‌సన్ చోరగుడి

ఇప్పటికే దేశ సరిహద్దుల్ని చుట్టుముట్టిన చైనా 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్టు విషయంలో ఏ నిర్ణయం తీసుకోలేక, ఐదేళ్ళుగా చేసిన తాత్సారం కారణంగా, చివరికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాక ఏక పక్షం అయింది. పర్యటన తర్వాత ఎవరికెంత ప్రయోజనం అంటూ వేస్తున్న లాభ నష్టాల లెక్కల్లో ఏ విలువ లేదు. అమెరికా గత సంవత్సరం థాయ్‌లాండ్‌లో జరిగిన 'ఆసియాన్' సదస్సులోనే ఇందుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికను సిద్ధం చేసుకుంది.

ఆగ్నేయ ఆసియా దాటి ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాలోకి ప్రవేశించాలనే చైనా దూకుడును ఆపాలని బరాక్ ఒబామా తన రెండవ 'టర్మ్'లో ఆసియా-పసిఫిక్ కేంద్రిత విదేశీ విధానం ప్రకటించినా ట్రంప్ దాన్ని కొనసాగించలేదు. ఇండియాలో ఎన్నికలు ముగిశాక, అక్టోబరు 2019లో ప్రధాని నరేంద్ర మోడీ చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ ల మధ్య మహాబలిపురం సౌహార్ద్ర సమావేశం జరిగిన

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
మంగళవారం ॥ 3-3-2020

11 మంది మహిళా శాస్త్రవేత్తల పేరున అధ్యయన పీఠాలు



శాస్త్ర శిఖరాలు

స్త్రీని వంటింటికే పరిమితం చేస్తే
ఆ వంట దినుసులతోనే ప్రయోగాలు చేసి
దేశానికి పౌష్టికత్వాన్ని ఇచ్చింది.
స్త్రీని చదువుకోనిస్తే కుటుంబానికే వెలుతురు ఇచ్చింది.
స్త్రీ ఇంటి నుంచి ప్రయోగశాల వరకు చేరడానికి చాలాకాలమే పట్టింది.
కానీ శాస్త్రాన్వేషణలో స్త్రీ దృష్టి తిరుగులేనిదని పదే పదే నిరూపితమైంది.
మగవారి ప్రభావం అధికంగా ఉండటం వల్ల
చాలామంది మహిళా శాస్త్రవేత్తలు
అజ్ఞాతంలోనే ఉండిపోవలసి వచ్చింది.
మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం.
సైన్స్‌లో విశేష సేవలు చేసి ఎందరో బాలికలు
ఆ రంగం వైపు అడుగుపెట్టేలా నిలిచిన
11 మంది శాస్త్రవేత్తలను గౌరవించుకునేందుకు
వారి పేరున కేంద్ర ప్రభుత్వం అధ్యయన పీఠాలను స్థాపించనుంది.
ఇది గత నూరేళ్ల కాలంలో స్త్రీలు
శాస్త్రవేత్తలుగా చేసిన కృషికి ఒక సత్కారం. ఒక అభివాదం.

అన్నా మణి (1918-2001)
మెటరాలజిస్ట్

భౌతిక, వాతావరణ శాస్త్రవేత్తగా అన్నా మణి చిరపరిచితురాలు. వాతావరణ శాస్త్రానికి ఉపయోగపడే పలు పరికరాల తయారీలో కీలక పాత్ర పోషించారు. సూర్యుడి రేడియోధార్మికత, ఓజోన్‌లతోపాటు పవనశక్తిని కొలిచే విషయంపై పలు పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. తమిళనాడులోని రామనాథపురంలో పుట్టిన అన్నా మణి మద్రాస్‌లోని పాచియప్ప కాలేజీ నుంచి భౌతికశాస్త్ర, రసాయన శాస్త్ర విద్యను అభ్యసించారు. 1940లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్, ఆ తరువాత లండన్‌లోని ఇంపీరియల్ కాలేజీలోనూ చదువుకున్నారు. ఇంపీరియల్ కాలేజీలో ఉండగానే వాతావరణ శాస్త్ర పరికరాల తయారీపై మక్కువ పెంచుకున్నారు. మహాత్మాగాంధీ, జాతీయోద్యమ స్ఫూర్తితో వాతావరణ పరిశోధనల విషయంలో దేశం స్వావలంబన సాధించాలని నిర్ణయించుకున్న అన్నా మణి ఆ దిశగా ప్రయత్నాలు మొదలుపెట్టారు. సుమారు వంద పరికరాల డిజైన్లను సిద్ధం చేశారు. తుంబా రాకెట్ స్టేషన్‌లో వాతావరణ కేంద్రం ఏర్పాటు చేయడంలో అన్నా మణిదే కీలకపాత్ర. అవివాహితగానే మిగిలిపోయిన అన్నా మణి 1969లో భారత వాతావరణ విభాగానికి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1975లో ప్రపంచ వాతావరణ విభాగం సలహాదారుగా ఈజిప్టులో పని చేశారు కూడా.

బిభా చౌదురి (1913-1991)
ఫిజిక్స్

ఆమె పేరును ఓ నక్షత్రానికి పెట్టారు. సెక్స్‌టాన్స్ నక్షత్ర మండలంలోని 'హెచ్‌డీ 86081' నక్షత్రానికి ఇంటర్నేషనల్ అస్ట్రనామికల్ యూనియన్ బిభా చౌదురి పేరు పెట్టింది. కోల్‌కతాలో జన్మించి అక్కడి యూనివర్శిటీలో ఫిజిక్స్ అభ్యసించిన బిభా 1939లో ప్రఖ్యాత బోస్ ఇన్‌స్టిట్యూట్‌లో చేరారు. అక్కడ దేవేంద్ర మోహన్ బోస్‌తో కలిసి ప్రాథమిక కణమైన బోసాన్లను గుర్తించారు. మాంచెస్టర్ యూనివర్శిటీలో పరిశోధనలు చేశాక భారత్ తిరిగి వచ్చి టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఎనిమిదేళ్లపాటు పని చేశారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్ పరిశోధనల్లోనూ కీలక పాత్ర పోషించారు. కోల్‌కతాలోని సాహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో భౌతికశాస్త్ర పాఠాలు చెప్పారు. 1991లో మరణించేంత వరకూ పరిశోధనలు కొనసాగించిన బిభాను 'జాతి మరచిన ఆణిముత్యం'గా పేర్కొంటారు.

అసిమా ఛటర్జీ (1917-2006)
కెమిస్ట్

మూర్ఛ వ్యాధితోపాటు, మలేరియా చికిత్సకు ఉపయోగించే మందుల తయారీలో కీలకపాత్ర పోషించిన అసిమా ఛటర్జీ బెంగాల్‌లో జన్మించి తండ్రి ఇష్టం మేరకు వృక్షశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించారు. దేశంలో సైన్స్‌లో డాక్టరల్ డిగ్రీ పొందిన తొలి మహిళగా 1944లో రికార్డు సృష్టించారు. దిగ్గజ శాస్త్రవేత్తలుగా ఖ్యాతి గడించిన ప్రఫుల్ల చంద్ర రాయ్, సత్యేంద్రనాథ్ బోస్‌ల మార్గదర్శనంలో విస్కాన్సిన్, కాల్‌టెక్‌ల లో పరిశోధనలు నిర్వహించారు. ప్రకృతి సహజమైన ఉత్పత్తుల రసాయన ధర్మాలపై పని చేసిన అసిమా చక్రవర్తి, కీమోథెరపీ మందులు కూడా అభివృద్ధి చేశారు. సుమారు 400 పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. 1975లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జనరల్ ప్రెసిడెంట్‌గానూ వ్యవహరించారు. ఈ ఘనత సాధించిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు కూడా.

రాజేశ్వరి ఛటర్జీ
(1922-2010)
ఇంజినీరింగ్

కర్ణాటక నుంచి ఇంజినీరింగ్ విద్యనభ్యసించిన తొలి మహిళ రాజేశ్వరి ఛటర్జీ. బెంగళూరులోని సెంట్రల్ కాలేజీలో బీఎస్సీ హానర్స్, గణితంలో ఎమ్మెస్సీ చదివి మైసూరు యూనివర్శిటీ పరిధిలో ఫస్ట్ ర్యాంక్ సాధించారు. 1943లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో పరిశోధక విద్యార్థిగా చేరారు. సమాచార ప్రసార రంగంలో పరిశోధనలు ప్రారంభించి నోబెల్ అవార్డు గ్రహీత సర్ సి.వి.రామన్ నేతృత్వంలో పనిచేశారు. 1947 జూలై నెలలో అమెరికా వెళ్లి అక్కడి మిషిగన్ యూనివర్శిటీ నుంచి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యనభ్యసించారు. పీహెచ్‌డీ తరువాత భారత్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్‌లో చేరి దేశంలో తొలిసారి సూక్ష్మ తరంగాలపై పరిశోధనలు చేపట్టారు. సైన్స్ పుస్తకాలు రాశారు. వసుధైక కుటుంబకం పేరుతో రాజేశ్వరి కొంతమంది మహిళలు, పురుషులకు సంబంధించిన వాస్తవ కథనాలను అక్షరబద్ధం చేయడం ఒక విశేషంగా చెప్పుకోవాలి.

కమల్ రణదివే
(1917-2001)
మెడిసిన్

కేన్సర్‌కు వైరస్‌కు మధ్య ఉన్న సంబంధాలను మొట్టమొదట గుర్తించిన బయో మెడికల్ రీసెర్చర్ కమల్ రణదివే. ఇండియన్ విమెన్ సైంటిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యురాలు. మహారాష్ట్రలోని పుణేలో జన్మించిన కమల్ రణదివే ప్రతిభావంతురాలైన విద్యార్థి కూడా. వైద్యం చదవాలి, వైద్యుడినే పెళ్లి చేసుకోవాలని తండ్రి ఆశించినా కమల్ మాత్రం వృక్ష, జంతు శాస్త్రాలను చదువుకున్నారు. 1934లో బీఎస్సీ, ఆ తరువాత పుణేలోని అగ్రికల్చర్ యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ పూర్తి చేశారు. 1943లో సైటోజెనిటిక్స్‌లో ఉన్నత విద్యనభ్యసించిన కమల్ జె.టి.రణదివేను పెళ్లి చేసుకున్న తరువాత ముంబై వెళ్లిపోయారు. అక్కడే టాటా మెమోరియల్ ఆసుపత్రిలో పని చేయడం మొదలుపెట్టారు. 1949లో బాంబే యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్న తరువాత బాల్టిమోర్ యూనివర్శిటీ నుంచి పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ పొందారు. భారత్ తిరిగి వచ్చిన తరువాత ఇండియన్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్‌లో చేరారు. లుకేమియా, రొమ్ము, గొంతు కేన్సర్లకు కారణాలను గుర్తించడంలో కీలకపాత్ర పోషించారు. కేన్సర్ కణితులకు, వైరస్‌కు మధ్య ఉన్న సంబంధాన్ని గుర్తించారు. బ్యాక్టీరియాపై కమల్ చేసిన పరిశోధనల ఆధారంగా కుష్టువ్యాధికి టీకా తయారీ వీలైంది.



రామన్ పరిమళ
(పుట్టింది 1948 నవంబరు 21)
మేథమెటిక్స్

ఆల్జీబ్రా పేరుచెప్పగానే చాలా మంది మనసులో గాభరా మొదలు కావచ్చునేమోగానీ.. రామన్ పరిమళ మాత్రం అందులోనే పుట్టి పెరిగారనడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో ఏళ్లుగా పనిచేస్తున్న ఈ మహిళ గణిత శాస్త్రవేత్త ఎమొరీ యూనివర్శిటీలోనూ ప్రత్యేక అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు. తమిళనాడులో పుట్టి మద్రాస్‌లోని శారద విద్యాలయ, స్టెల్లా మేరిస్‌కాలేజీల్లో చదువుకున్న పరిమళ మద్రాస్ యూనివర్శిటీ నుంచి ఎమ్మెస్సీ, ముంబై యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పొందారు.

కదంబిని గంగూలీ
(1861-1923)
డాక్టర్

దేశంలోనే రెండో మహిళా వైద్యురాలిగా కదంబిని గంగూలీ ప్రసిద్ధురాలు. బ్రిటిష్ కాలంలో బిహార్‌లోని భాగల్పూర్‌లో జన్మించిన కదంబిని తండ్రి బ్రజ కిశోర్ బసు ఆ కాలంలోనే మహిళ విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన వ్యక్తి. 1863లోనే భాగల్పూర్ మహిళ సమితి పేరుతో సంస్థను ఏర్పాటు చేశారు. బంగ మహిళా విద్యాలయలో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత 1878లో కోల్‌కతా యూనివర్శిటీ ప్రవేశ పరీక్ష పాసై ఆ ఘనత సాధించిన తొలి మహిళగానూ కదంబిని రికార్డు సృష్టించారు. తరువాతి కాలంలో కలకత్తా మెడికల్ కాలేజీలో వైద్యవిద్యను అభ్యసించిన ఆమె 1886లో ఆనందీ గోపాల్ జోషీ తరువాత వైద్యురాలైన రెండో మహిళగా గుర్తింపు పొందారు. 1892లో ఎడిన్‌బరో, గ్లాస్‌గా, డబ్లిన్‌లలో ఉన్నత విద్య అభ్యసించిన తరువాత భారత్ తిరిగి వచ్చారు. బ్రహ్మ సమాజ్ కార్యకర్త ద్వారకనాథ్ గంగూలీని వివాహమాడిన కదంబిని పలు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. 1889 నాటి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు ప్రాతినిధ్యం వహించిన ఐదుగురు మహిళల్లో కదంబిని ఒకరు. తన సామాజిక కార్యక్రమాలు, మహిళా విముక్తి పోరాటాలపై సాంఘిక విమర్శలకు గురైనా ఆమె ఉక్కు సంకల్పం మాత్రం సడలలేదు. తనను అనకూడని మాటలతో నిందించిన బంగబాషీ పత్రికను కోర్టుకీడ్చి ఆ పత్రిక ఎడిటర్ మహేశ్ పాల్‌కు ఆరునెలల జైలు శిక్ష పడేలా చేసిన ధీర వనిత కదంబిని గంగూలీ.

ఇరావతి కర్వే
(1905-1970)
ఆంత్రోపాలజీ

మానవ విజ్ఞాన శాస్త్రంలో దిగ్గజ శాస్త్రవేత్త ఇరావతి కర్వే. మహారాష్ట్రకు చెందిన ఈ మహిళా శాస్త్రవేత్త మహాభారతంలోని పాత్రలను దేవుళ్లుగా కాకుండా చారిత్రక పురుషులుగా భావించి వారి ప్రవర్తన, వ్యక్తిత్వాల ఆధారంగా ఆ కాలం నాటి సమాజాన్ని అధ్యయనం చేశారు. పుణేలోని హుజుర్ పాగాలో ప్రాథమిక విద్యనభ్యసించిన తరువాత ఫెర్గూసన్ కాలేజీలో ఫిలాసఫీ చదువుకున్నారు. తండ్రి ఇష్టాన్ని కాదని దినకర్ ధోండో కర్వేను వివాహమాడిన ఇరావతి భర్త సలహా మేరకు జర్మనీకి వెళ్లి పెద్ద చదువులు చదివారు. ఖైసర్ వైహెల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంత్రోపాలజీ, హ్యూమన్ హెరిడిటీ అండ్ యుజెనిక్స్‌లో డాక్టరేట్ సాధించి తిరిగి వచ్చారు. నాస్తికుడైన భర్త ఆశయాలకు అనుగుణంగా పనిచేశారు. దేశంలోనే తొలి మహిళా మానవ విజ్ఞాన శాస్త్రవేత్తగా ఇరావతికి రికార్డు ఉంది. జానపదాలను సేకరించడం, వాటిని స్త్రీవాద కవిత్వంగా మలచడం ఇరావతి ఇష్టపడ్డ వ్యాసంగం. దేశంలో రాజరిక వ్యవస్థలపైనా పరిశోధనలు చేసిన ఇరావతి హిందు సమాజంపైనా విస్తృత అధ్యయనాలు నిర్వహించారు. మహాభారత పాత్రల ప్రవర్తన, వ్యక్తిత్వాల ఆధారంగా ఆ కాలపు పరిస్థితులపై యుగాంత పేరుతో తనదైన అంచనా ఇచ్చారు.

దర్శన్ రంగనాథన్
(1941-2001)
ఆర్గానిక్ కెమిస్ట్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) డిప్యూటీ డైరెక్టర్ (1998-2001)గా పనిచేసిన దర్శన్ రంగనాథన్ కృత్రిమ రసాయన మూలకాలు, హైబ్రిడ్ పెప్టైడ్, నానోట్యూబుల తయారీలో నిష్ణాతులు. సేంద్రీయ రసాయన శాస్త్రవేత్త. ఢిల్లీకి చెందిన దర్శన్ మర్కాన్ అక్కడే పీహెచ్‌డీ వరకూ చదివారు. ఆ తరువాతి కాలంలో కాన్పూర్ ఐఐటీలో ఉండగా.. సహ విద్యార్థి సుబ్రమణియ రంగనాథన్‌ను వివాహమాడి పలు పుస్తకాలు రచించారు. 1993లో త్రివేంద్రంలోని రీజనల్ రీసెర్చ్ ల్యాబొరేటరీలో చేరిన దర్శన్ ఆ తరువాత 1998లో ఐఐసీటీకి డిప్యూటీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ప్రకృతిలో జరిగే రసాయన ప్రక్రియలను పరిశోధనశాలల్లో కృత్రిమంగా సృష్టించడం.. తద్వారా మానవాళికి ఉపయోగపడే పదార్థాలను సృష్టించడం దర్శన్ పరిశోధనల ప్రత్యేకత. 1997లో రొమ్ము కేన్సర్ బారిన పడ్డ దర్శన్ 2001లో తన పుట్టిన రోజైన జూన్ నాలుగున మరణించారు. ఫార్మా రంగంలో కీలకమైన ఐమిడజోల్ ఉత్పత్తికి ప్రత్యేక పద్ధతిని అభివృద్ధి చేశారు.

అర్చన శర్మ (1932-2008)
సైటోజెనెటిసిస్ట్

విషతుల్యమైన ఆర్సెనిక్ ప్రభావాన్ని మొట్టమొదట అంచనా వేసి ప్రపంచానికి అందించిన జీవకణ శాస్త్రవేత్తగా అర్చన శర్మ సుప్రసిద్ధులు. పుణేలోని విద్యావేత్తల కుటుంబంలో జన్మించిన అర్చన రాజస్థాన్, కోల్‌కతాల్లో విద్యనభ్యసించారు. 1955లో కోల్‌కతా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ చేసిన తరువాత మానవ జన్యుశాస్త్రం, పర్యావరణ ప్రభావాలు తదితర అంశాలపై విస్తృతమైన అధ్యయనం చేశారు. దేశంలో డాక్టర్ ఆఫ్ సైన్స్ బిరుదు (1960) పొందిన రెండో భారతీయ మహిళగా రికార్డు సృష్టించారు. కోల్‌కతా యూనివర్శిటీలోనే ప్రొఫెసర్‌గా పనిచేసి ఆ తరువాత 1983లో యూనివర్శిటీ వృక్షశాస్త్ర విభాగానికి అధ్యక్ష స్థానానికి ఎదిగారు. సుమారు 70 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించిన అర్చన శర్మ యూజీసీలో, నేషనల్ కమిషన్ ఫర్ విమెన్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ టాస్క్‌ఫోర్స్ చైర్ పర్సన్‌గా సేవలందించారు. పదికిపైగా పుస్తకాలు రచించి 300 - 400 పరిశోధన వ్యాసాలు ప్రచురించిన అర్చనశర్మ దేశంలో కణ జీవశాస్త్ర విభాగానికి ఆద్యుడిగా భావించే అరుణ్ కుమార్‌శర్మను వివాహం చేసుకున్నారు.

జానకీ అమ్మళ్
(1897 - 1984)
బోటనిస్ట్

కేరళ అడవులను జల్లెడ పట్టి వాణిజ్యపరంగానూ, ఔషధాలుగానూ ఉపయోగపడే పలు మొక్కలను అందరికీ అందించిన ఘనత వృక్ష శాస్త్రవేత్త జానకీ అమ్మళ్ ఎడలావత కక్కత్‌ది. ఒక్కముక్కలో చెప్పాలంటే ప్రస్తుతం దేశంలో సాగవుతున్న చక్కెర వంగడాల అభివృద్ధి జానకీ అమ్మళ్ హయాంలోనే మొదలయ్యాయని చెప్పవచ్చు. మొక్కల వర్గీకరణ మొదలుకొని కణ జీవశాస్త్రంలోనూ అమూల్యమైన సేవలందించి పద్మశ్రీ అవార్డుకు వన్నె తెచ్చిన మహిళా శాస్త్రవేత్త. చెరకు, వంగ వంటి పంటలపై జానకీ అమ్మళ్ నిర్వహించిన పరిశోధనలు, వాటి ఫలితాలు ఇప్పటికీ అనుసరణీయమైనవే. క్రోమోజోమ్స్ ఆఫ్ కల్టివేటెడ్ ప్లాంట్స్ పేరుతో సి.డి.డార్లింగ్టన్‌తో కలిసి ప్రచురించిన పుస్తకం ప్రపంచ వ్యాప్త పరిశోధన సంస్థలకు బైబిల్ లాంటిది అంటే అతిశయోక్తి కాదు. మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజీ తరువాత 1924లో అమెరికాలోని మిషిగన్‌లో స్నాతకోత్తర విద్య తరువాత కొన్నేళ్లపాటు మద్రాస్‌లోని విమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో అధ్యాపకురాలిగా పనిచేశారు. త్రివేంద్రంలోని మహారాజాస్ కాలేజ్ ఆఫ్ సైన్స్, చక్కెర వంగడాభివృద్ధి కేంద్రం (కోయంబత్తూరు)ల్లోనూ పనిచేశారు. మొదటి ప్రపంచ యుద్ధకాలంలో బ్రిటన్‌లో చిక్కుకుపోయిన జానకీ అమ్మళ్ అక్కడే డాక్టర్ సి.పి.డార్లింగ్టన్‌తో కలిసి పరిశోధనలు కొనసాగించారు. మీకు తెలుసా.. దేశంలో పలు కొత్త వంగడాల అభివృద్ధికి కృషి చేసిన జానకీ అమ్మళ్ పేరుతోనే ఓ రోజా పువ్వు వంగడమూ ఉందని! 1977లో పద్మశ్రీ అవార్డు అందుకున్న జానకీ అమ్మళ్ పేరుతో పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఒక ప్రత్యేక అవార్డు కూడా ఏర్పాటు చేసింది.

- గిలియార్ గోపాలకృష్ణ మయ్యా

మార్చి 3 | వరల్డ్ హియరింగ్ డే

వినరా వినరా నరుడా

'వినదగు నెవ్వరు సెప్పిన' అన్నాడు సుమతీ శతకకారుడు. ఇప్పుడు అందరూ చేస్తున్నది అదే. ఎవరు ఏం చెప్పినా వింటున్నారు. అయితే తర్వాతి లైను ఒకటి ఉంది. 'వినినంతనే వేగపడక వివరింపతగున్'... విన్న వెంటనే వేగంగా ఒక అభిప్రాయానికి రావొద్దని, విన్న దానిలో మంచి ఏదో చెడు ఏదో తేల్చుకుని, విశ్లేషించుకుని, అజా పజా చూసుకొని, సరైన దారిలో వెళ్లేవాడే నీతిపరుడు అని ఈ పద్యం చెబుతుంది.

సరైన మాట పలకడం ఎంత ముఖ్యమో సరైన మాట వినడం, చెవికెక్కించుకోవడం అంతే ముఖ్యం. ఏ నీటి కోసం ముంత పట్టుకుంటే ఆ నీరే దొరుకుతాయన్నట్టు చెప్పుడు మాటలకు చెవిని విడిచి పెడితే ఆ మాటలే చెవి దాకా వస్తాయి. రామాయణంలో మందర మాటలను కైక చెవికెక్కించుకుంది. దాని వల్ల ఒక నష్టం. లంకలో రావణుడు విభీషణుడి మాటలు చెవినెక్కించుకోలేదు. అదొక నష్టం. చెవికి చేరిన మాటను పుటం పెట్టి తీసుకోవడంలోనే మన విజ్ఞత, లౌక్యం, బతుకు సజావుతనం ఉంటాయి.

అంతఃపుర కాంతలు ఇందరు ఉండగా సైరంధ్రీ పై మక్కువ ఏలరా అని కీచకుణ్ణి అతడి సోదరి హెచ్చరిస్తుంది. వినలేదు. ఐదు ఊళ్లు వదిలి పెట్టు... గొడవ ఆగుతుంది అని కృష్ణుడు మాటవరస ప్రతిపాదన చేస్తే దుర్యోధనుడు చెవికేసుకోలేదు. చెవి శుభ్రంగా ఉండి ఉంటే కీచకుడు బతికేవాడు. దుర్యోధనుడు ఆ ప్రతిపాదన కాకపోతే మరో ప్రతిపాదన చేసి నష్టనివారణ చేసుకుని ఉండేవాడు. యుద్ధంలో, దొమ్మీలో, అల్లర్లలో రణగొణ ధ్వనులు అధికం. సత్యం పలుచనైపోతుంది. దాని డెసిబల్ స్థాయి చాలా తక్కువగా ఉంటుంది. అందుకే చాలా అప్రమత్తంగా ఉండాలి. 'అశ్వత్థామ హతః' అని వినపడ్డాక ఆ తర్వాత లో గొంతుకతో పలికిన 'కుంజరః'ను కూడా ద్రోణుడు సరిగా విని ఉంటే చనిపోయింది తన కొడుకు అశ్వత్థామ కాదని, ఆ పేరుతో ఉన్న ఏనుగు అని తెలుసుకొని ప్రాణాలు కాపాడుకుని ఉండేవాడు.

జనుల చెవి ఎప్పుడూ మాయలో పడుతూనే ఉంటుంది. చెడు శబ్దాల ఊబిలోకి దిగుతూనే ఉంటుంది. వారికి మంచి చెప్పడానికి మహాత్ములు, ప్రవక్తలు దిగి రావడాన్నే పనిగా పెట్టుకున్నారు. కొందరు గుడి గోపురం ఎక్కి మరీ చెప్పారు. కొందరు ఊరు వాడలు తిరిగి చెప్పారు. చెడు చెవి ఉన్నవారంతా ఈ మంచి వినిపించడానికి వచ్చిన వారిని పరీక్షలు పెట్టారు. రాళ్లతో కొట్టారు. కడకు కొందరి ప్రాణాలే తీశారు. కాని వారు ఒక్కసారి పలికిన మంచి శతాబ్దాలు గడిచిపోయినా వినబడుతూనే ఉంటుంది. మంచిని వినిపించాలి అనే సంకల్పానికి ఉన్న శక్తి అది. మనం నిద్రపోయేటప్పుడు ఇవాళ ఏ మంచి మాట ఎవరికి వినిపించాం అని ఆలోచిస్తే ఎంత మంచి ఆవరణంలో మనం ఉంటున్నామో అర్థమవుతుంది.

మనం నిద్రపోయేటప్పుడు ఇవాళ ఏ మంచి మాట ఎవరికి వినిపించాం అని ఆలోచిస్తే ఎంత మంచి ఆవరణంలో మనం ఉంటున్నామో అర్థమవుతుంది.

శారీరక బధిరత్వానికి వైద్యం ఉంది. మానసిక బధిరత్వానికి లేదు. ప్రేమను వినకుండా పగను వినేవారు, స్నేహాన్ని వినకుండా ద్వేషాన్ని వినేవారు, శాంతిని వినకుండా యుద్ధాన్ని వినేవారు, ఐకమత్యాన్ని వినకుండా విభజన తత్వాన్ని వినేవారు, మానవత్వాన్ని వినకుండా మతాన్ని వినేవారు, క్షమను వినకుండా శిక్షను వినేవారు నిజమైన, సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉన్నామని చెప్పలేము. చేతులు, కాళ్లు మెదడుకు దూరంగా ఉంటాయి. గుండె కూడా మెదడుకు దూరమే ఉంటుంది. చెవే చాలా దగ్గర. ఇది నింపుకునే జాలి, కరుణ, ఆర్ద్రత మెదడులోకి త్వరగా చేరి మనల్ని దయామూర్తులను చేస్తాయి.

వినలేకపోయే వారి మీద జోకులు వేయడానికి మించిన కుసంస్కారం లేదు. 'చెవిటి మాలోకం', 'సౌండ్ ఇంజనీర్'... ఈ పేర్లు పెట్టడం నవ్వు వచ్చే విషయం ఏ మాత్రం కాదు. నిజానికి వారు అదృష్టవంతులు. 'వాడెంత వీడెంత', 'వాడి సంగతి చూస్తా', 'ఫలానా వాళ్లని చంపేయాలి', 'ఆమెను ఏం చేస్తానో చూడు', 'వాడు తక్కువ నేను ఎక్కువ', 'పో.. వెళ్లి చంపు' లాంటి మాటలు వాళ్ల చెవికి వినిపించవు. ఆ మేరకు వాళ్లు చెడుకు దూరంగా ఉన్నారు. ఈ మాటలను సంపూర్ణంగా వినగలిగే గ్రహణశక్తి ఉన్నా అవి వినక్కర్లేని వివేచనతో ఉండటమే ఇప్పుడు కావలసింది.

చెవికి మంచి ఆహారం ఇవ్వడం అవసరమని గ్రహించండి. ఒక పాట వినిపించండి. సితార్ కచ్చేరిలో మునకలేసేలా చేయండి. ఒక భక్తి గీతానికి పరవశం కానివ్వండి. ఒక ప్రార్థనలో నిమగ్నం అవనివ్వండి. ఒక ఆత్మీయుని పలకరింపుతో తబ్బిబ్బు కానివ్వండి. ఒక మంచి పని చేశాక ఎదుటివారు 'కృతజ్ఞతలు' అని చెబుతుంటే ఆ మాటను మూడు పూటలా మాత్రలా మింగించండి.

చెవి ఆరోగ్యం అంటే సమాజ ఆరోగ్యం. దేశ ఆరోగ్యం. చెడు శబ్దాల స్వచ్ఛభారత్ చేసి మంచి మాటల సమోన్నత భారత్‌గా మలచడమే ఇప్పుడు మన విధి.

- కె

epaper.sakshi.com

ఇలా అయితే ఎలా కరోనా?

కాదేదీ సినిమా షూటింగ్‌కి అవాంతరం అంటారో నిర్మాత. అవును, సినిమా షూటింగ్ ఆగిపోవడానికి.. ఆగకుండా కురిసే వర్షం నుండి అనుకోకుండా వచ్చే వైరస్ కూడా కారణం అవొచ్చు. ప్లాన్ ఎంత పకడ్బందీగా ఉన్నా, నటీనటుల కాల్షీట్లు కావాల్సినన్ని ఉన్నా, కొన్ని సార్లు షూటింగ్ అనుకున్నట్టుగా సాగదు. ప్రస్తుతం ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న వైరస్ – కరోనా. చాలా దేశాలు ప్రాణ భయంలో


కమల్‌హాసన్

ఉన్నాయి. చైనాలో మొదలైన ఈ వైరస్ దెబ్బ అన్ని పరిశ్రమలపై పడింది. సినీ పరిశ్రమ మీద కూడా. ఇలా అకారణంగా ఊడిపడ్డ ఈ వైరస్ కారణంగా పలు సినిమాల షూటింగ్ షెడ్యూళ్లు తారుమారవుతున్నాయి. ఇలా అయితే ఎలా కరో (చెయ్య)నా అనే డైలమాలో కొన్ని యూనిట్లు పడ్డాయి. మొత్తానికి రిలీజ్ అవ్వాల్సిన సినిమాలు వాయిదా పడుతున్నాయి. ప్రమోషన్లు డైలమాలో పడుతున్నాయి. ప్రస్తుతం కరోనా కారణంగా అనూహ్య ఇబ్బందులు ఎదుర్కొన్న సినిమాల గురించి వివరాలు.


టామ్ క్రూజ్

థాయ్ వద్దోయ్

నాగార్జున ప్రస్తుతం 'వైల్డ్ డాగ్' అనే సీరియస్ థ్రిల్లర్ చిత్రం చేస్తున్నారు. ఇందులో ఏసీపీ విజయ్ వర్మ అనే పవర్‌ఫుల్ ఎన్ఐఏ ఆఫీసర్‌గా కనిపిస్తారు. అహిషోర్ సోల్మాన్ దర్శకుడు. ఈ సినిమాలో ఓ కీలక షెడ్యూల్‌ను థాయ్‌ల్యాండ్‌లో జరపాలనుకున్నారు. కరోనా ప్రభావం థాయ్‌ల్యాండ్‌లో కనిపించడంతో ఈ షెడ్యూల్‌ను వాయిదా వేసింది చిత్రబృందం. మరి ఈ షెడ్యూల్‌ను పూర్తి చేయడానికి కరోనా హడావిడి తగ్గాక థాయ్‌ల్యాండ్ వెళతారా? లేకపోతే లొకేషన్‌నే షిఫ్ట్ చేస్తారా? వేచి చూడాలి. వేసవిలో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.

నాగార్జున

భారతీయుడు మళ్లీ వెతుకుతున్నాడు

చైనాలో బయటపడ్డ కరోనా వైరస్ చెన్నైలో రెడీ అవుతున్న 'ఇండియన్ 2'ను ఇబ్బందుల్లో పడేసింది. శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'ఇండియన్ 2'. 1995లో వచ్చిన 'ఇండియన్'కి సీక్వెల్ ఇది. ఈ సినిమాలో ఓ భారీ షెడ్యూల్‌ను చైనాలో పలు లొకేషన్లలో ప్లాన్ చేశారు శంకర్. దీనికి సంబంధించిన లొకేషన్లను కూడా గత ఏడాది సందర్శించి ఫిక్స్ చేసుకున్నారు. ప్రస్తుతం చైనాలో ఉన్న పరిస్థితుల్లో షూటింగ్ చేయడం రిస్క్. దీంతో లొకేషన్‌ను మార్చాలనే ప్లాన్‌లో ఉందట చిత్రబృందం. దీనికోసం మళ్లీ లొకేషన్లు వెతకడం నుంచి ప్రారంభించాలి. దీని వల్ల షూటింగ్ ఆలస్యం అయ్యే అవకాశం కూడా ఉంది.

డేనియల్ క్రేగ్

ఏజెంట్ ప్లాన్ ఇంపాజిబుల్

ఏజెంట్ ఈతన్ హంట్ తన సరికొత్త మిషన్ కోసం ఇటలీ ప్రయాణించాల్సిన పని. అందుకు తగ్గ ప్లాన్‌ని సిద్ధం చేసుకున్నారు కూడా. కానీ అనుకోకుండా కరోనా అతని ప్రయాణానికి బ్రేక్ వేసింది. టామ్ క్రూజ్ ముఖ్య పాత్రలో తెరకెక్కుతున్న యాక్షన్ మూవీ సిరీస్ 'మిషన్ ఇంపాజిబుల్'. ఈ సిరీస్‌లో వస్తున్న ఏడో సినిమా ఇది. ఈ సినిమాలో పలు యాక్షన్ సన్నివేశాలను ఇటలీలో షూట్ చేయాలనుకున్నారు. ఇటలీలోనూ కరోనా కేసులు ఎక్కువగా నమోదు కావడంతో షూటింగ్‌ను వాయిదా వేశారు.

నో వే టు డూ

ప్రపంచాన్ని చుట్టేయగల యాక్షన్ హీరో జేమ్స్‌బాండ్. ప్రస్తుతం ఈ సిరీస్‌లో వస్తున్న తాజా చిత్రం 'నో టైమ్ టు డై'. బాండ్ ఫ్రాంచైజీలో వస్తున్న 25వ చిత్రమిది. ఐదోసారి బాండ్ పాత్రలో డేనియల్ క్రెగ్ నటిస్తున్నారు. ఏప్రిల్‌లో ఈ సినిమా విడుదల కానుంది. అయితే చైనాలో ఓ ప్రమోషనల్ టూర్‌తో పాటు స్పెషల్ ప్రీమియర్స్‌ను ప్లాన్ చేసింది 'నో టైమ్ టు డై' టీమ్. అయితే నో వే టు డూ అనే పరిస్థితి. కరోనా కారణంగా చైనాలో థియేటర్స్ అన్నీ కొన్ని రోజులుగా మూతబడి ఉన్నాయి. కరోనా కారణంగా ప్రమోషనల్ టూర్‌ని క్యాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది. చైనా మార్కెట్‌లో బాండ్ సినిమా విడుదల కాకపోతే సుమారు సుమారు 70 నుంచి 100 మిలియన్ డాలర్ల బిజినెస్ కోల్పోయినట్టే.

ఇలా అనూహ్యంగా వచ్చిన ఈ వైరస్ వల్ల మరికొన్ని హాలీవుడ్ సినిమాలు కూడా ఇబ్బంది ఎదుర్కొంటున్నాయి. మరి ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే ఎంతో సమయం, డబ్బు వృథా కాక మానదు. పరిస్థితులన్నీ చక్కబడి షూటింగ్‌లు, రిలీజ్‌లు ఎప్పటిలానే చకచకా అయిపోవాలని కోరుకుందాం.

పూజా హెగ్డే

ఎనిమిదేళ్ల తర్వాతే స్టార్టింగ్ పాయింట్‌కి!

తెలుగులో బిజీగా ఉన్న పూజా హెగ్డేకి కోలీవుడ్ నుంచి కబురు అందిందని సమాచారం. మాస్ హీరో విజయ్ 65వ సినిమాలో తనను కథానాయికగా అడిగారట. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మించనుంది. బాక్సింగ్ నేపథ్యంలో హిందీలో తీసిన 'సాలా ఖదూస్' ద్వారా దర్శకురాలిగా పరిచయమైన సుధ కొంగర ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారని టాక్. 'సాలా ఖదూస్'కి రీమేక్‌గా తెలుగులో వెంకటేశ్‌తో ఆమె 'గురు' సినిమా తెరకెక్కించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మోహన్‌బాబు కీలక పాత్రలో సూర్య హీరోగా సుధ 'ఆకాశమే నీ హద్దురా' సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రం తర్వాత విజయ్‌తో చేయబోయే సినిమాని పట్టాలెక్కిస్తారట. వార్తల్లో ఉన్న ప్రకారం ఇందులో పూజా హెగ్డే కథానాయికగా కన్‌ఫార్మ్ అయితే ఎనిమిదేళ్ల తర్వాత ఆమె తమిళ సినిమాలో నటిస్తున్నట్లు అవుతుంది. 2012లో చేసిన 'ముగముడి' చిత్రంతోనే పూజా కథానాయికగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'ఒక లైలా కోసం'తో తెలుగులో, 'మొహెంజోదారో'తో హిందీ తెరకు పరిచయమయ్యారు ఈ ఉత్తరాది భామ. ప్రస్తుతం తెలుగులో ప్రభాస్ సరసన ఓ సినిమా, అఖిల్ సరసన 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' చిత్రాల్లో నటిస్తున్నారు పూజా హెగ్డే.

బాలకృష్ణ

ఫైట్‌తో షురూ

'సింహా', 'లెజెండ్' తర్వాత బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో సినిమా సోమవారం మొదలైంది. ద్వారక క్రియేషన్స్ పతాకంపై మిర్యాల రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫైట్‌మాస్టర్స్ రామ్–లక్ష్మణ్ కంపోజ్ చేసిన ఫైట్‌తో ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైంది. ఇప్పటినుండి ఏకధాటిగా ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటుంది. 'సామజవరగమన....' అంటూ ఫుల్ జోష్‌లో ఉన్న ఎస్.ఎస్. తమన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించనున్నారు.

వాస్తవ సంఘటనలతో...

డాక్టర్ రాజశేఖర్ ద్విపాత్రాభినయం చేసిన తాజా చిత్రం 'అర్జున'. మరియం జకారియా హీరోయిన్. కన్మణి దర్శకత్వం వహించారు. నట్టీస్ ఎంటర్‌టైన్మెంట్స్, క్విటీ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై నట్టి కరుణ, నట్టి క్రాంతి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ను నట్టికుమార్ ఆవిష్కరించారు. నట్టి కరుణ, నట్టి క్రాంతి మాట్లాడుతూ– ''ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అద్దంపట్టే చిత్రమిది. వాస్తవ సంఘటనలను ప్రేరణగా తీసుకుని సహజత్వానికి దగ్గరగా తెరకెక్కించాం. సూర్యనారాయణ అనే రైతు పాత్రలో, ఆయన తనయుడు అర్జున పాత్రలోనూ రాజశేఖర్ ఒదిగిపోయారు. తండ్రీకొడుకుల మధ్య వచ్చే భావోద్వేగ సన్నివేశాలు ఓ హైలైట్. దాదాపు 800 థియేటర్లలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం'' అన్నారు.

రాజశేఖర్

పవన్ కల్యాణ్

హిందీ చిత్రం 'పింక్' తెలుగు రీమేక్‌లో పవన్ కల్యాణ్ నటిస్తున్న విషయం తెలిసిందే. వేణు శ్రీరామ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని 'దిల్' రాజు నిర్మిస్తున్నారు. తెలుగు రీమేక్‌కి 'వకీల్ సాబ్' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. సోమవారం టైటిల్‌ని ప్రకటించి, పవన్ కల్యాణ్ లుక్‌ని కూడా విడుదల చేశారు.

కార్తికేయను మించి ఆదరించాలి

- భూమన కరుణాకర్ రెడ్డి


టీజీ విశ్వప్రసాద్, అభిషేక్, చందు, అభినయ రెడ్డి, నిఖిల్, కరుణాకర్ రెడ్డి

''శ్రీకృష్ణుని చుట్టూ అల్లుకున్న కథాంశంతో 'కార్తికేయ 2' సినిమాని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాతలు విశ్వప్రసాద్, అభిషేక్ చెప్పగానే చాలా సంతోషంగా అనిపించింది. 'కార్తికేయ' సినిమాని ప్రేక్షకులు ఎంతగా ఆదించారో అంతకు మించి 'కార్తికేయ 2'ని ఆదరిస్తారని ఆశిస్తున్నా'' అన్నారు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి. నిఖిల్, చందు మొండేటి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'కార్తికేయ 2' సినిమా తిరుమల తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి సన్నిధానంలో సోమవారం ప్రారంభమైంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్‌పై టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్ నిర్మిస్తున్నారు. భూమన కరుణాకర్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేయగా, ఆయన తనయుడు అభినయ రెడ్డి క్లాప్ ఇచ్చారు. నిఖిల్ మాట్లాడుతూ– ''భారతీయ సంప్రదాయాలను 'కార్తికేయ 2'లో అద్భుతంగా చూపెట్టనున్నాం. ఉగాది తర్వాత రెగ్యులర్ షూటింగ్ మొదలు పెట్టి సాధ్యమైనంత త్వరగా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు. ''తాజాగా విడుదల చేసిన 'కార్తికేయ 2' టైటిల్ లోగో, కాన్సెప్ట్ వీడియోకి మంచి స్పందన రావడం హ్యాపీగా ఉంది. ఈ సీక్వెల్ కచ్చితంగా ప్రేక్షకులకు ప్రత్యేకమైన థ్రిల్ ఇస్తుంది'' అన్నారు టి.జి. విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, చందు మొండేటి, సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల.

రాహుల్ పెద్ద హీరో కావాలి

- గోపీచంద్

హరి, రాహుల్, ప్రియ, రాజేంద్రప్రసాద్, గోపీచంద్, పద్మనాభ

''కాలేజ్ కుమార్' ట్రైలర్ చాలా బాగుంది. ఈ కథలో అన్ని భావోద్వేగాలు ఉన్నాయనిపిస్తోంది. దర్శకుడు హరికి ఈ సినిమా తెలుగులో మంచి బ్రేక్ అవ్వాలి'' అన్నారు గోపీచంద్. రాహుల్ విజయ్, ప్రియ వడ్లమాని జంటగా రాజేంద్ర ప్రసాద్, మధుబాల ముఖ్య పాత్రల్లో నటించిన చిత్రం 'కాలేజ్ కుమార్'. ఈ సినిమాతో కన్నడ డైరెక్టర్ హరి సంతోష్ తెలుగుకి పరిచయమవుతున్నారు. లక్ష్మణ్ గౌడ సమర్పణలో ఎల్. పద్మనాభ నిర్మించిన ఈ సినిమా ఈ 6న విడుదలవుతోంది. ప్రీ రిలీజ్ వేడుకలో గోపీచంద్ మాట్లాడుతూ– ''రాజేంద్రప్రసాద్‌గారు సెట్స్‌లో ఉంటే యాక్టింగ్ డిక్షనరీ ఉన్నట్లే. మాలాంటి హీరోలకు యాక్షన్ ఇమేజ్ వచ్చిందంటే కారణం ఫైట్ మాస్టర్స్ విజయ్, రామ్–లక్ష్మణ్‌లే. విజయ్ మాస్టర్ కొడుకు రాహుల్ పెద్ద హీరో కావాలి'' అన్నారు. రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ– ''ఏ నటుడైనా నటిస్తున్నంత కాలం సంతోషంగా ఉంటాడు. ఇన్నేళ్లు వినోదం అందించడం నా పూర్వజన్మ సుకృతం'' అన్నారు. ''మంచి సినిమాలో భాగమైనందుకు సంతోషిస్తున్నా'' అన్నారు మధుబాల. ''కాలేజ్ కుమార్' వంటి మంచి సినిమాని తెలుగు, తమిళ్‌లో చేసే చాన్స్ ఇచ్చిన నిర్మాతకు థ్యాంక్స్'' అన్నారు హరి సంతోష్. ''చదవడం గొప్పా? చదివించడం గొప్పా? అనే విషయంలో తండ్రీకొడుకు మధ్య వచ్చే సన్నివేశాలను దర్శకుడు బాగా తెరకెక్కించారు'' అన్నారు రాహుల్. ప్రియ వడ్లమాని, ఫైట్ మాస్టర్స్ రామ్– లక్ష్మణ్, దర్శకుడు మలినేని గోపీచంద్ తదితరులు మాట్లాడారు.

''లండన్ బాబులు' సినిమా తర్వాత ఒక వైవిధ్యమైన సినిమా చేయాలనుకున్నాను. రెగ్యులర్ ప్రేమకథలు కాకుండా కొత్త నేపథ్యం ఉన్న కథల కోసం చూస్తున్న సమయంలో తమ్మారెడ్డి భరద్వాజగారి ద్వారా 'పలాస 1978' కథ నా దగ్గరకు వచ్చింది. తమ్మారెడ్డిగారికి, మా నాన్నగారికి కథ నచ్చడంతో సినిమా పట్టాలెక్కింది'' అని రక్షిత్ అన్నారు. కరుణకుమార్ దర్శకత్వంలో రక్షిత్, నక్షత్ర జంటగా తెరకెక్కిన చిత్రం 'పలాస 1978'.

సుకుమార్ అభినందనను మర్చిపోలేను

రక్షిత్

తమ్మారెడ్డి భరద్వాజ సమర్పణలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ చిత్రం సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ మాట్లాడుతూ – ''కరుణ కుమార్‌గారు కొన్ని వాస్తవ సంఘటనలతో ఈ కథ రాసుకున్నారు. ఈ సినిమా కోసం శ్రీకాకుళం యాసని ప్రాక్టీస్ చేశా. 40 రోజులు పలాసలో సింగిల్ షెడ్యూల్‌లో సినిమాను పూర్తి చేశాం. షూటింగ్ కంటే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కి ఎక్కువ సమయం పట్టింది. ఇప్పుడు ఇండస్ట్రీ అంతా మా సినిమా గురించి మాట్లాడుకునే దాకా వచ్చామంటే కారణం కరుణ కుమార్. మా సినిమా ప్రివ్యూ చూసినవాళ్లు నా నటన గురించి మాట్లాడుతుంటే సంతోషంగా అనిపించింది. ఇందులో నాలుగు వేరియేషన్స్‌లో కనపడాలి అన్నప్పుడు ఛాలెంజ్‌గా తీసుకున్నాను. పాత్ర కోసం బరువు తగ్గడం, పెరగడం వంటివి చేశాను. 'అసురన్' తరహా సినిమా 'పలాస 1978'. ఈ సినిమా చూసి డైరెక్టర్ సుకుమార్‌గారు అభినందించడం ఎప్పటికీ మర్చిపోలేను. ఆ ఒక్క ఫోన్ కాల్ నాలో నమ్మకం పెంచింది'' అన్నారు.

శోభిత ధూలిపాళ

నీ కన్ను నీలి సముద్రం

సుకుమార్, వైష్ణవ్ తేజ్, కొరటాల శివ, బుచ్చిబాబు

వైష్ణవ్ తేజ్, కృతి శెట్టి జంటగా నటిస్తోన్న చిత్రం 'ఉప్పెన'. సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సానా ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నీ కన్ను నీలి సముద్రం..' అనే పాటను డైరెక్టర్ కొరటాల శివ విడుదల చేశారు. శ్రీమణి రాసిన ఈ పాటను జావెద్ అలీ ఆలపించారు. కొరటాల శివ మాట్లాడుతూ– ''ఈ వేసవికి 'ఉప్పెన' కంటే చల్లనైన, చక్కనైన సినిమా రాదనేది నా ప్రగాఢ నమ్మకం. బుచ్చిబాబు కథ చెప్పిన విధానం చూస్తే సినిమా ఏ స్థాయిలో ఉంటుందోననిపించింది. నాకు తెలిసి ఇంత చక్కని పల్లెటూరి ప్రేమ కథ ఈ మధ్య కాలంలో రాలేదు. నాకు బాగా స్ఫూర్తినిచ్చిన 'సీతాకోకచిలక' లాంటి అనుభూతి ఉన్న సినిమా ఇది. వైష్ణవ్ తేజ్‌కు ఇంతకంటే బెటర్ డెబ్యూ రాదనుకుంటున్నా. 'ఉప్పెన' పెద్ద విజయం సాధించాలి'' అన్నారు. ఏప్రిల్ 2న 'ఉప్పెన' సినిమాని విడుదల చేయడానికి నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుకుమార్, వైష్ణవ్ తేజ్, బుచ్చిబాబు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్‌దత్ సైనుద్దీన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: అనిల్ వై., అశోక్ బి, సీఈఓ: చెర్రీ.

మేజర్‌లో...

ముంబైలోని తాజ్ మహల్ హోటల్‌లో 2008 నవంబర్ 26న జరిగిన ఉగ్రవాద దాడిలో పలువురి ప్రాణాల్ని కాపాడి, తన ప్రాణాల్ని త్యాగం చేశారు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్.ఎస్.జి.) కమాండో మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్. ఆయన జీవితం ఆధారంగా 'మేజర్' సినిమా రూపొందుతోంది. ఈ చిత్రంలో అడివి శేష్ లీడ్ రోల్ చేస్తున్నారు. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రానికి శశికిరణ్ తిక్కా దర్శకత్వం వహిస్తున్నారు. ఘట్టమనేని మహేష్ బాబు (జి.ఎం.బి.) ఎంటర్‌టైన్మెంట్ నిర్మిస్తున్న ఈ సినిమాకి సోనీ పిక్చర్స్ ప్రొడక్షన్స్, ఏ ప్లస్ ఎస్ మూవీస్ సంస్థలు నిర్మాణ భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హిమాచల్ ప్రదేశ్‌లో జరుగుతోంది. ఇందులో శోభిత ధూలిపాళ కీలక పాత్ర చేస్తున్నారని సోమవారం చిత్రబృందం తెలిపింది. ''గూఢచారి' సినిమా తర్వాత 'మేజర్' కోసం శోభితతో మరోసారి కలిసి పనిచేస్తున్నందుకు హ్యాపీగా ఉంది'' అన్నారు అడివి శేష్.

రవీనా టాండన్

చల్నేదొ గాడీ

సౌకర్యవంతమైన ఖరీదు గల కారుల్లో తిరిగే సెలబ్రిటీలు సడన్‌గా ఆటోలో ప్రత్యక్షమైతే వింతగానే ఉంటుంది. అలాంటి ఒక వింతను షేర్ చేసుకున్నారు నటి రవీనా టాండన్. తన మేనకోడలి మెహందీ ఫంక్షన్‌కి వెళ్లడానికి రెడీ అయ్యారామె. కారు సకాలంలో రాకపోవడంతో చల్నేదొ గాడీ అంటూ కూతురు రాషాతో కలసి ఆటోలో బయల్దేరారు. ''ఆటోలో ప్రయాణం చాలా లవ్లీగా అనిపించింది'' అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారామె. మరి.. ఆటో డ్రైవర్ గుర్తు పట్టలేదా? అని ఫాలోయర్స్ అడిగితే– ''గుర్తుపట్టారు. ఆయన పేరు అర్షద్. నా అభిమాని అని చెప్పారు. ఆటో దిగే ముందు ఆయనతో కాసేపు మాట్లాడాను'' అన్నారు రవీనా.


హృతిక్, దీపిక

క్రిష్ కలిపింది ఇద్దర్నీ

హృతిక్ రోషన్, దీపికా పదుకోన్ ఇప్పటి వరకూ కలసి నటించలేదు. అయితే త్వరలోనే ఈ ఇద్దర్నీ జంటగా స్క్రీన్ మీద చూసే అవకాశం ఉందట. హృతిక్ రోషన్ నటించిన సూపర్ హీరో చిత్రం 'క్రిష్' సిరీస్‌లో నాలుగో భాగం షూటింగ్ పట్టాలెక్కడానికి రెడీ అవుతోంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా పదుకోన్ నటిస్తారని బాలీవుడ్ టాక్. 'హృతిక్‌తో కలసి నటించాలనుంది' అని పలు సందర్భాల్లో దీపికా తన ఆసక్తిని తెలిపారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా దీపికా దాదాపు ఫైనల్ అట. అదే నిజమైతే 'క్రిష్' కలిపింది ఇద్దర్నీ అనుకోవాలి. త్వరలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.

బ్రహ్మానందం

యువతకి సందేశం

''రామసక్కనోళ్లు' సినిమా ట్రైలర్ చూస్తుంటే కనీస బాధ్యతలను విస్మరిస్తున్న నేటి యువతకు ఒక మంచి సందేశాన్ని అందిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రం మంచి విజయం సాధించాలి'' అన్నారు మంత్రి హరీష్ రావు. చమ్మక్ చంద్ర, సలీం షేక్ హీరోలుగా, మేఘనా చౌదరి, షాయాజీ షిండే, బ్రహ్మానందం, నాగినీడు, చలపతి ప్రధాన పాత్రల్లో ఫహీం సర్కార్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రామసక్కనోళ్లు'. సునయన పరాంకుశం సమర్పణలో సతీష్ కుమార్ సాత్పడి నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని మంత్రి హరీష్ రావు విడుదల చేశారు. సతీష్ కుమార్ సాత్పడి మాట్లాడుతూ –''ఓ గ్రామంలో కొందరు పెద్ద మనుషులుగా చలామణీ అవుతూ చేసే అరాచకాలను నలుగురు కుర్రాళ్లు ఎలా ఎదుర్కొన్నారు? అన్నదే ఈ చిత్రకథ. త్వరలో విడుదల తేదీ వెల్లడిస్తాం'' అన్నారు. ''ఆదిలాబాద్, నిర్మల్, హైదరాబాద్, విశాఖపట్నం, ఊటీలో సినిమా చిత్రీకరించాం'' అన్నారు ఫహీం సర్కార్. ఈ చిత్రానికి సంగీతం: ఘంటాడి కృష్ణ, కెమెరా: జగన్.

సాయితేజ, తరుణీసింగ్

అసాధారణ ప్రేమకథ

కల్వకోట సాయితేజ, తరుణీసింగ్ జంటగా తెరకెక్కిన చిత్రం 'శివన్. 'ది ఫినామినల్ లవ్ స్టోరీ' అన్నది ఉపశీర్షిక. శివన్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ ఎస్.ఆర్.ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై సంతోష్ రెడ్డి లింగాల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 13న విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''లవ్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. యువతకి కావాల్సిన అంశాలతో పాటు మాస్ అంశాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన మా సినిమా టీజర్, ట్రైలర్, లిరికల్ సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: మీరన్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శంకర్ వంగూరి, సహ నిర్మాత: పున్న మురళి.

సాక్షి సాగుబడి
నల్లగొండ
మంగళవారం 3-3-2020

ప్రపంచవ్యాప్తంగా 1400 పశు జాతులు ఉండేవి. భూతాపోన్నతి వీటికి గొడ్డలిపెట్టుగా మారింది. ఇప్పటికే కొన్ని అంతరించాయి. కొన్ని అంతరించే దశలో ఉన్నాయి. చిన్న, సన్నకారు రైతులకు చేదోడుగా ఉండే ఈ పశు జాతులను పరిరక్షించుకోవడం అత్యవసరం - ఎఫ్.ఎ.ఓ.

శతభిష కార్తె : మార్చి 4 వరకు, పూర్వాభాద్ర కార్తె : మార్చి 5 నుంచి

చిన్న రైతులకు సాగులో చేదోడు పొడ ఎడ్లు

పశువులతో గుంటూరు జిల్లా వలసలో హనుమంతు

పొడ తూర్పు ఆవు పాలన్నీ దూడకే అంటున్న రైతు



పొడ తూర్పు దూడను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంటున్న పశుపోషకుడు గంటల హనుమంతు

పిల్లలతో సమానంగా ప్రేమిస్తాం!

ముత్తాతల కాలం నుంచి పొడ(తూర్పు) ఎడ్లే మాకు జీవనాధారం. వీటితో మా జీవితాలకు విడదీయలేని అనుబంధం ఉంది. మా పిల్లలతో సమానంగా వీటిని మేం ప్రేమిస్తాం. మా తాతలు, తండ్రులు, మేము, మా పిల్లలు అందరం వీటిపైనే ఆధారపడి బతుకుతున్నాం. పిలిస్తే పలుకుతాయి మా ఎడ్లు. కొండలు, గుట్టలు ఎక్కి మేస్తాయి. విజిల్ వేస్తే చాలు చప్పున దిగి వస్తాయి. మా ప్రాంతంలో నెల క్రితమే మేత కరువైంది. మాకున్న 300 పొడ తూర్పు పశువులను తోలుకొని 15 రోజుల క్రితం గుంటూరు జిల్లాకు వలస వచ్చాం. ఇక్కడినుంచి కృష్ణా జిల్లాకు వెళ్తాం. మే, జూన్‌లో వర్షాలు కురిసి పచ్చిమేత మొలిచే వరకూ మాకు సంచార జీవనం తప్పదు. నేను గత పదిహేనేళ్లుగా ప్రతి ఏటా పశువులను తోలుకొని వలస వస్తూ ఉన్నాను. శ్రమ, ఖర్చు అయినా మాకు జీవనాధారమైన పశువులను రక్షించుకోవాల్సిందే. పొడ ఎడ్లకు ప్రభుత్వ గుర్తింపు రావటం సంతోషంగా ఉంది. ప్రభుత్వ ప్రోత్సాహం కావాలి. మా పశువులకు, మాకు, జీతగాళ్లకు బీమా కల్పించాలి.

– గంటల హనుమంతు (96525 21052),
అధ్యక్షుడు, అమ్రాబాద్ పొడ లక్ష్మి గోవుల సంఘం,
బికే లక్ష్మీపుర్ తండా, నాగర్‌కర్నూల్ జిల్లా

పొడ ఎడ్లతో ఆత్మీయ బంధం!

- నల్లమల అటవీ ప్రాంత 'పొడ తూర్పు' పశు జాతికి గుర్తింపు
- కేంద్రం గుర్తింపు పొందిన తొలి తెలంగాణ పశు జాతి ఇదే
- అమ్రాబాద్ అటవీ ప్రాంత రైతాంగ కుటుంబాలకు పొడ ఎడ్లతో అనాదిగా విడదీయరాని ఆత్మీయ అనుబంధం
- పనీ పాటల్లో, పండుగలు పబ్బాలలో పొడ ఎడ్లకు పెద్దపీట
- ప్రభుత్వ గుర్తింపుతో పెరగనున్న పశుపోషకుల ఆదాయం

తెలంగాణకు తలమానికం వంటి పశు జాతి 'పొడ తూర్పు'. తూర్పు కనుమల్లోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ నల్లమల అటవీ ప్రాంతంలో విరాజిల్లుతున్న పశు జాతి ఇది. నాగర్‌కర్నూల్ (పాత మహబూబ్‌నగర్) జిల్లాలోని తూర్పు భాగాన రైతులు, పశుపోషకులు అయిన లంబాడాలు, గొల్లలు, చెంచులకు తరతరాలుగా జీవనాధారంగా నిలుస్తున్నందున ఈ పశుజాతికి 'తూర్పు' అనే మాట వచ్చింది. ఈ జాతి పశువుల దేహంపై పొడ మచ్చలు ఉండటంతో 'పొడ తూర్పు' అని పేరు వచ్చింది. స్థానికులు 'పొడ ఎడ్లు' అని పిలుచుకుంటూ ఉంటారు.

ఈ జాతి ఎడ్లు మెట్ట రైతులకు వ్యవసాయంలో పెద్ద భరోసాగా నిలుస్తున్నాయి. మెట్ట పొలాలను దున్నటంతో పాటు మాగాణుల్లో దమ్ము చేయడానికి, ఇతర వ్యవసాయ పనుల్లో పొడ ఎడ్లు బాగా పనిచేస్తాయి. ఎంత కష్టమైన పనైనా విసుగు విరామం లేకుండా కొనసాగించి పూర్తి చేయటం, చీటికి మాటికి జబ్బుపడకుండా ఉండటం, తక్కువ మేత, తక్కువ నీటితో కూడా మనగలగడం ఈ పశు జాతి ఎడ్లకున్న సుగుణాలు. అందుకే నాగర్‌కర్నూల్ ప్రాంత పశుపోషకులకు, రైతులకు పొడ ఎడ్లంటే అంత మక్కువ. వారి పండుగలు జాతర్లలో ఈ పశువులకు ప్రాధాన్యం ఉంటుంది. పొడ జాతి ఆవులు పాలు తక్కువగా ఇస్తాయి. అందుకే ఆ పాలను కూడా పూర్తిగా దూడలకే వదిలేసే పశుపోషకులు కూడా ఈ ప్రాంతంలో కనిపిస్తారు.

మూడేళ్ల క్రితం వాసన్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పొడ తూర్పు పశు జాతి విశిష్టతల గురించి, స్థానిక పశు సంరక్షక, వ్యవసాయ కుటుంబాల వారు తరతరాలుగా ఈ పశుజాతిని పరిరక్షించుకుంటూ పొట్టపోసుకుంటున్న వైనం గురించి రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. 2016లో, 17లో పొడ ఎడ్ల మేళాలను ఏర్పాటు చేయటంతో ఈ జాతి ఎడ్లంటే వివిధ ప్రాంతాల, రాష్ట్రాల రైతులకున్న మక్కువ వెల్లడైంది. దీంతో తెలంగాణ పశుసంవర్ధక శాఖ పొడ తూర్పు జాతి పశు జాతి జన్యు స్వచ్ఛతను కాపాడాలని సంకల్పించింది. కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు చెయ్యడం నిలిపివేసింది.

ప్రభుత్వ గుర్తింపు పొందిన 44వ పశుజాతి

ఆ తర్వాత రెండేళ్ల పాటు ఈ జాతి పశు సంపద స్థితిగతులపై అధ్యయనం జరిగింది. స్థానిక రైతులు, పశుపోషకుల జీవితాలతో, వారి జీవనోపాదులతో ఈ పశు జాతి తరతరాలుగా ఎంత గాఢంగా పెనవేసుకొని ఉన్నదో అధికారికంగా గుర్తించడానికి ఈ అధ్యయనం తోడ్పడింది. సుమారు 450-500 వరకు లంబాడి, గొల్ల, ఎస్సీ కుటుంబాలు కేవలం పొడ తూర్పు పశు జాతి పోషణనే జీవనాధారంగా చేసుకొని జీవిస్తున్నారు. ప్రస్తుతం ఈ జాతి పశువులు 15,076 ఉన్నాయి. వీటికి ప్రత్యేకంగా మేత వేయటం, దాణా పెట్టడం అవసరం లేదు. పచ్చిక బయళ్లలో, అటవీ ప్రాంతంలో మేసే మేతే చాలు. ప్రత్యేకంగా మేత, దాణా వేయక్కరలేదు.

ఈ నెల 19న కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ పశు జన్యువనరుల బోర్డు(ఎన్.ఎ.పి.జి.ఆర్.) పొడ తూర్పు జాతి పశువులకు గుర్తింపునిస్తూ నిర్ణయం తీసుకుంది. త్వరలో ప్రభుత్వ గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది. ఎన్.ఎ.పి.జి.ఆర్. ఇప్పటికే 43 భారతీయ పశుజాతులను గుర్తించింది. తాజాగా గుర్తింపు పొందిన 'పొడ తూర్పు' 44వది.

రైతుల కన్నా పశుపోషకుల ఆదాయం ఎక్కువ

నాగర్‌కర్నూల్, పాత మహబూబ్‌నగర్ ప్రాంతంలో వర్షాధార వ్యవసాయమే ఎక్కువ. తరచూ కరువు పరిస్థితులను చవిచూసే ఈ ప్రాంత రైతులు వ్యవసాయంపై పొందే ఆదాయం కన్నా 'పొడ తూర్పు' పశువులను పెంచుకుంటూ జీవించే కుటుంబాల ఆదాయం ఎక్కువగా ఉన్నట్లు వాసన్ అధ్యయనంలో తేలింది. 110 మంది పశుపోషకులపై అధ్యయనం చేశారు. వీరంతా కలిసి 'అమ్రాబాద్ పొడ లక్ష్మి గోవు సంఘం'గా సంఘటితమయ్యారు. 80 నుంచి 120 పొడ తూర్పు ఆవులు, ఎద్దులు, దూడల మంద కలిగిన పశుపోషకుడు ఏటా 20 నుంచి 30 వరకు గిత్త దూడలను విక్రయిస్తూ, రూ. లక్షన్నర నుంచి రూ. 3 లక్షల వరకు ఆదాయం గడిస్తున్నారు. 8 నుంచి 15 నెలల గిత్త దూడల ధర రూ.8 వేల నుంచి 15 వేల వరకు పలుకుతోంది. రెండున్నర ఏళ్ల వయసు నుంచి 20 ఏళ్ల వయసు వరకు వ్యవసాయ పనుల్లో ఈ గిత్తలు చాలా ఉపయోగకరంగా ఉంటాయి. ఐదెకరాల మెట్ట భూమిలో వ్యవసాయం చేసే రైతులు సైతం రూ. 30 వేలకు మించి ఆదాయం పొందలేకపోతున్న ఆ ప్రాంతంలో పొడ తూర్పు పశువులను పెంచి గిత్త దూడలను అమ్ముకునే పశుపోషకుల ఆదాయం చాలా ఎక్కువగా ఉందని వాసన్ డైరెక్టర్ డా. సవ్యసాచిదాస్ 'సాక్షి'తో చెప్పారు. మెట్ట ప్రాంత వ్యవసాయానికి చాలా అనువైన ఈ పశుజాతిని పరిరక్షించడం కోసం కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఇందుకు తోడ్పడుతుందని ఆయన అంటున్నారు.

మేత కోసం నెలల తరబడి వలస

దాదాపు 400 ఏళ్ల క్రితం నుంచి ఈ పశుజాతిని స్థానికులు పోషించుకుంటూ జీవనం గడుపుతున్నారని ఒక అంచనా. గతంలో నల్లమల అటవీ ప్రాంతంలో 15 కిలోమీటర్ల లోపలి వరకు వెళ్లి పశువులను మేపుకునే వారు. అయితే, అటవీ శాఖ అధికారులు ఇటీవలి కాలంలో మూడు కిలోమీటర్ల కన్నా లోపలికి అనుమతించడం లేదు. దీంతో శీతాకాలం నుంచే మేత దొరకడం గగనమైపోయింది. జనవరి నెల నుంచి మే, జూన్ నెల వరకు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, కృష్ణాజిల్లాలకు పశువులతో వలస వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

గుర్తింపు వల్ల ఒరిగేదెమిటి?

పొడ తూర్పు పశుజాతికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు రావడం వల్ల తరతరాలుగా ఈ పశు జాతిని పరిరక్షిస్తున్న స్థానిక గ్రామాల్లోని లంబాడాలు, గొల్లలు, చెంచులు, ఎస్సీలకు గ్రామ బయోడైవర్సిటీ మేనేజ్‌మెంట్ కమిటీల (బి.ఎం.సి.ల) ద్వారా ఈ పశుజాతిపై ప్రత్యేక హక్కులు దఖలుపడతాయి. అందువల్ల ఈ పశువులను పెంచే వారికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడానికి వీలవుతుంది. ఈ ఎడ్లను, ఆవులను కొనుగోలు చేసే రైతులు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలు తీసుకోవచ్చు. ఫలితంగా పశుపోషకుల ఆదాయం పెరుగుతుంది.

అంతేకాదు.. అటవీ హక్కుల చట్టం కింద కూడా పొడ తూర్పు పశుపోషకులకు హక్కులు సంక్రమిస్తాయి. అటవీ శాఖ స్థానిక పశుపోషకుల హక్కులను గుర్తించేందుకు, సానుకూలంగా స్పందించడానికి అవకాశం ఉందని వాసన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ డా. సవ్యసాచిదాస్ (94408 04860) ఆశాభావం వ్యక్తం చేశారు.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

8, 22 తేదీల్లో ప్రకృతి సేద్యంపై విజయరామ్ శిక్షణ

సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయ (ఎస్.పి.ఎన్.ఎఫ్.) పద్ధతిపై సొసైటీ ఫర్ అవేర్‌నెస్ అండ్ విజన్ ఆన్ ఎన్విరాన్‌మెంట్ (సేవ్) 'సేవ్' సంస్థ వ్యవస్థాపకులు, ప్రకృతి వ్యవసాయదారులు విజయరామ్ ఈ నెల 8న తిరుపతిలో, 22న రాజమహేంద్రవరంలో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారికి, భవిష్యత్తులో ప్రకృతి వ్యవసాయం చేద్దాం అనుకునే వారికి అవగాహన కల్పిస్తారు. తక్కువ ఖర్చుతో ప్రకృతి వ్యవసాయం, అంతర పంటల ద్వారా అధికాదాయం పొందటం, పంటలను విలువ ఆధారిత ఉత్పత్తులుగా మార్చి అమ్ముకోవటం, వాన నీటి సంరక్షణ పద్ధతులు, వ్యవసాయంలో దేశవాళీ ఆవు, ఎద్దు ప్రాధాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. ప్రవేశ రుసుము రూ. వంద. శిక్షణ సమయం ఉ. 9 గం. నుంచి సా. 5 గం. వరకు. ఆసక్తి గల వారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి.

మార్చి 8 (ఆదివారం)న తిరుపతిలో..

వేదిక: ఎస్వీ యూనివర్సిటీలోని శ్రీనివాస ఆడిటోరియం, తిరుపతి

రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు.. 88849 12344, 94495 96039, 86889 98047

మార్చి 22 (ఆదివారం)న రాజమహేంద్రవరంలో..

వేదిక : శ్రీ ఉమారామలింగేశ్వర కళ్యాణ మండపం, జామ్‌పేట, రాజమహేంద్రవరం. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు.. 94495 96039, 86889 98047, 99498 00201.

16న తమిళనాడులో గులాబీ క్షేత్ర దినోత్సవం

బెంగళూరులోని భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐ.ఐ.హెచ్.ఆర్.) ఆధ్వర్యంలో తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా దొడ్డమంచి గ్రామంలో గల తెలుగు రైతు మంజునాథ్ (79821 17354) కు చెందిన వన్య ఫార్మ్స్‌లో మార్చి 16, సోమవారం నాడు సేంద్రియ గులాబీ పూల సాగుపై క్షేత్ర దినోత్సవాన్ని (రోజ్ ఫీల్డ్ డే) నిర్వహించనుంది. సేంద్రియ పద్ధతుల్లో గులాబీలను సాగు చేస్తూ ఆయన మునగను అంతరపంటగా సాగు చేస్తున్నారు. కూరగాయలు, ఔషధ మొక్కలు కూడా సాగు చేయబోతున్నారు. రైతు క్షేత్రంలో గులాబీల సేంద్రియ సాగును ప్రత్యక్షంగా రైతులకు చూపించడం, సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం, ఐఐహెచ్ఆర్ సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్తలతో రైతులకు ముఖాముఖి అవకాశం కల్పించడం ఫీల్డ్ డే లక్ష్యం. ఉ. 9 గం. నుంచి జరిగే ఈ క్షేత్ర దినోత్సవంలో రైతులకు ఉచిత ప్రవేశం ఉంటుంది. అయితే, 89192 71136 నంబరుకు ఫోన్ చేసి ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది.

సుస్థిర లాభసాటి వ్యవసాయంపై 3 నెలల కోర్సు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నీటి పారుదల-ఆయకట్టు అభివృద్ధి శాఖ, నీరు-భూమి యాజమాన్య శిక్షణ, పరిశోధనా సంస్థ (వాలంతరి-రాజేంద్రనగర్) ఆధ్వర్యంలో 'భూమి, నీటి యాజమాన్యంతో సుస్థిరమైన లాభసాటి వ్యవసాయం'పై 3 నెలల రెసిడెన్షియల్ సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి ఈ నెల 5వ తేదీ లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ నెల 10 నుంచి జూన్ 9 వరకు కోర్సు కాలం ఉంటుంది. ఇంటర్/ఐటిఐ/డిప్లొమా చదివిన 18-30 ఏళ్ల వయసులో గ్రామీణ యువతీ యువకులు అర్హులు. కోర్సు రుసుము రూ. 5 వేలు. ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారు. ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దరఖాస్తు రుసుము రూ. 500. ఈ కోర్సు పూర్తి చేసిన వారు ఆదర్శ రైతుగా ఎదగవచ్చు లేదా వ్యవసాయ కన్సల్టెంట్‌గా స్థిరపడవచ్చు. దరఖాస్తు ఫాం, ఇతర వివరాలకు వెబ్‌సైట్ చూడండి..

www.tswalamtari.cgg.gov.in/

8న కొర్నెపాడులో సూపర్ నేపియర్ సాగుపై శిక్షణ

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో పశుగ్రాసాల సాగు, ప్రత్యేకంగా సూపర్ నేపియర్ గడ్డి సాగు, పశుపోషణపై మార్చి 8(ఆదివారం)న గుంటూరు జిల్లా పుల్లడిగుంట దగ్గర కొర్నెపాడులోని రైతునేస్తం ఫౌండేషన్ రైతు శిక్షణా కేంద్రంలో రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. సూపర్ నేపియర్ కణుపులను ఉచితంగా పంపిణీ చేస్తారు. గన్నవరం పశువైద్య కళాశాల ప్రొఫెసర్ అండ్ హెడ్ డా. సి.హెచ్. వెంకట శేషయ్య, పాడి రైతు విజయ్ (గుంటూరు) రైతులకు శిక్షణ ఇస్తారు. ఉ. 10 గం. నుంచి సా. 4 గం. వరకు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 97053 83666, 0863-2286255.

మిరప ఛాలా!

ప్రకృతి సేద్యంలో లాభాల పంట

- రెండేళ్లుగా పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో దేశీ రకం కావేరి మిరప సాగు
- భూసారం పెంపుదలకు జీవామృతం, ఘనజీవామృతం, వేపపిండి..
- ఉల్లిగడ్డ కషాయం, పంచగవ్య, సప్తధాన్యాంకుర కషాయం, శిలీంధ్రాల పిచికారీ.. నూనె అట్టలు, ఫిరమోన్ ట్రాప్స్‌తో చీడపీడలకు చెక్
- ఎర పంటలుగా ఆముదం, బంతి.. కంచె పంటగా పచ్చజొన్న సాగు
- ఎకరానికి 15 క్వింటాళ్ల ఎండు మిర్చి దిగుబడి

సేంద్రియ/ప్రకృతి సాగులో దేశీ రకం కావేరి మిర్చి తోట

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయ పద్ధతులను పూర్తి స్థాయిలో అనుసరిస్తే మిరప సాగులో చీడపీడలను సమర్థవంతంగా అధిగమించడంతోపాటు అధిక దిగుబడి పొందవచ్చని నిరూపిస్తున్నారు కర్నూలు జిల్లాకు చెందిన రైతు పి. శరత్‌చంద్ర. పాణ్యం మండలం తొగరచేడులో తన మిత్రుడు వై.రామిరెడ్డితో కలిసి ఏడెకరాల్లో రెండేళ్లుగా మిరప పంటను శరత్ సాగు చేస్తున్నారు. నాగర్‌కర్నూలు జిల్లా కారువంకలో గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో అధిక దిగుబడులు సాధిస్తున్న లావణ్య రమణారెడ్డి వద్ద నుంచి కావేరి రకం దేశీ మిర్చి విత్తనాలు తెచ్చుకొని గత ఏడాది నుంచి సాగు చేస్తున్నారు. ఎకరానికి రెండు కిలోల విత్తనాన్ని గొర్రుతో సాళ్లుగా వెద పెట్టి మిరప పంటను సాగు చేయటం విశేషం. సాళ్ల మధ్య రెండు అడుగులు పెడుతున్నారు. మొక్కల మధ్య 9 అంగుళాల నుంచి ఒక అడుగు దూరం ఉంచుతున్నారు. మొలిచిన తర్వాత 2-3 వారాల్లో పోనాటు వేస్తున్నారు.

వెద పద్ధతిలో మిరప సాగు చేయటం వల్ల జెమినీ వైరస్‌ను తట్టుకునే శక్తి పెరిగినట్లు తాము గమనించామని శరత్ తెలిపారు. నారు పీకి మొక్క నాటినప్పుడు.. మొక్క తిరిగి వేరూనుకొని తిప్పుకునే లోగా జెమినీ వైరస్ సోకుతున్నదని, విత్తనం వెద పెట్టినప్పుడు ఆ సమస్య రాదన్నారు. గత ఏడాది ఎకరానికి 15-16 క్వింటాళ్ల ఎండు మిర్చి దిగుబడి సాధించామని, అతివృష్టి వల్ల నష్టం జరిగినప్పటికీ ఈ ఏడాది కూడా అదే స్థాయిలో దిగుబడి వస్తుందని ఆశిస్తున్నామని అంటున్న శరత్ మాటల్లోనే వారి సాగు తీరుతెన్నులు..

ఘనజీవామృతం, వేపపిండి..

దుక్కిలో ఎకరానికి ఘనజీవామృతం 2 టన్నులు, వేపపిండి ఒక టన్ను వేశాం. మిరప విత్తనం వేసిన వెంటనే ద్రవ జీవామృతం పిచికారీ చేశాం. మిరప విత్తనాలు మొలిచిన 15 రోజుల తర్వాత 20 లీ. నీటికి 40 ఎం.ఎల్. చొప్పున 10,000 పిపిఎం వేపనూనె పిచికారీ చేశాం. మొక్కలపై పచ్చదోమ, తామరపురగు గుడ్లుంటే దీని వల్ల పగిలిపోతాయి. ఆ తర్వాత వారానికి జీవామృతం పిచికారీ చేశాం.

విత్తిన నెల తర్వాత ఎకరానికి టన్ను ఘనజీవామృతం, అర టన్ను వేపపిండి వేసి.. నీటి తడి ఇవ్వటంతో పాటు జీవామృతం పారించాము. 45వ రోజు పంచగవ్య (లీటరుకు 9 లీ. నీరు) పిచికారీ చేశాం. అప్పటినుంచి ప్రతి 15 రోజులకోసారి భూమిలో నీటి తడితోపాటు జీవామృతం పారించడం, పంచగవ్య పిచికారీ చేస్తున్నాం.

మిరపతోపాటు ఆముదం, బంతి, జొన్న

మిరప విత్తనాన్ని గొర్రుతో సాళ్లుగా వెదపెట్టిన తర్వాత.. ప్రతి 20 అడుగులకు ఒక ఆముదం మొక్క, ప్రతి 6 అడుగులకు ఒక బంతి మొక్క వేశాం. ఆముదం కొన్ని రకాల పురుగులను దరిచేరనీయదు. బంతిమొక్క వల్ల మిరప మొక్కలకు నులి పురుగుల (నెమటోడ్స్) సమస్య, వేరు కుళ్లు రాకుండా ఉంటాయి. బంతి పూలకు తేనెటీగలు, సీతాకోకచిలుకలు వస్తాయి కాబట్టి పరపరాగ సంపర్కం బాగా జరుగుతుంది. పొలం చుట్టూతా 3 వరుసలు పచ్చ జొన్న విత్తాం. తద్వారా బయటి నుంచి పొలం లోపలికి రసం పీల్చే పురుగులు రాకుండా జొన్న పంట కంచె మాదిరిగా ఉపయోగపడుతుంది. జొన్నలు తినటానికి పక్షులు వస్తాయి. మిరప మొక్కలపై కనిపించే పురుగూ పుట్రను కూడా పక్షులు తింటాయి.

దోమ నివారణకు ఎకరానికి 30 నూనె పూసిన పసుపు రంగు అట్టలను, తామరపురుగులను అరికట్టేందుకు ఎకరానికి 30 నూనె పూసిన నీలం అట్టలను పెట్టాం. మగపురుగులను మట్టుబెట్టేందుకు ఎకరానికి పది ఫెరమోన్ ట్రాప్స్ ఏర్పాటు చేశాం. ఈ విధంగా చీడపీడలను జీవనియంత్రణ పద్ధతుల్లో పంటను రక్షించుకుంటున్నాం.

ఆకు ముడతకు ఉల్లిగడ్డ కషాయం

ఆకు ముడత కనిపిస్తే ఉల్లిగడ్డ కషాయం పిచికారీ చేస్తున్నాం. ఎకరానికి 5 లీ. కషాయం చాలు. 20 లీ. నీటికి ఒక లీ. కషాయం కలిపి చల్లుతున్నాం. ఆకుముడతను అరికడితే జెమినీ వైరస్ రాదు. ఈ కషాయం ద్వారా పోషకాలు కూడా మొక్కలకు అందుతాయి.

ఉల్లిగడ్డ కషాయం తయారీ విధానం : ఈ కషాయం ఒకసారి తయారు చేస్తే 6 నెలలు నిల్వ ఉంటుంది.

సేంద్రియ మిర్చి తోటలో శరత్‌చంద్ర, రామిరెడ్డి

విత్తిన 60-75 రోజుల మధ్యకాలంలో.. బవేరియా బాసియానా శిలీంధ్రాన్ని (లీ. నీటికి 8 ఎం.ఎల్. చొప్పున) పిచికారీ చేశాం. ఇది చల్లిన 10-15 రోజుల మధ్యలో వర్టిసెల్లం లఖాని శిలీంధ్రాన్ని పిచికారీ చేశాం. తామరపురుగులు, దోమను అరికట్టడానికి ఈ శిలీంధ్రాలు బాగా తోడ్పడ్డాయి. మిరప పంటను ఆశించే చీడపీడలను సమర్థవంతంగా నివారించాలంటే ఇలా బహుముఖ వ్యూహాన్ని అమలు పరచక తప్పదు.

జూలై 28న మిరప విత్తనం వేశాం. మార్చి 2 నుంచి మిరప పండ్లు కోస్తున్నాం. 60-70% కాయలు ఎర్రబడిన తర్వాత నీటితడితోపాటు జీవామృతం పారించిన రెండు వారాల తర్వాత మొదటిసారి మిర్చి పండ్లు కోస్తున్నాం. మొదటి కోతలో 80%, ఆ తర్వాత రెండు మూడు కోతల్లో మిగతావి కోసి ఎండబెట్టి, తేమ 10-15%కు తగ్గిన తర్వాత బస్తాలకు ఎత్తి అమ్ముతాం. లేదా కోల్డ్ స్టోరేజ్‌కి తరలిస్తాం.

ఈ ఏడాది అతివృష్టి వల్ల మిరప తోటలు దెబ్బతిన్నాయి. అయినా మా తోటలో ఎకరానికి 15 క్వింటాళ్లకు తగ్గకుండా దిగుబడి వస్తుందని ఆశిస్తున్నాం. ప్రకృతి సాగు ప్రారంభించిన గత ఏడాది ఎకరానికి 16 క్వింటాళ్ల వరకు ఎండు మిర్చి దిగుబడి వచ్చింది.

రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడే మిరప రైతులకు మా ప్రాంతంలో సగటున 18 క్వింటాళ్ల (అత్యధికంగా 24 క్వింటాళ్ల) దిగుబడి వస్తున్నట్లు సమాచారం. అయితే, ప్రకృతి/సేంద్రియ పద్ధతిలో సాగు చేయడానికి మాకు ఎకరానికి రూ. 40 వేలు- రూ. 50 వేలు ఖర్చు అయ్యింది. రసాయనాలు వేసే వారికి రూ. లక్ష వరకు ఖర్చవుతుంది. ఎండుమిర్చిని మనదేశం నుంచి చైనా వాళ్ళు కొనకపోవడం వల్ల ధర కొంత తగ్గింది. అయినా మాకు ఎకరానికి కనీసం రూ. 1,20,000 నికరాదాయం వస్తుందని ఆశిస్తున్నాం. మేం వేసింది దేశీ రకం కావేరి మిరప. పంట నుంచి తీసిన విత్తనాలనే అడిగిన రైతులకూ ఇస్తున్నాం.. మేమూ వాడుతున్నాం..

(పి. శరత్‌చంద్ర -99898 53366,
వై.రామిరెడ్డి - 98667 60457)

సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

మంగళవారం
3-3-2020

- ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై దృష్టి పెట్టిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలు
- వచ్చే ఏడాది చివరి నాటికి భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని అంచనా
- కేంద్ర ప్రభుత్వ పథకం(ఫేమ్ ఇండియా)తో ఈవీ మార్కెట్ మరింత వృద్ధి!
- కొత్త కోర్సులు, రీసెర్చ్ కార్యకలాపాల దిశగా ఐఐటీల అడుగులు

జాబ్ ట్రెండ్స్

ఎలక్ట్రిక్ వాహన రంగం

కొత్త కొలువుల సందేశం!

వాహన కాలుష్యం పెరుగుతుండటం.. సంప్రదాయ ఇంధన వనరుల ధరలు ఆకాశాన్నంటుతుండటం.. వీటికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు దిగుమతుల పరంగా పలు రకాల ఇబ్బందులు..! వీటన్నింటికీ చక్కటి పరిష్కారం.. ఎలక్ట్రిక్ వెహికల్స్(ఈవీ)! ఎలక్ట్రిక్ వాహన రంగం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పలు రకాల ప్రోత్సాహకాలు ప్రకటిస్తోంది. ముఖ్యంగా 'ఫేమ్ ఇండియా' పథకం ద్వారా దేశంలో ఎలక్ట్రిక్ వెహికల్స్ వినియోగం పెరిగేలా చర్యలు తీసుకుంటోంది. దీంతో ఎలక్ట్రిక్ వాహన రంగం యువతకు కొలువుల వేదికగా మారుతుందని అంచనా. ఇప్పటికే టూ వీలర్స్ మొదలు.. ఎస్‌యూవీ సెగ్మెంట్ వరకూ.. పలు రకాల ఎలక్ట్రిక్ వాహనాల ఉత్పత్తి మొదలైంది. ఈ నేపథ్యంలో.. ఎలక్ట్రిక్ వెహికల్ రంగంలో తాజా ట్రెండ్స్.. ఉద్యోగ అవకాశాలు.. అర్హతలు.. నైపుణ్యాలు, కోర్సుల గురించి తెలుసుకుందాం...

ఇటీవల నోయిడాలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ప్రదర్శన సందర్శకులను బాగా ఆకట్టుకుంది. ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీ దిశగా ఆయా సంస్థలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నాయి. వీలైనంత త్వరగా తమ ప్రొడక్ట్‌ల ఉత్పత్తి పూర్తిచేసి మార్కెట్లో వినియోగదారులకు అందుబాటులోకి తెస్తామని పేర్కొంటున్నాయి. ఇదే ప్రస్తుతం యువతకు ఉపాధి వేదికగా నిలుస్తోంది. ఇప్పటికే పేరున్న పలు ఆటోమొబైల్ కంపెనీలు ఈవీల తయారీలో ముందున్నాయి. వీటిల్లో » టాటా మోటార్స్.. నెక్సాన్ ఈవీ, ఆల్ట్రోజ్ ఈవీ » బీఎండబ్ల్యూ 13 » ఆడి-ఈ ట్రాన్ » మారుతి సుజుకి -ఫ్యూచరో-ఈ » నిస్సాన్ » జాగ్వార్ - I పేస్ ముఖ్యమైనవి.

టూ వీలర్స్ కూడా!

టూ వీలర్స్ విషయానికొస్తే.. హీరో మోటో కార్ప్, యమహా ఇండియా, టీవీఎస్, బజాజ్ టూ వీలర్స్ వంటి సంస్థలు ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారీకి ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇదే సమయంలో ఓకినావా, టార్క్ మోటార్స్ వంటి పలు స్టార్టప్ సంస్థలు సైతం ఎలక్ట్రిక్ స్కూటర్స్ రంగంలో అడుగుపెట్టాయి. మొత్తంగా వచ్చే పదేళ్లలో దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచి.. ఈ రంగాన్ని వృద్ధి బాటలో పయనించేలా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. 2030 నాటికి ఎలక్ట్రిక్ వాహన రంగం ఏటా 43.1 శాతం వృద్ధి సాధిస్తుందని బీఐఎస్ రీసెర్చ్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

చైనాకు ధీటుగా

మన దేశంలో ఇప్పటికే పలు ఆటోమొబైల్ సంస్థలు ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసి మార్కెట్లోకి తెస్తున్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింత ఎక్కువ సంఖ్యలో ఈవీల తయారీకి సిద్ధమవుతున్నాయి. కొన్ని కంపెనీలు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ఆర్ అండ్ డీలో నిమగ్నమై ఉన్నాయి. మరోవైపు పబ్లిక్ రవాణా విభాగంలోనూ.. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ సంస్థ రానున్న మూడేళ్లలో వెయ్యి ఎలక్ట్రిక్ బస్‌లను తయారు చేయాలని నిర్ణయించింది. అదే విధంగా హైదరాబాద్‌కి చెందిన మరో సంస్థ చైనా కంపెనీతో ఒప్పందం చేసుకుని తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలకు 290 ఎలక్ట్రిక్ బస్సులను తయారుచేసి ఇచ్చేందుకు సిద్ధమైంది. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకుంటే.. 2030 నాటికి అంతర్జాతీయ స్థాయిలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంలో భారత్ ఏడు శాతం వృద్ధి సాధించనుంది. 2025 నాటికి 100శాతం ఎలక్ట్రిక్ వాహనాలను రూపొందించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్న చైనాకు ధీటుగా నిలిచి ప్రపంచ దేశాల్లో.. భారత్ మూడో స్థానానికి చేరుకోనుందని అంచనా.

ఉద్యోగాలెక్కడ

- **డిజైనింగ్ టు ఛార్జింగ్:** ఎలక్ట్రిక్ వాహన తయారీ రంగంలో ప్రొడక్ట్ ఆవిష్కరణకు మూలమైన డిజైనింగ్ మొదలు వాహనం రోడ్డు మీదకి వచ్చాక చార్జింగ్ వరకు.. వేల సంఖ్యలో అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఒక ఎలక్ట్రిక్ బస్సు తయారీకి సగటున 12 నుంచి 15 మంది అవసరం అవుతారని అంచనా.
- **ఆర్ అండ్ డీ సైంటిస్ట్‌లు:** ఒక ప్రొడక్ట్ రూపొందించే విషయంలో రీసెర్చ్ స్థాయిలో ఉన్నత స్థాయి హోదా ఆర్ అండ్ డీ సైంటిస్టులు. మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగాల్లో పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టోరల్ అభ్యర్థులకు ఈ అవకాశాలు లభిస్తాయి.
- **కెమికల్ ఇంజనీర్‌లు/కెమిస్ట్‌లు:** వీరు ఎలక్ట్రిక్ వాహనాల్లో వినియోగించే బ్యాటరీల తయారీ, వినియోగం తదితర విధులు నిర్వహిస్తారు. కోర్ కెమిస్ట్రీ మాత్రమే కాకుండా.. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో బీటెక్, ఎంటెక్ చేసిన అభ్యర్థులు ఈ కొలువులు అందుకోవచ్చు.
- **ఎలక్ట్రానిక్ ఇంజనీర్‌లు:** ఒక కొత్త ప్రొడక్ట్ డిజైన్, అభివృద్ధి వంటి విభాగాల్లో ఎలక్ట్రానిక్ ఇంజనీర్లదే కీలక పాత్ర.
- **ఇండస్ట్రియల్ ఇంజనీర్స్:** ప్రొడక్ట్ డిజైన్‌కు ఆమోదం లభించినా.. దాన్ని ఉత్పత్తి చేసే క్రమంలో క్షేత్ర స్థాయిలో విధుల నిర్వహణ,మెటీరియల్, మ్యాన్ పవర్ అనుసంధానం వంటి విషయాల్లో వీరు కీలకంగా వ్యవహరిస్తారు.
- **మెకానికల్ ఇంజనీర్స్:** ఎలక్ట్రిక్ వాహనాల తయారీలో మెకానికల్ ఇంజనీర్ల అవసరం తప్పనిసరి. క్యాడ్ ఆధారంగా ఒక ప్రొడక్ట్‌ను డిజైన్ చేయడంలో ఎలక్ట్రానిక్ ఇంజనీర్లకు, మెకానికల్ ఇంజనీర్ల సహకారం అవసరం ఉంటుంది.
- **సాఫ్ట్‌వేర్ డెవలపర్స్:** ఆధునిక టెక్నాలజీతో రూపొందుతున్న వాహనాలన్నీ సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామింగ్ ఆధారంగా తయారవుతున్నవే. ఇదే కోవలో ఎలక్ట్రిక్ వెహికల్స్ కూడా సాఫ్ట్‌వేర్ ఆధారంగా పని చేస్తున్నాయి. ముఖ్యంగా ప్రయాణ సమయంలో చార్జింగ్ స్థాయి.. చార్జింగ్ ఎప్పుడు చేయాలి.. తదితర అంశాలు కనిపించే విధంగా ఆన్‌బోర్డ్ కంప్యూటర్లను ఎలక్ట్రిక్ వెహికల్స్‌లో పొందుపరుస్తారు. దీనికి సంబంధించిన ప్రోగ్రామ్స్‌ను రూపొందించేందుకు సాఫ్ట్‌వేర్ డెవలపర్స్ అవసరం ఉంటుంది.

మ్యానుఫ్యాక్చరింగ్ రంగం.. ముఖ్యాంశాలు

- పెరుగుతున్న ఎలక్ట్రిక్ వాహన వినియోగం.
- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు » జీఎస్‌టీ తగ్గింపు. ■ వచ్చే పదేళ్లలో దేశంలో 40 శాతం మేరకు ఎలక్ట్రిక్ వెహికల్స్.
- ఎస్‌యూవీ, విదేశీ సంస్థలు, అకడమిక్ ఇన్‌స్టిట్యూట్‌లతో ఒప్పందాలు చేసుకుంటున్న భారత ఆటోమొబైల్ సంస్థలు.
- నేషనల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ ప్లాన్ ప్రకారం- ఈ ఏడాది చివరికి అయిదు నుంచి ఏడు మిలియన్ల మధ్యలో ఎలక్ట్రిక్ వెహికల్స్ తయారు చేయాలని ప్రభుత్వ లక్ష్యం.
- 2030 నాటికి మొత్తం వాహనాల్లో 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలనే లక్ష్యం.
- 2025 నాటికి ఈవీ రంగంలో అంతర్జాతీయంగా రెండు మిలియన్ల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని అంచనా.

మరెన్నో విభాగాలు

- ఎలక్ట్రిక్ వెహికల్స్‌కు సంబంధించి కోర్ ప్రొడక్ట్, డిజైన్, డెవలప్‌మెంట్ మాత్రమే కాకుండా.. ప్రొడక్ట్ తయారీలో పలు విభాగాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి. అవి.. » ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఎక్విప్‌మెంట్ అసెంబ్లర్స్ » ఎలక్ట్రో మెకానికల్ ఎక్విప్‌మెంట్ అసెంబ్లర్స్ » ఇంజన్ అండ్ అదర్ మెషీన్ అసెంబ్లర్స్ » టీమ్ అసెంబ్లర్స్ » కంప్యూటర్ కంట్రోల్డ్ మెషీన్ టూల్ ఆపరేటర్స్ » మెషినిస్ట్స్ » ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ సూపర్‌వైజర్స్/మేనేజర్స్. ఈ విభాగాల్లో డిప్లొమా స్థాయి అర్హతలున్న వారికి అవకాశాలు లభిస్తాయి.

సర్వీసింగ్‌లోనూ

తయారీనే కాకుండా ఒక ప్రొడక్ట్‌ను విక్రయించిన తర్వాత.. సదరు ప్రొడక్ట్ సర్వీసింగ్‌కు సంబంధించి కూడా పలు విభాగాల్లో మానవ వనరుల అవసరం ఉంటుంది. అవి.. » ఆటోమోటివ్ సర్వీస్ టెక్నీషియన్స్ అండ్ మెకానిక్స్ » ఎలక్ట్రిక్ పవర్ లైన్ ఇన్‌స్టాలర్స్ అండ్ రిపేరర్స్ » ఎలక్ట్రీషియన్స్ » ఛార్జింగ్ వర్కర్స్. వీటిల్లో ఉద్యోగాలకు ఐటీఐ లేదా సంబంధిత విభాగాల్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్న వారు సరితూగుతారు.

కస్టమర్ సర్వీస్

ఎలక్ట్రిక్ వెహికల్‌ను కొనుగోలు చేసేందుకు వచ్చే వినియోగదారులకు సేవలందించే క్రమంలో.. » రిటైల్ సేల్స్ పర్సన్స్ » కస్టమర్ సర్వీస్ రిప్రజెంటేటివ్స్ » షోరూం మేనేజర్స్ వంటి కొలువులు లభిస్తాయి. ఈ విభాగాల్లో డిగ్రీ అర్హతతోపాటు సర్వీస్ ఓరియెంటేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే సులువుగానే కొలువు దక్కించుకోవచ్చు.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్

ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలు ఇంజనీర్ స్థాయి ఉద్యోగాల కోసం ఐఐటీల్లో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది టాటా మోటర్స్, మెర్సిడెజ్ బెంజ్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి.. ఐఐటీల్లో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ద్వారా వెయ్యి మంది బీటెక్ అభ్యర్థులకు ఆఫర్లు ఇచ్చాయి. గతేడాదితో పోల్చితే ఈ సంఖ్య 30 శాతం ఎక్కువ కావడం ఈ రంగంలో పెరుగుతున్న మానవ వనరుల అవసరానికి నిదర్శనంగా చెప్పొచ్చు. మరోవైపు సంస్థలు కోర్ నైపుణ్యాలున్న వారిని నియమించుకొని.. తమ సొంత శిక్షణ కేంద్రాల ద్వారా ఈ రంగానికి అవసరమైన నైపుణ్యాలు అందిస్తున్నాయి.

20 వేల ఇంజనీర్ ఉద్యోగాలు

ఎలక్ట్రిక్ వెహికల్ రంగంలో 2021 నాటికి దాదాపు 20వేల మంది ఇంజనీర్ల అవసరం ఉంటుందని అంచనా. బీటెక్ (ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, ఈసీఈ) బ్రాంచ్ విద్యార్థులు ఈ అవకాశాలు అందుకోవచ్చు. ఈ రంగంలో అనుసరిస్తున్న విధానాలు, అవసరమైన నైపుణ్యాలపై ముందుగానే అవగాహన పెంచుకుంటే.. తేలిగ్గా కొలువులు సొంతం చేసుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ విభాగంలో కింది స్థాయిలో డిప్లొమా, ఐటీఐలో సంబంధిత ట్రేడ్ పూర్తి చేసిన వారికి ఎంట్రీ లెవల్ సూపర్‌వైజరీ లెవల్ ఉద్యోగాలు లభించడం ఖాయం.

పరిశోధనల దిశగా ఐఐటీలు

ఎలక్ట్రిక్ వెహికల్స్ రంగం, భవిష్యత్ అవకాశాలను పరిగణనలోకి తీసుకున్న ఐఐటీలు.. వీటికి సంబంధించి కొత్త కోర్సులు, రీసెర్చ్ కార్యకలాపాల దిశగా అడుగులు వేస్తున్నాయి. ఐఐటీ ఢిల్లీ.. ఈ విభాగంలో ఎంటెక్ ప్రోగ్రామ్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. అదే విధంగా ఐఐటీ మండి, చెన్నైలు పలు ప్రైవేటు సంస్థలతో కలిసి రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల ఐఐటీ హైదరాబాద్ కూడా ఈ-ప్లూటో పేరిట ప్యూర్-ఈవీ వెహికల్‌ను ఆవిష్కరించింది.

వేతనాలు ఇలా

రీసెర్చ్ స్థాయి నైపుణ్యాలున్న అభ్యర్థులు నెలకు రూ.లక్ష వరకు వేతనం అందుకునే వీలుంది. అలాగే ప్రొడక్ట్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో ఇంజనీర్ స్థాయి ఉద్యోగులకు నెలకు రూ.40-70వేల వరకు వేతనం లభిస్తుంది. సూపర్‌వైజరీ స్థాయిలో ప్రారంభంలో నెలకు రూ. 20-30 వేల వరకు వేతనం అందుతుంది. కస్టమర్ సర్వీస్ విభాగంలోనూ ఇదే స్థాయిలో వేతనాలు.

ప్రవేశాలు

ఎన్ఐఆర్‌డీలో అడ్మిషన్లు

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(రాజేంద్రనగర్, హైదరాబాద్) అందిస్తున్న పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది.

కోర్సులు

- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రూరల్ డెవలప్‌మెంట్(పీజీడీఆర్‌డీఎం), కాలవ్యవధి ఏడాది.
- పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ - రూరల్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం-ఆర్ఎం), కాలవ్యవధి రెండేళ్లు

అర్హతలు

- 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/వికలాంగులకు 45 శాతం మార్కులు రావాలి. ✦ 2019-20 క్యాట్/గ్జాట్/మాట్/సీమాట్/ఏటీఎంఏ/జీమాట్ స్కోరు లేదా ఎన్ఐఆర్‌డీపీఆర్ అఖిల భారత స్థాయిలో నిర్వహించే టెస్ట్ (ఆన్‌లైన్)లో స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ నిర్వహించి ప్రవేశం కల్పిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.400, (ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూడీ-రూ.200)
- **దరఖాస్తుకు చివరి తేదీ:** 10 ఏప్రిల్ 2020
- **ప్రవేశ పరీక్ష:** 19 ఏప్రిల్, 2020
- **పూర్తి సమాచారం కోసం:** www.nirdpr.org.in

కరెంట్ అఫైర్స్ (TM & EM) ప్రాక్టీస్ టెస్టులు

విద్య, ఉద్యోగ సమాచారం కోసం
WWW.SAKSHIEDUCATION.COM

SAKSHI CURRENT AFFAIRS
యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోండి

నేటి టాబ్లాయిడ్ విద్య పేజీల్లో...
10th Class
SRIGAYATRI EDUCATIONAL INSTITUTIONS
MATHEMATICS

స్టాటిస్టిక్స్‌కు కేరాఫ్ ఐఎస్ఐ

ప్రతిష్టాత్మక ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్(ఐఎస్ఐ-కోల్‌కతా).. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు(2020-21) నోటిఫికేషన్ జారీ చేసింది. 1931లో ప్రొఫెసర్ పీసీ మహాలనోబిస్ ఆధ్వర్యంలో స్టాటిస్టికల్ ల్యాబొరేటరీగా ప్రారంభమైంది. అనంతరం ఈ రంగం ప్రత్యేకతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం ద్వారా ఇండియన్ స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్‌గా ప్రకటించింది. ఐఎస్ఐ క్యాంపస్‌ల్లో ఉన్నత ప్రమాణాలతో అందించే స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, మ్యాథ్స్ వంటి 15కు పైగా డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్ఎఫ్), డాక్టరేట్ కోర్సులకు ఎంతో గుర్తింపు ఉంది. ప్రస్తుత ఏడాది ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. ఐఎస్ఐ నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో.. పూర్తి వివరాలు...

అందించే కోర్సులు- అర్హతలు

- **బీస్టాట్(ఆనర్స్):** మూడేళ్ల ఈ కోర్సులో చేరేందుకు ఇంటర్/10+2లో మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు పాసైనవారు అర్హులు. ఈ కోర్సు కోల్‌కతాలోని క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- **బీమ్యాథ్(ఆనర్స్):** బెంగళూరు క్యాంపస్‌లో అందిస్తున్న ఈ కోర్సు కాల వ్యవధి మూడేళ్లు. ఇంటర్ /10+2లో మ్యాథ్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు పాసైనవారు అర్హులు.
- **ఎంస్టాట్:** రెండేళ్ల ఈ కోర్సును కోల్‌కతా, ఢిల్లీ క్యాంపస్‌లలో అందిస్తున్నారు. స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా మూడేళ్ల బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్ పూర్తి చేసుండాలి. లేదా ఐఐఐలో బీమ్యాథ్స్ గాని స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిస్టిక్స్‌లో పీజీ డిప్లొమా చేసి ఉండాలి. మొదటి సంవత్సరం విద్యను కోల్‌కతా, చెన్నై, ఢిల్లీలో; ద్వితీయ సంవత్సరం కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు.
- **ఎం మ్యాథ్:** రెండేళ్ల ఈ కోర్సును ఒక ఏడాది బెంగళూరు, మరో ఏడాది కోల్‌కతా క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఈసారి కోల్‌కతాలో చదవాల్సి ఉంటుంది. మ్యాథమెటిక్స్ సబ్జెక్టుగా బ్యాచిలర్ డిగ్రీ లేదా బీఈ/బీటెక్, ఐఎస్ఐలో బీ స్టాట్ డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులు.
- **ఎంఎస్(క్వాంటిటేటివ్ ఎకనమిక్స్):** రెండేళ్ల ఈ అడ్వాన్స్‌డ్ ఎకనామిక్స్ కోర్సును కోల్‌కతా, ఢిల్లీ క్యాంపస్‌లలో అందిస్తున్నారు. ఇంటర్‌లో మ్యాథ్స్‌తోపాటు ఏదైనా డిగ్రీ పాసైన వారు అర్హులు.
- **ఎంఎస్(క్వాలిటీ మేనేజ్‌మెంట్ సైన్స్):** రెండేళ్ల కాలపరిమితి గల ఈ కోర్సులో రెండు సెమిస్టర్లు బెంగళూరులోను, మూడో సెమిస్టర్ హైదరాబాద్‌లో అభ్యసించాల్సి ఉంటుంది. నాలుగో సెమిస్టర్ ప్రాజెక్టు వర్క్ ఉంటుంది. మ్యాథమెటిక్స్ సబ్జెక్టుగా డిగ్రీ లేదా బీఈ/బీటెక్ పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **ఎంఎస్(లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్):** ఈ కోర్సు బెంగళూరు క్యాంపస్‌లో ఉంది. ఏదైనా డిగ్రీ చేసినవారు అర్హులు.
- **ఎంటెక్(కంప్యూటర్ సైన్స్)/ఎంటెక్(క్రిప్టోలజీ అండ్ సెక్యూరిటీ):** ఈ కోర్సులు కోల్‌కతా ఐఎస్ఐ క్యాంపస్‌లో అందిస్తున్నారు. ఇందులో చేరేందుకు నాలుగేళ్ల డిగ్రీ (బీఈ/బీటెక్ వంటివి),ఏదైనా మాస్టర్ డిగ్రీ పూర్తి చేయాలి. ఇంటర్‌లో మ్యాథమెటిక్స్ చదివి ఉండాలి.
- **ఎంటెక్(క్వాలిటీ, రిలయబిలిటీ అండ్ ఆపరేషన్స్ రీసెర్చ్):** ఈ కోర్సును కూడా కోల్‌కతా క్యాంపస్‌లోనే అందిస్తున్నారు. ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీతోపాటు, ఎంస్టాట్ చేసిన వారు లేదా బీఈ/బీటెక్ చేసినవారు అర్హులు.
- **పీజీడీఎస్ఎంఏ:** ఏడాది కాలపరిమితి గల 'పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనాలసిస్' కోర్సు చెన్నై, తేజ్‌పూర్ క్యాంపస్‌లలో అందిస్తున్నారు. మ్యాథ్స్ సబ్జెక్టుగా ఏదేని డిగ్రీ, బీఈ/బీటెక్ చేసిన వారు అర్హులు.
- **పీజీడీఏఆర్ఎస్ఎంఏ:** ఏడాది కాలపరిమితి గల 'పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ అండ్ రూరల్ మేనేజ్‌మెంట్ విత్ స్టాటిస్టికల్ మెథడ్స్ అండ్ అనలిటిక్స్' కోర్సును ఐఎస్ఐ గిరిధి బ్రాంచిలో అందిస్తున్నారు. మ్యాథ్స్/స్టాటిస్టిక్స్‌తో ఏదైనా డిగ్రీ చేసినవారు అర్హులు.
- **పీజీడీబీఏ:** పోస్టుగ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ బిజినెస్ అనలిటిక్స్ కోర్సును ఐఎస్ఐ, ఐఐటీ -ఖరగ్‌పూర్, ఐఐఎం-కోల్‌కతా సంయుక్తంగా అందిస్తున్నాయి.

ఇవిగాక దేశంలోని వివిధ ఐఎస్ఐ క్యాంపస్‌లలో ఆయా కోర్సుల్లో జూనియర్ ఈసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) సైతం అందిస్తున్నారు.

యూజీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

ఐఎస్ఐ అందించే స్టాటిస్టిక్స్, ఎకనామిక్స్, మ్యాథ్స్ కోర్సులకు మంచి గుర్తింపు

ఎంపిక ఎలా

ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ, ఇంటర్వ్యూల ద్వారా ఆయా కోర్సులకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రవేశ పరీక్షల సిలబస్, మోడల్ పేపర్లు ఐఎస్ఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఐఎస్ఐ క్యాంపస్‌ల్లో కోర్సుకు ఎంపికైన వారికి స్కాలర్‌షిప్/ఫెలోషిప్ సదుపాయం ఉంది.

దరఖాస్తు ఫీజు

» పురుష అభ్యర్థులు(జనరల్ కేటగిరీ): రూ.1250 » మహిళలు(జనరల్): రూ.750 » ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ-ఎన్‌సీఎల్/వికలాంగులు: రూ.625.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 06 మార్చి 2020
- **పేమెంట్ చెల్లింపునకు చివరి తేదీ:** 10 మార్చి 2020
- **హాల్‌టికెట్ల జారీ:** 20 ఏప్రిల్ నుంచి ప్రారంభం
- **ప్రవేశ పరీక్ష:** 10 మే 2020
- **పరీక్ష కేంద్రాలు:** తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం.
- **పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ :** www.isical.ac.in

నిట్‌ల్లో ఎంసీఏ

నిమ్‌సెట్ 2020

» నిమ్‌సెట్-2020కు నోటిఫికేషన్ విడుదల
» దరఖాస్తులకు చివరి తేది: 31.03.2020

దేశంలో ప్రముఖ విద్యా సంస్థలైన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)ల్లో ఏ కోర్సు చదివినా.. అద్భుతమైన కెరీర్ సొంతమవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సంస్థలు అందించే ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఇంజనీరింగ్ మాత్రమే కాకుండా నిట్‌ల్లో ఎంసీఏ కోర్సుకు కూడా మంచి డిమాండ్ ఉంది. ఎన్ఐటీల్లో ఎంసీఏ(మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్) కోర్సుల్లో ప్రవేశాలకు వీలు కల్పించే.. 'నిమ్‌సెట్-2020' నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో సాధించిన ర్యాంక్ ఆధారంగా దేశంలోని 10 ఎన్ఐటీల్లో ఎంసీఏలో చేరొచ్చు.

ఏయే సంస్థల్లో ప్రవేశం

నిమ్ సెట్‌ను ప్రతి ఏటా నిర్వహిస్తారు. ఈ సంవత్సరం నిట్ రాయపూర్ ఈ పరీక్షను నిర్వహిస్తోంది. ఇందులో ప్రతిభ ఆధారంగా పది నిట్‌ల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశం లభిస్తుంది. నిమ్‌సెట్-20లో వచ్చిన ర్యాంక్ ఆధారంగా అగర్తల, అలహాబాద్, భోపాల్, కాలికట్, జంషెడ్‌పూర్, కురుక్షేత్ర, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచురాపల్లి, వరంగల్ ఎన్ఐటీల్లో ఎంసీఏ కోర్సులో ప్రవేశం పొందొచ్చు.

సీట్ల వివరాలు

10 నిట్‌ల్లో అందుబాటులో ఉన్న మొత్తం సీట్ల సంఖ్య 871. ఎలాంటి స్టేట్‌వైడ్ కోటా లేదు. నిట్ కురుక్షేత్రలో సెల్ఫ్‌ఫైనాన్సింగ్ స్కీమ్ ఉంది. తెలంగాణ రాష్ట్రంలోని నిట్ వరంగల్ 58 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- కనీసం మూడేళ్ల కాలపరిమితి గల బీఎస్సీ/బీఎస్సీ(ఆనర్స్)/బీసీఏ/బిఐటీ /బ్యాచిలర్ ఆఫ్ ఒకేషనల్(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్)లో మ్యాథమెటిక్స్ లేదా స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. లేదా బీఈ/బీటెక్ చదివిన వారు నిమ్‌సెట్-20కి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. పైకోర్సులు చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ డిగ్రీలో 60 మార్కులు లేదా సీజీపీఏ 6.5/10, ఎస్సీ/ఎస్టీ/వికలాంగులు 55 శాతం మార్కులు లేదా 6.0 సీజీపీఏ తప్పనిసరి.

పరీక్ష విధానం

ఆన్‌లైన్‌లో మల్టిపుల్ ఛాయిస్ విధానంలో 120 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది. » **మ్యాథమెటిక్స్:** 50 ప్రశ్నలు » **అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్:** 40 ప్రశ్నలు » **కంప్యూటర్ అవేర్‌నెస్:** 10 ప్రశ్నలు » **జనరల్ ఇంగ్లిష్:** 20 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. నెగిటివ్ మార్కుల విధానం ఉంది. ప్రతి సరైన సమాధానానికి నాలుగు మార్కులు లభిస్తే.. ప్రతి తప్పు సమాధాన

భారత జట్టు వల్ల కాలేదు. స్వింగ్, సీమ్ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొని నిలవడం నంబర్‌వన్ జట్టుకు శక్తికి మించిన పనే అయింది. న్యూజిలాండ్ గడ్డపై 'టెస్టు' పరీక్షకు ఎదురొడ్డి తమ స్థాయిని ప్రదర్శించాలనుకున్న టీమిండియా చివరకు టెస్టుల్లో వైట్‌వాష్‌తో సిరీస్ ముగించాల్సి వచ్చింది. బౌలింగ్ దళం తమ వంతుగా శ్రమించినా... బ్యాటింగ్ బలగం జట్టును తీవ్ర నిరాశకు గురి చేసింది. ఫలితంగా వరుసగా రెండో టెస్టులోనూ పరాజయం పాలైంది. ప్రత్యర్థికి 0-2తో సిరీస్‌ను అప్పగించేసింది.

క్రీజ్‌లో ఉన్న చివరి ప్రధాన బ్యాట్స్‌మెన్ జోడీ ఏ మాత్రం ప్రభావం చూపకపోవడంతో భారత్ రెండో ఇన్నింగ్స్ మూడో రోజు 10 ఓవర్లలో 34 పరుగులకే ముగిసింది. ఓపెనర్ల అర్ధసెంచరీలతో 132 పరుగుల స్వల్ప లక్ష్యం కివీస్‌కు సులువుగా మారింది. అయితే ఒక్కసారిగా మన బౌలర్లు చెలరేగి 18 పరుగుల వ్యవధిలో 3 వికెట్లు పడగొట్టడం, పిచ్ బ్యాట్స్‌మెన్‌కు పరీక్షగా మారిపోవడం చూస్తే మరో 80-100 పరుగులు భారత్ అదనంగా చేసి ఉంటే పరిస్థితి భిన్నంగా ఉండేది!

'టెస్టు' పైయిల్...

రెండో మ్యాచ్‌లోనూ చిత్తయిన భారత్

0-2తో చేజారిన టెస్టు సిరీస్

7 వికెట్లతో న్యూజిలాండ్ విజయం

పరాజయంతో ముగిసిన కివీస్ పర్యటన

1 కోహ్లి కెప్టెన్సీలో టెస్టుల్లో భారత్ క్లీన్‌స్వీప్‌కు గురి కావడం ఇదే తొలిసారి.

గంగూలీ (2002) - కోహ్లి (2020)

న్యూజిలాండ్ చేతిలో 0-2తో భారత జట్టు సిరీస్ ఓడటంలో 2002 ఓటమికి చాలా దగ్గరి పోలికలున్నాయి. అప్పుడు గంగూలీ నేతృత్వంలోనూ టీమ్ 0-2తో చిత్తయింది. ఇద్దరూ కెప్టెన్లూ ఘోరంగా విఫలమయ్యారు.

2 కివీస్	టాస్‌లు	2 కివీస్
10 వికెట్లు, 4 వికెట్లు	రెండు టెస్టుల్లో ఓటమి తేడా	10 వికెట్లు, 7 వికెట్లు
89 (మార్క్ రిచర్డ్సన్)	సిరీస్‌లో అత్యధిక స్కోరు	89 (విలియమ్సన్)
5, 5, 17, 2 (మొత్తం 29)	కెప్టెన్ల స్కోర్లు	3, 14, 2, 19 (మొత్తం 38)
7.25	కెప్టెన్ల బ్యాటింగ్ సగటు	9.50

క్రైస్ట్‌చర్చ్: న్యూజిలాండ్ గడ్డపై టి20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన తర్వాత ప్రత్యర్థి చేతిలో వన్డేల్లో వైట్ వాష్‌కు గురైన భారత జట్టు ఇప్పుడు టెస్టుల్లోనూ సున్నా చుట్టి పర్యటనను ముగించింది. సోమవారం ఇక్కడ హాగ్లీ ఓవల్ మైదానంలో ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఫలితంగా 2-0తో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఓవర్‌నైట్ స్కోరు 90/6తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 124 పరుగులకే ఆలౌటైంది. బౌల్ట్ (4/28), సౌతీ (3/36) టీమిండియాను దెబ్బ తీశారు. అనంతరం కివీస్ 36 ఓవర్లలో 3 వికెట్లకు 132 పరుగులు చేసి విజయాన్నందుకుంది. టామ్ బ్లన్‌డెల్ (113 బంతుల్లో 55; 8 ఫోర్లు, 1 సిక్స్), టామ్ లాథమ్ (74 బంతుల్లో 52; 10 ఫోర్లు) తొలి వికెట్‌కు 103 పరుగులు జోడించారు. బుమ్రాకు 2 వికెట్లు దక్కాయి. ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన కైల్ జేమీసన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కగా, 14 వికెట్లు తీసిన టిమ్ సౌతీ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు.

47 నిమిషాల్లో...

మూడో రోజు భారత్ మిగిలిన 4 వికెట్లు కోల్పోయేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఓవర్‌నైట్ బ్యాట్స్‌మెన్ ఇద్దరూ ఒకే స్కోరు వద్ద వెనుదిరిగారు. సౌతీ బౌలింగ్‌లో లెగ్‌సైడ్ వైపు వెళుతున్న బంతిని ఆడి విహారి (9) కీపర్‌కు క్యాచ్ ఇవ్వగా... బౌల్ట్ వేసిన తర్వాతి ఓవర్లో పంత్ (4) కూడా అవుటయ్యాడు. షమీ (5), బుమ్రా (4) తమ స్థాయిలోనే చేతులెత్తేయగా, జడేజా (16 నాటౌట్) మరో ఎండ్‌లో నిలబడిపోయాడు. బౌల్ట్ వేసిన ఓవర్ చివరి బంతిని జడేజా ఆడగా, సింగిల్ తీసి స్ట్రయిక్‌ను సహచరుడికే మళ్లీ ఇద్దామనే ప్రయత్నంలో బుమ్రా రనౌట్ కావడంతో భారత్ ఆట ముగిసింది.

సెంచరీ భాగస్వామ్యం...

స్వల్ప లక్ష్యమే అయినా కివీస్ ఛేదన కాస్త కష్టంగానే సాగింది. బంతి పేసర్లకు అనూహ్యంగా స్పందిస్తూ బ్యాట్స్‌మెన్‌ను తీవ్రంగా ఇబ్బంది పెట్టింది. ఈ క్రమంలో పలు మార్లు బంతి కివీస్ ఓపెనర్ల శరీరానికి కూడా తగిలింది. అయితే లాథమ్, బ్లన్‌డెల్ ఇద్దరూ పట్టుదలగా నిలబడ్డారు. తప్పుడు షాట్లు ఆడకుండా జాగ్రత్త పడుతూనే చెత్త బంతి పడినప్పుడు మాత్రం వృథా చేయకుండా బౌండరీలు రాబట్టారు. 10 పరుగుల వద్ద బ్లన్‌డెల్ ఇచ్చిన కష్టసాధ్యమైన క్యాచ్‌ను పంత్ వదిలేశాడు. లంచ్‌కు ముందు మూడు ఓవర్లే వేసిన షమీ గాయం కారణంగా రెండో సెషన్‌లో తిరిగి రాకపోవడం భారత్‌ను మరింత ఇబ్బంది పెట్టింది. విరామం తర్వాత కివీస్ ఓపెనర్లు చకచకా పరుగులు సాధించారు. ఈ క్రమంలో 67 బంతుల్లో లాథమ్ అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా భాగస్వామ్యం 100 పరుగులు దాటింది. ఇక కివీస్‌కు 10 వికెట్ల విజయం ఖాయమనిపించిన దశలో లాథమ్‌ను అవుట్ చేసి ఉమేశ్ ఈ జోడీని విడదీశాడు. ఆ వెంటనే బుమ్రా చెలరేగి వరుస ఓవర్లలో విలియమ్సన్ (5)ను, బ్లన్‌డెల్‌లను వరుస ఓవర్లలో పెవిలియన్ పంపించాడు. అయితే టేలర్ (5 నాటౌట్), నికోల్స్ (5 నాటౌట్) కలిసి జట్టును గెలిపించారు.

> **మా** బౌలర్లు ఆధిపత్యం చలాయించేందుకు కావాల్సినన్ని పరుగులు బ్యాట్స్‌మెన్ చేయలేకపోయారు. రెండు టెస్టుల్లో మా బౌలింగ్ బాగుంది. సిరీస్ తుది ఫలితం నిరాశ కలిగించింది. తప్పులు సరిదిద్దుకొని ముందుకు వెళతాం. మా ప్రణాళికలు విఫలమయ్యాయి. ఎలాంటి సాకులు వెతకడం లేదు. టాస్ గురించి ఫిర్యాదు చేయదల్చుకోలేదు. అన్ని రంగాల్లో మాపై కివీస్‌దే పైచేయి అయింది. మాకు ఏదీ అనుకూలంగా సాగలేదు. గతంలో అనేక సార్లు చూపించిన తెగువను ఈసారి ప్రదర్శించలేకపోయాం. పిచ్, వాతావరణంలాంటి అంశాల్లో మా బ్యాట్స్‌మెన్ అతిగా ఆలోచించి మనసులో ఒక రకమైన సంకోచంతో ఆడటం కూడా చేటు చేసింది. సమష్టి వైఫల్యం కాబట్టి ఏ ఒక్కరినో తప్పపట్టడం లేదు.
>
> **-విరాట్ కోహ్లి, భారత కెప్టెన్**

ఏం మాట్లాడుతున్నావో తెలుసా?

టెస్టు ముగిశాక జరిగిన మీడియా సమావేశంలో ఒక న్యూజిలాండ్ జర్నలిస్ట్ అడిగిన ప్రశ్న కోహ్లిని ఆగ్రహానికి గురి చేసింది. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో విలియమ్సన్ అవుటైనప్పుడు కివీస్ అభిమానులను ఉద్దేశించి కోహ్లి కొన్ని అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. భారత కెప్టెన్‌గా కాస్త ఆదర్శంగా వ్యవహరించాలి కదా, ఇలా ప్రవరిస్తే ఎలా అని సదరు జర్నలిస్ట్ ప్రశ్నించాడు. దాంతో చిర్రెత్తిన కోహ్లి...'దీని గురించి నువ్వేం అనుకుంటున్నావు? నేను అడుగుతున్నదానికి జవాబు చెప్పు. అసలు మైదానంలో ఏం జరిగిందో సరిగ్గా తెలుసుకొని ఆ తర్వాత ప్రశ్నలడుగు. సగం సమాచారంతో సగం ప్రశ్నలు అడగవద్దు. కావాలని వివాదం చేయాలనుకుంటే ఇది సరైన వేదిక కాదు. అయినా నేను రిఫరీతో మాట్లాడాను కూడా. ఆయనకు లేని బాధ నీకెందుకు?' అని తిరుగు ప్రశ్న వేశాడు. మరోవైపు ఇదే ఘటనను విలియమ్సన్ తేలిగ్గా తీసుకున్నాడు. 'విరాట్ మైదానంలో ఎప్పుడైనా అంతే ఆవేశంగా కనిపిస్తాడు. అది అతని స్వభావం. దీని గురించి అతిగా ఆలోచించడం అనవసరం' అని కివీస్ కెప్టెన్ నవ్వేశాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 242;
న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్: 235;
భారత్ రెండో ఇన్నింగ్స్: పృథ్వీ షా (సి) లాథమ్ (బి) సౌతీ 14; మయాంక్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 3; పుజారా (బి) బౌల్ట్ 24; కోహ్లి (ఎల్బీ) (బి) గ్రాండ్‌హోమ్ 14; రహానే (బి) వాగ్నర్ 9; ఉమేశ్ (బి) బౌల్ట్ 1; విహారి (సి) వాట్లింగ్ (బి) సౌతీ 9; పంత్ (సి) వాట్లింగ్ (బి) బౌల్ట్ 4; జడేజా (నాటౌట్) 16; షమీ (సి) బ్లన్‌డెల్ (బి) సౌతీ 5; బుమ్రా (రనౌట్) 4; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (46 ఓవర్లలో ఆలౌట్) 124.**
వికెట్ల పతనం: 1-8; 2-26; 3-51; 4-72; 5-84; 6-89; 7-97; 8-97; 9-108; 10-124.
బౌలింగ్: సౌతీ 11-2-36-3; బౌల్ట్ 14-4-28-4; జేమీసన్ 8-4-18-0; గ్రాండ్‌హోమ్ 5-3-3-1; వాగ్నర్ 8-1-18-1.
న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (సి) పంత్ (బి) ఉమేశ్ 52; బ్లన్‌డెల్ (బి) బుమ్రా 55; విలియమ్సన్ (సి) రహానే (బి) బుమ్రా 5; రాస్ టేలర్ (నాటౌట్) 5; నికోల్స్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (36 ఓవర్లలో 3 వికెట్లకు) 132. వికెట్ల పతనం:** 1-103; 2-112; 3-121.
బౌలింగ్: బుమ్రా 13-2-39-2; ఉమేశ్ 14-3-45-1; షమీ 3-1-11-0; జడేజా 5-0-24-0; కోహ్లి 1-0-4-0.

చివరి బెర్త్ ఆసీస్‌దే

- సెమీఫైనల్ చేరిన డిఫెండింగ్ చాంపియన్
- ఆఖరి లీగ్ మ్యాచ్‌లో న్యూజిలాండ్‌పై గెలుపు
- మహిళల టి20 ప్రపంచ కప్

మెల్‌బోర్న్: సెమీఫైనల్ చేరాలంటే తప్పక గెలవాల్సిన చోట ఆస్ట్రేలియా మహిళల జట్టు ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. మహిళల టి20 ప్రపంచకప్‌లో భాగంగా సోమవారం న్యూజిలాండ్ జట్టుతో జరిగిన గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 4 పరుగుల తేడాతో గెలిచింది. దాంతో వరుసగా ఏడోసారి టి20 ప్రపంచ కప్‌లో సెమీస్ చేరిన తొలి జట్టుగా రికార్డు నెలకొల్పింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 155 పరుగులు చేసింది. ఓపెనర్ బెత్ మూనీ (50 బంతుల్లో 60; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో ఆకట్టుకుంది. ఆమెకు మెగ్ ల్యానింగ్ (21; 4 ఫోర్లు), గార్డ్‌నెర్ (20; 2 ఫోర్లు), ఎలీస్ పెర్రీ (21; 2 ఫోర్లు) సహాయపడగా... చివర్లో రాచెల్ హైనస్ (8 బంతుల్లో 19; 2 ఫోర్లు, సిక్స్) దూకుడుగా ఆడింది. అనంతరం ఛేదనలో కివీస్ జట్టు 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసి ఓడింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జార్జియా వారెమ్ (3/17), మేఘాన్ షూట్ (3/28) ప్రత్యర్థి పతనాన్ని శాసించారు. నిలకడగా ఆడుతున్నట్లు కనిపించిన సోఫీ డివైన్ (31; 2 ఫోర్లు, సిక్స్), సుజీ బేట్స్ (14; 2 ఫోర్లు), మ్యాడీ గ్రీన్ (28; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)లను వారెమ్ పెవిలియన్‌కు చేర్చి మ్యాచ్‌ను ఆసీస్ వైపుకు తిప్పింది. మార్టిన్ (18 బంతుల్లో 37; 4 ఫోర్లు, సిక్స్) కివీస్ విజయం కోసం తుది వరకు పోరాడినా ఫలితం లేకపోయింది. చివరి ఓవర్లో గెలుపు కోసం 20 పరుగులు చేయాల్సి ఉండగా... కివీస్ 15 పరుగులను మాత్రమే రాబట్టగలిగింది. ఇదే గ్రూప్‌లో నామమాత్రంగా జరిగిన మరో మ్యాచ్‌లో శ్రీలంక 9 వికెట్ల తేడాతో బంగ్లాదేశ్‌పై గెలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 91 పరుగులు చేసింది. నిగర్ సుల్తానా (39; 5 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. శశికళ సిరివర్దనే 4 వికెట్లతో రాణించింది. శ్రీలంక 15.3 ఓవర్లలో వికెట్ నష్టపోయి 92 పరుగులు చేసి విజయంతో టోర్నీని ముగించింది. ఓపెనర్లు హాసిని పెరీరా (39 బ్యాటింగ్; 5 ఫోర్లు), చమరి జయాంగని (30; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకున్నారు. **నేడు జరిగే గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌ల్లో థాయ్‌లాండ్‌తో పాకిస్తాన్; వెస్టిండీస్‌తో దక్షిణాఫ్రికా తలపడనున్నాయి. ఇప్పటికే గ్రూప్ 'బి' నుంచి దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ సెమీస్ చేరాయి. అయితే విండీస్‌పై గెలిస్తే దక్షిణాఫ్రికా గ్రూప్ 'టాపర్'గా నిలుస్తుంది.**

సురేఖ రెండు జాతీయ రికార్డులు

ప్రపంచకప్ ఆర్చరీ టోర్నీకి ఎంపిక

సాక్షి, విజయవాడ స్పోర్ట్స్: కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ వెన్నం జ్యోతి సురేఖ కొత్త సీజన్‌ను ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నమెంట్‌తో మొదలుపెట్టనుంది. మే 11 నుంచి 17 వరకు టర్కీలోని అంటాల్యాలో జరిగే రెండో ప్రపంచకప్‌లో జ్యోతి సురేఖ కాంపౌండ్ విభాగంలో భారత్ తరఫున బరిలోకి దిగనుంది. గ్వాటెమాలా సిటీలో ఏప్రిల్ 20 నుంచి 26 వరకు జరిగే తొలి వరల్డ్ కప్‌లో మాత్రం భారత్ ద్వితీయ శ్రేణి జట్టును పంపించనుంది. ప్రపంచకప్‌లలో పాల్గొనే భారత జట్ల ఎంపిక కోసం హరియాణాలో సోమవారం ముగిసిన సెలక్షన్ ట్రయల్స్‌లో సురేఖ రెండు కొత్త జాతీయ రికార్డులు నమోదు చేయడంతోపాటు టాప్ ర్యాంక్‌లో నిలిచింది. తొలుత నిర్వహించిన ట్రయల్స్‌లో మొత్తం 720 పాయింట్లకుగాను సురేఖ 709 పాయింట్లు స్కోరు చేసి గతంలో 707 పాయింట్లతో తన పేరిటే ఉన్న జాతీయ రికార్డును సవరించింది. డబుల్ ఫిఫ్టీ రౌండ్ విభాగంలో 1440 పాయింట్ల కోసం నిర్వహించిన ట్రయల్స్‌లో సురేఖ 1411 పాయింట్లు సాధించి ఈ విభాగంలోనూ గతంలో 1405 పాయింట్లతో తన పేరిటే ఉన్న రికార్డును తిరగరాసింది.

అత్యుత్తమ ర్యాంక్‌లో భారత హాకీ జట్టు

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తొలిసారి నాలుగో స్థానం

లుసానే (స్విట్జర్లాండ్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత పురుషుల హాకీ జట్టు అత్యుత్తమ ర్యాంక్‌ను అందుకుంది. 2003లో ప్రపంచ ర్యాంకింగ్స్ మొదలయ్యాక భారత్ తొలిసారి నాలుగో స్థానానికి చేరుకుంది. ఎఫ్ఐహెచ్ ప్రొ లీగ్‌లోని తొలి మూడు రౌండ్లలో భారత జట్టు అద్భుత ప్రదర్శన చేసి ఐదో స్థానం నుంచి నాలుగో స్థానానికి ఎగబాకింది. రియో ఒలింపిక్స్ చాంపియన్ అర్జెంటీనా నాలుగు నుంచి ఐదో స్థానానికి పడిపోయింది. ప్రపంచ చాంపియన్ బెల్జియం టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. మహిళల విభాగంలోభారత జట్టు తొమ్మిదో స్థానంలో ఉంది.

అంతర్జాతీయ టోర్నీలకు కోవిడ్-19 దెబ్బ

కౌలాలంపూర్: మనషుల ప్రాణాల్ని హరిస్తున్న కోవిడ్-19 వైరస్‌తో పెద్ద ముప్పే వచ్చి పడింది. ప్రపంచ వర్తకం, వాణిజ్యం, ఔషధ, పర్యాటక, ఉత్పాదక రంగాలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న ఈ 'కోవిడ్-19' క్రీడలతోనూ ఓ ఆటాడుకుంటోంది. దీని వల్ల ఆసియా చాంపియన్స్ లీగ్ (ఫుట్‌బాల్) నాకౌట్ మ్యాచ్‌లు వాయిదా పడ్డాయి. లీగ్‌లు సవ్యంగా సాగకపోవడంతో సుదీర్ఘ షెడ్యూల్ అవసరమైంది. మే దాకా కొన్ని లీగ్ మ్యాచ్‌లు జరగాల్సి ఉన్నాయి. అవి పూర్తయ్యాకే మే నుంచి ఆగస్టు నెలలో నాకౌట్ మ్యాచ్‌లు జరుగుతాయని ఆసియా ఫుట్‌బాల్ కాన్ఫెడరేషన్ (ఏఎఫ్‌సీ) జనరల్ విండ్‌సర్ జాన్ తెలిపారు.

- **స్క్వాష్** : కొవిడ్-19 దెబ్బకు రెండు స్క్వాష్ ఈవెంట్లు వాయిదా పడ్డాయి. ఈ నెల 25 నుంచి 29 వరకు కౌలాలంపూర్‌లో జరగాల్సిన ఆసియా టీమ్ చాంపియన్‌షిప్, చైనాలో జూన్ 29 నుంచి జూలై 3 వరకు జరగాల్సిన ఆసియా జూనియర్ పోటీలు ఎప్పుడు జరిగేది తర్వాత వెల్లడిస్తారు.
- **అజ్లాన్ షా హాకీ:** మలేసియాలోని ఐపోలో వచ్చే నెల 11 నుంచి 18 దాకా జరగాల్సిన అజ్లాన్ షా కప్ హాకీ టోర్నీని సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహిస్తారు.
- **రేస్ వాక్:** ఈ నెల 15 నుంచి జపాన్‌లో జరగాల్సిన ఆసియా 20 కిలోమీటర్ల రేస్ వాక్ వాయిదా పడింది. ఇందులో 13 మంది భారత అథ్లెట్లు అర్హత సాధించారు.

డు ప్లెసిస్ పునరాగమనం

- భారత్‌తో వన్డే సిరీస్‌కు ఎంపిక

జొహన్నెస్‌బర్గ్: ఈ నెలలో భారత్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం దక్షిణాఫ్రికా వన్డే జట్టును సోమవారం ప్రకటించింది. ఇటీవల విశ్రాంతి తీసుకున్న మాజీ కెప్టెన్ డు ప్లెసిస్, వాన్ డెర్ డసెన్‌లు వన్డే జట్టులో పునరాగమనం చేశారు. వన్డే ప్రపంచకప్ తర్వాత డు ప్లెసిస్ మళ్లీ ఈ ఫార్మాట్ ఆడలేదు. ఆ మెగాటోర్నీలో అతని సారథ్యంలోని సఫారీ జట్టు పేలవ ప్రదర్శనతో లీగ్ దశలోనే నిష్క్రమించింది. భారత్‌తో మూడు వన్డేల సిరీస్ ఈ నెల 12 ధర్మశాలలో జరిగే తొలి మ్యాచ్ ద్వారా మొదలవుతుంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ జార్జ్ లిండేకు తొలిసారి వన్డే జట్టులో చోటు దక్కింది.
దక్షిణాఫ్రికా వన్డే జట్టు: డికాక్ (కెప్టెన్), డుప్లెసిస్, వాన్ డెర్ డసెన్, కైల్ వెరిన్, క్లాసెన్, మిల్లర్, స్మట్స్, ఫెలుక్వాయో, బవుమా, ఇన్‌గిడి, సిపామ్లా, హెండ్రిక్స్, నోర్జె, లిండే, కేశవ్ మహరాజ్.

చైనాX భారత్

నేటి నుంచి ఫెడ్ కప్ టెన్నిస్ టోర్నీ

దుబాయ్: భారత మహిళల టెన్నిస్ జట్టుకు ఫెడ్ కప్ ఆసియా ఓసియానియా గ్రూప్-1లో తొలి రౌండ్‌లోనే అగ్ని పరీక్ష ఎదురుకానుంది. నేడు జరిగే తొలి లీగ్ మ్యాచ్‌లో చైనాతో సానియా మీర్జా, అంకిత రైనా, రియా భాటియా, రుతుజా, తెలుగమ్మాయి సౌజన్య భవిశెట్టిలతో కూడిన భారత్ తలపడనుంది. చైనా జట్టు ప్రపంచ 28వ ర్యాంకర్ కియాంగ్ వాంగ్, షుయె జాంగ్, జెంగ్ సాయ్‌సాయ్, షుయె పెంగ్, జు ఇఫాన్‌లతో పటిష్టంగా కనిపిస్తోంది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లో అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్‌ను కియాంగ్ వాంగ్ ఓడించి సంచలనం సృష్టించింది. చైనాతో మ్యాచ్ తర్వాత భారత్ వరుసగా ఉజ్బెకిస్తాన్ (బుధవారం), కొరియా (గురువారం), చైనీస్ తైపీ (శుక్రవారం), ఇండోనేసియా (శనివారం) జట్లతో ఆడుతుంది. 'టాప్'-2లో నిలిచిన రెండు జట్లు ఏప్రిల్‌లో జరిగే ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి.

కర్ణాటక విజయ లక్ష్యం 352

కోల్‌కతా: రంజీ ట్రోఫీలో కర్ణాటక తుదిపోరుకు చేరాలంటే 352 పరుగుల లక్ష్యాన్ని ఛేదించాలి. బెంగాల్‌తో జరుగుతున్న సెమీఫైనల్లో సోమవారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక రెండో ఇన్నింగ్స్‌లో 38 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలుండగా... చేతిలో 7 వికెట్లున్న కర్ణాటక 254 పరుగులు చేయాల్సి ఉంది. దేవదత్ పడిక్కల్ (50 బ్యాటింగ్), మనీశ్ పాండే (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. అంతకుముందు 72/4 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన బెంగాల్ 161 పరుగుల వద్దే ఆలౌటైంది. రాజ్‌కోట్‌లో జరుగుతున్న మరో సెమీస్‌లో గుజరాత్ తొలి ఇన్నింగ్స్‌లో 252 పరుగుల వద్ద ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్రకు 52 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన సౌరాష్ట్ర ఆట నిలిచే సమయానికి 29 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 66 పరుగులే చేసింది. గజా (7-3-15-5) సౌరాష్ట్రను దెబ్బ తీశాడు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

1. షార్ట్ టెండరు నోటీసు నెం. 1SE/2019-20 **తేది: 29.02.2020**
2. పని పేరు: గాలేరు నగరి సృజల స్రవంతి పథకము ప్యాకేజి. నెం.30:- అవుకు టన్నెల్ II యొక్క పరిశోధన, డిజైన్స్, తవ్వకం, లైనింగ్ మరియు డైవర్షన్ టన్నెల్ I&II యొక్క లైనింగ్ కిలోమీటర్ 57.7000 నుండి జిఎన్ఎస్ఎస్ వరద ప్రవాహ కాలువ నుండి అవుకు రిజర్వాయర్ అడిట్ నిర్మాణంతో సహా (మిగులు పని). 3. అంచనా విలువ సుమారు: రూ.126,00,00,000/- 4. టెండరు డాక్యుమెంట్స్ లభించు తేది: 05.03.2020 ఉదయం: 11.00 గంటల నుండి. 5. టెండరు దాఖలు చేయుటకు చివరి తేది, సమయం: 12.03.2020 సాయంకాలము: 5.00 గంటల వరకు. 6. ఫైనాన్షియల్ బిడ్ తెరుచు తేది: 16.03.2020 ఉదయం 11.00 గంటల నుండి 7. సంబంధిత అధికారి కార్యాలయ వివరములు: శ్రీ కె.రవి, పర్యవేక్షక ఇంజినీరు, శ్రీశైలం కుడిగట్టు కాలువ వలయం నెం.2, నంద్యాల, కర్నూల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ PIN-518501, ఫోన్ నంబర్: 7013702229, 6309314799. **Email:: sesrbc2@yahoo.co.in** ఇతర వివరములకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లేస్ **www.eprocurement.gov.ap.in** వెబ్‌సైట్‌ను చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, శ్రీశైలం కుడిగట్టు కాలువ వలయం నెం.2, నంద్యాల, కర్నూల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్
DIPR Ro.No.424PP/CL/Advt/1/1/2019-20, Dt. 02/03/2020

సాక్షి బిజినెస్
మంగళవారం
3-3-2020
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
153	69
38,144	11,133

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)

నాస్‌డాక్	8,808	240
డోజోన్స్	26,209	800
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,655	74
డాక్స్	11,858	32
షాంఘై	2,971	91
నికాయ్	21,344	201

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఫామ్‌కుకి	71.35	73.00
£	బ్రిటన్ పౌండ్	ఫామ్‌కుకి	91.04	94.24
€	యూరో	ఫామ్‌కుకి	78.34	81.29
¥	జపాన్ ఎన్ (100)	ఫామ్‌కుకి	65.40	67.84
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఫామ్‌కుకి	46.13	48.29
S$	సింగపూర్ డాలర్	ఫామ్‌కుకి	51.04	52.78
SAR	సౌదీ రియాల్	ఫామ్‌కుకి	18.61	20.21
UAE D	యూఏఈ దిర్హామ్	ఫామ్‌కుకి	19.35	20.55
¥	చైనా యువాన్	ఫామ్‌కుకి	9.82	11.07

+786 నుంచి -511 వరకూ...

గతవారం నష్టాల నేపథ్యంలో వేల్యూ బయింగ్ • జోరుగా షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు
పలు దేశాల కేంద్ర బ్యాంకుల ప్యాకేజీలపై ఆశలు • ఆరంభంలో భారీగా లాభపడ్డ సూచీలు
భారత్‌లో కొత్తగా 2 కోవిడ్-19 కేసులు • చివరి అరగంటలో కుప్పకూలిన స్టాక్‌సూచీలు
786 పాయింట్ల లాభం నుంచి 511 పాయింట్ల నష్టానికి సెన్సెక్స్
చివరకు 153 పాయింట్ల నష్టంతో 38,144 వద్ద ముగింపు
69 పాయింట్లు పతనమై 11,133కు నిఫ్టీ • ఏడో రోజూ నష్టాలే

సోమవారం స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ రోలర్ కోస్టర్ రైడ్‌ను తలపించింది. స్టాక్ మార్కెట్ భారీగా లాభపడి, చివరి అరగంటలో ఈ లాభాలన్నింటినీ కోల్పోయి భారీగా నష్టపోయి, మళ్లీ ఈ నష్టాల్లో మూడో వంతు వరకూ రికవరీ చేసుకొని ఓ మోస్తరు నష్టాల్లో ముగిసింది. వేల్యూ బయింగ్‌కు తోడు షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు జత కావడంతో సెన్సెక్స్, నిఫ్టీలు ఇంట్రాడేలో భారీగా లాభపడ్డాయి. ముడి చమురు ధరలు 2.2 శాతం తగ్గడం, కుంటుపడుతున్న అంతర్జాతీయ వృద్ధిని గాడిన పడేయడానికి పలు దేశాల కేంద్ర బ్యాంకులు తగ్గిస్తాయని, ఉద్దీపన చర్యలు తీసుకుంటాయనే అంచనాలు...సానుకూల ప్రభావం చూపాయి. అయితే చివరి అరగంటలో సీన్ మారిపోయింది. భారత్‌లో తాజాగా రెండు కోవిడ్-19(కరోనా) వైరస్ కేసులు వెలుగుచూడటంతో ఈ లాభాలన్నీ ఆవిరయ్యాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 153 పాయింట్లు పతనమై 38,144 పాయింట్ల వద్ద, నిఫ్టీ 69 పాయింట్లు పతనమై 11,133 పాయింట్ల వద్ద ముగిశాయి. స్టాక్ సూచీలు ఏడో రోజూ నష్టాల్లోనే ముగిశాయి. ఆర్థిక, ఉక్కు, ఎఫ్ఎమ్‌సీజీ షేర్లు భారీగా పడ్డాయి. ఐటీ, టెక్నాలజీ సూచీలు మినహా మిగిలిన సూచీలు నష్టాల్లో ముగిశాయి.

1,297 పాయింట్ల రేంజ్‌లో సెన్సెక్స్..

గత ఆరు రోజుల నష్టాల కారణంగా తీవ్రంగా పతనమై ఆకర్షణీయంగా ఉన్న షేర్లలో కొనుగోళ్లు (వేల్యూ బయింగ్)జోరుగా జరిగాయి. కోవిడ్-19(కరోనా) వైరస్ ధాటికి విలవిలలాడుతున్న ఆర్థిక వ్యవస్థను గట్టెక్కించడానికి వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు ఉద్దీపన చర్యలు తీసుకోగలవన్న అంచనాలు, షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు సానుకూల ప్రభావం చూపాయి. ఫలితంగా సెన్సెక్స్ ఇంట్రాడేలో 786 పాయింట్ల లాభంతో 39,083 పాయింట్ల వద్దకు చేరింది. నిఫ్టీ కూడా 231 పాయింట్ల లాభంతో 11,433 పాయింట్లకు పెరిగింది. అయితే భారత్‌లో తాజాగా రెండు కరోనా కేసులు నమోదయ్యాయని కేంద్రం ప్రకటించడంతో సూచీలు కుప్పకూలాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 511 పాయింట్ల నష్టంతో 37,786 పాయింట్లకు, నిఫ్టీ 166 పాయింట్ల నష్టంతో 11,036 పాయింట్లను తాకాయి. ఇంట్రాడే గరిష్ట స్థాయిల నుంచి చూస్తే, సెన్సెక్స్ 1,297 పాయింట్లు, నిఫ్టీ 397 పాయింట్ల మేర పతనమయ్యాయి. ఈ ఏడాది జనవరిలో ఎనిమిదేళ్ల గరిష్టానికి ఎగసిన భారత తయారీ రంగ వృద్ధి ఫిబ్రవరిలో ఒకింత మందగించినా ఆరంభంలో కొనుగోళ్లు జోరుగానే సాగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాలను ఫిచ్ సొల్యూషన్స్ సంస్థ 5.1 శాతం నుంచి 4.9 శాతానికి తగ్గించడం పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. షాంఘై, హాంకాంగ్, సియోల్, టోక్యో సూచీలు చెప్పుకోదగ్గ లాభాల్లో ముగిశాయి. యూరప్ మార్కెట్లు లాభాల్లోనే ఆరంభమైనా, ఆ తర్వాత నష్టాల్లోకి జారిపోయాయి. చివరకు మిశ్రమంగా ముగిశాయి.

- ఎస్‌బీఐ అనుబంధ కంపెనీ, ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్స్ సర్వీసెస్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) ఆరంభమైన నేపథ్యంలో ఎస్‌బీఐ షేర్ 5% నష్టంతో రూ.287 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో బాగా నష్టపోయిన షేర్ ఇదే. సెన్సెక్స్ 153 పాయింట్ల నష్టంలో మూడో వంతు వాటా (55 పాయింట్లు) ఈ షేర్‌దే.
- 400కు పైగా షేర్లు ఏడాది కనిష్ట స్థాయిలకు పడిపోయాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్, గెయిల్ ఇండియా, హీరో మోటోకార్ప్, హిందాల్కో, హిందుస్తాన్ జింక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, మహీంద్రా అండ్ మహీంద్రా, మ్యారికో, ఎన్‌బీసీసీ, ఎన్‌టీపీసీ, ఆయిల్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, వేదాంత, ఏసీసీ, అపోలో టైర్స్, ఆశోక బిల్డ్‌కాన్, జిల్లెట్ ఇండియా, థెర్మాక్స్, లుపిన్, రేమండ్, భెల్, ఓఎన్‌జీసీ, హెచ్‌పీసీఎల్, టాటా పవర్, విప్రో తదితర షేర్లు ఈ జాబితాలో ఉన్నాయి.
- ఫిబ్రవరిలో వాహన అమ్మకాలు పుంజుకోవడంతో ఎస్కార్ట్స్ షేర్ 8 శాతం లాభంతో రూ.843 వద్ద ముగిసింది.
- నేడు(మంగళవారం) బోర్డ్ మీటింగ్ జరగనున్న నేపథ్యంలో మిధాని షేర్ ఇంట్రాడేలో 13 శాతం లాభంతో ఆల్‌టైమ్ హై, రూ.278ను తాకింది. చివరకు 3 శాతం నష్టంతో రూ.238 వద్ద ముగిసింది. ఈ సమావేశంలో కంపెనీ మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించనున్నట్లు సమాచారం.

ఏడు రోజుల నష్టాల కారణంగా రూ.13 లక్షల కోట్లు మేర ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్‌రూ.13 లక్షల కోట్లు తగ్గి రూ.145.80 లక్షల కోట్లకు పడిపోయింది.

పుల్‌బ్యాక్ ర్యాలీకి బ్రేక్!

గత ఆరు రోజులుగా 7 శాతం మేర నష్టపోయిన మార్కెట్లో ఈ వారం పుల్‌బ్యాక్ ర్యాలీ ఉండొచ్చని అంచనాలున్నాయని షేర్‌ఖాన్ బై బీఎన్‌పీ పారిబా అనలిస్ట్ గౌరవ్ దువా పేర్కొన్నారు. ఈ అంచనాలకనుగుణంగానే పుల్‌బ్యాక్ ర్యాలీ వచ్చినప్పటికీ, కొత్తగా నమోదైన కరోనా కేసులు ఈ పుల్‌బ్యాక్ ర్యాలీని ఆరంభంలోనే నిలువరించాయని వ్యాఖ్యానించారు. ప్రపంచ మార్కెట్లు స్థిరంగా ఉన్నా, మన మార్కెట్లో పతనం తప్పలేదని వివరించారు.

రూపాయికి కరోనా కష్టాలు..

52 పైసలు డౌన్ – 72.76 వద్ద క్లోజ్

ముంబై: భారత్‌లో కొత్తగా రెండు కరోనా వైరస్ కేసులు బైటపడ్డాయన్న వార్తలతో దేశీ ఈక్విటీ అమ్మకాలు వెల్లువెత్తిన నేపథ్యంలో దేశీ కరెన్సీ గణనీయంగా క్షీణించింది. డాలర్‌తో పోలిస్తే 52 పైసలు పతనమైంది. 72.76 వద్ద ముగిసింది. సోమవారం రూపాయి ట్రేడింగ్ లాభాల్లోనే ప్రారంభమైనప్పటికీ.. రెండు కొత్త కరోనా కేసులు నమోదయ్యాయంటూ కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించడంతో.. స్టాక్ మార్కెట్లలో అమ్మకాలు వెల్లువెత్తాయి. ఆ ప్రభావం రూపాయిపైనా పడింది. ఒక దశలో 72.78 కనిష్ట స్థాయికి కూడా క్షీణించి.. చివరికి 72.76 వద్ద క్లోజయ్యింది. రాబోయే సెషన్లలో రూపాయి బలహీనంగానే ట్రేడ్ కావొచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషకుడు గౌరంగ్ సోమయ్య తెలిపారు. 72.50-73.20 శ్రేణిలో తిరుగాడవచ్చన్నారు.

నోకియా సీఈఓ రాజీవ్ సూరి రాజీనామా

లండన్: భారత సంతతికి చెందిన రాజీవ్ సూరి నోకియా ప్రెసిడెంట్, సీఈఓ పదవికి రాజీనామా చేశారు. సంస్థకు 25 ఏళ్ల పాటు సేవలందించిన సూరి తన వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామాను సమర్పించారని నోకియా ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ ఏడాది ఆగస్టు 31తో ఈయన పదవీకాలం ముగియనుండగా.. నూతన ప్రెసిడెంట్, సీఈఓగా పెక్కా లండ్‌మార్క్ పేరును కంపెనీ బోర్డు ఖరారు చేసింది. సూరీ పదవీకాలం ముగిసినప్పటికీ.. వచ్చే ఏడాది జనవరి ఒకటి వరకు సలహాదారుగా ఉండనున్నారని గతంలో ప్రకటించింది.

ఎన్ఎండీసీ స్టార్టప్స్ ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్

హైదరాబాద్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్స్‌ను ప్రోత్సహించేందుకు నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ) ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్ (ఎన్ఐసీఈ)ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన ఐ-టీఐసీ ఫౌండేషన్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. ఐదేళ్ల ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఎన్ఎండీసీ ఐఐటీ-హైదరాబాద్ ప్రాంగణంలో స్టార్టప్ ఎకో సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తుందని ఎన్ఎండీసీ సీఎండీ ఎన్ బైజేంద్ర కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజనీరింగ్, టెక్నాలజీ, సర్వీసెస్ రంగాల్లో వినూత్న, సరికొత్త సాంకేతికత స్టార్టప్స్‌ను ప్రోత్సహిస్తుందని.. ఐదేళ్ల ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌కు ఎన్ఎండీసీ రూ.10 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపారు. తొలి దశలో 15 స్టార్టప్స్‌లకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

రామ్‌కీ ఎన్విరోకు అవార్డు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ సర్వీసుల్లో ఉన్న రామ్‌కీ ఎన్విరో ఇంజనీర్స్‌కు వీసీ సర్కిల్ అవార్డు వరించింది. 2020 సంవత్సరానికిగాను ఇండస్ట్రియల్ కంపెనీ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కించుకుంది. ఇటీవల ముంబైలో జరిగిన వీసీ సర్కిల్ 9వ వార్షిక అవార్డుల కార్యక్రమంలో రామ్‌కీ ఎన్విరో ఈ గౌరవం అందుకుంది.

సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...

- అనిశ్చితి మార్కెట్లో సిప్ పెట్టుబడులు మేలు!
- ఏడాది కనిష్టానికి 13 పీఎస్‌బీలు... ఇది కొనే సమయమా?
- 52 వారాల కనిష్టానికి 298 షేర్లు
- ఈ స్టాక్స్ చూడొచ్చు!

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్- మార్కెట్ అప్‌డేట్స్, విశ్లేషణలు, అప్‌డేట్స్ కోసం... SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం.. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

WWW.BUSINESS.SAKSHI.COM

ఏఎంఐఎఫ్ వాటా కొనుగోలు చేసిన శ్రీసిటీ

ముంబై: బిజినెస్ పార్క్, సెజ్‌ను నిర్వహిస్తున్న శ్రీసిటీ తాజాగా సంస్థ ఇన్వెస్టర్ అయిన 'ఏఎంఐఎఫ్ హోల్డింగ్'కు చెందిన 16.7 శాతం వాటాను గత నెలలో కొనుగోలు చేసింది. ఏఎంఐఎఫ్ 2008 నుంచి శ్రీసిటీ వాటాదారుగా ఉంది. ప్రతిపాదిత ఐపీవో ఆలస్యం కావడంతో ఈ వాటాను కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు శ్రీసిటీ ఫౌండర్, ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. ప్రస్తుతం మార్కెట్ బాగాలేదని, కంపెనీ ఆదాయం తక్కువగా ఉన్నందున మరో ఏడాది వరకు ఐపీవో లేనట్టేనని స్పష్టం చేశారు. ప్రి-ఫ్యాబ్రికేటెడ్ ఫ్యాక్టరీల నిర్మాణం కోసం వచ్చే రెండేళ్లలో సంస్థ రూ.200 కోట్లు వెచ్చిస్తోంది.

'పన్ను' పరిష్కారాలకు 'వివాద్ సే విశ్వాస్'

- **మార్చి 31లోగా చెల్లిస్తే జరిమానాలుండవు**
- **పెనాల్టీలుండవు; ఆపై క్షమాభిక్ష కూడా...**
- **ఆ తరవాత జూన్ 30లోగా కూడా చెల్లించొచ్చు**
- **కాకుంటే ఓ 10 శాతం ఎక్కువ చెల్లించాలి**
- **దీంతో ట్యాక్స్ పేయర్లకు డబ్బు, సమయం ఆదా**
- **నిర్మలా సీతారామన్ వెల్లడి; లోక్‌సభకు బిల్లు**

న్యూఢిల్లీ: పన్ను చెల్లింపుదారులకు సాయపడేందుకే వివాదాల పరిష్కార పథకం 'వివాద్ సే విశ్వాస్'ను బడ్జెట్‌లో ప్రకటించినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. ''ఈ పథకం పన్ను వివాదాల్ని పరిష్కరించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. పన్ను చెల్లింపుదారులు.. కేసుల పరిష్కారానికి ఎంతో సమయాన్ని, డబ్బు వెచ్చించాల్సి వస్తోంది. ఈ పథకం వాటిని ఆదా చేస్తుంది'' అని తెలియజేస్తూ.. 'డైరెక్ట్ ట్యాక్సెస్ వివాద్ సే విశ్వాస్, 2020' బిల్లును సోమవారం పార్లమెంట్‌లో మంత్రి ప్రవేశపెట్టారు.

ఎందుకు ఈ పథకం..?

ప్రత్యక్ష పన్నులకు సంబంధించి కమిషనర్, అప్పీల్స్, ఆదాయపన్ను శాఖ.. ఆదాయపన్ను అప్పిలేట్ ట్రైబ్యునల్.. హైకోర్టు.. సుప్రీంకోర్టు వంటి పలు అప్పిలేట్ వేదికల వద్ద 4,83,000 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.9 లక్షల కోట్లు రావాల్సి ఉంది. వీటిలో అధిక భాగాన్ని ఈ ఏడాది మార్చి చివరికి పరిష్కరించి, పన్నుల ఆదాయం పెంచుకోవాలన్నది కేంద్ర ప్రభుత్వం లక్ష్యం. వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం కూడా ఈ లక్ష్యంలో భాగమే. ఈ పథకంలో కింద... వివాదంలో ఉన్న పన్ను మొత్తాన్ని చెల్లించినట్లయితే వారికి ఎలాంటి జరిమానాలూ ఉండవు. పైపెచ్చు క్షమాభిక్ష కల్పిస్తారు. తద్వారా భవిష్యత్తులో ఆ వివాదానికి సంబంధించి చట్టపరమైన విచారణలు లేకుండా రక్షణ పొందొచ్చు.

ఎవరికి వర్తిస్తుంది..

ఆదాయపన్ను శాఖ జారీ చేసిన డిమాండ్ నోటీసులను వ్యతిరేకిస్తూ అప్పీల్‌కు వెళ్లిన వారు.. 2020 మార్చి 31 నాటికి బకాయిలను చెల్లిస్తే చాలు. దానిపై వడ్డీ, పెనాల్టీని ప్రభుత్వం రద్దు చేస్తుంది. గడువు నాటికి చెల్లించలేకపోతే, మార్చి తర్వాత జూన్ 30 వరకు మరో విడత గడువు లభిస్తుంది. కానీ, మార్చి 31లోపు చెల్లించాల్సిన దానితో పోలిస్తే ఆ తర్వాత 10 శాతం అదనంగా చెల్లించాలి. 2020 జనవరి 31 నాటికి పలు అప్పిలేట్ ఫోరమ్‌ల వద్ద నమోదై, అపరిష్కృతంగా ఉన్న కేసులు ఈ పథకం పరిధిలోకి వస్తాయి. పన్ను చెల్లింపులు రూ.5 కోట్లలోపు ఉన్న సోదా కేసులకే ఇది వర్తిస్తుంది.

ఎంత మేర చెల్లించాలి..?

సోదా కేసులు: ఆదాయ పన్ను, వడ్డీ, పెనాల్టీల రూపంలో చెల్లించాల్సిన మొత్తానికి మరో 25 శాతం కలిపి మొత్తం 125 శాతాన్ని మార్చి చివరి నాటికి చెల్లించడం ద్వారా వివాదాలను తొలగించుకోవచ్చు. మార్చిలోపు సాధ్యం కాకపోతే, తర్వాత జూన్ 31 నాటికి 135 శాతాన్ని చెల్లించాల్సి ఉంటుంది.

సోదా జరగని కేసులు: పన్ను, పెనాల్టీ, వడ్డీ రేటుపై వివాదం ఉంటే... ఆ మొత్తాన్ని (100 శాతాన్ని) మార్చి చివరిలోపు చెల్లించడం ద్వారా వివాదాన్ని మాఫీ చేసుకోవచ్చు. ఈ గడువు దాటితే జూన్ చివరికి 110 శాతాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు.. ఒక వ్యక్తి ఆదాయ పన్ను కింద రూ.1,00,000 చెల్లించగా.. ఆదాయపన్ను శాఖ మాత్రం చెల్లించాల్సిన పన్ను ఆదాయం రూ.1,50,000గా తేల్చి, దీనికి రూ.20,000 వడ్డీ కింద, రూ.1,00,000 పెనాల్టీ కింద చెల్లించాలని డిమాండ్ చేసి ఉంటే.. అప్పుడు వివాదంలో ఉన్న మొత్తం రూ.1,70,000 అవుతుంది. దీన్ని వ్యతిరేకిస్తూ పన్ను చెల్లింపుదారు అప్పీల్ కోసం దాఖలు చేసి ఉంటే.. ఈ కేసులో కేవలం రూ.50,000ను మార్చి చివరికి చెల్లించడం ద్వారా మాఫీ చేసుకోవచ్చు. మార్చి తర్వాత అయితే 10% అదనంగా రూ.55,000 చెల్లించాల్సి ఉంటుంది.

- ఇక కేవలం పెనాల్టీ, వడ్డీ రేటుపైనే వివాదం ఉన్నట్టయితే, చెల్లించాల్సిన మొత్తంలో మార్చి ఆఖరు నాటికి కనీసం 25% చెల్లిస్తే చాలు. ఆ తర్వాత జూన్‌లోపు అయితే చెల్లించాల్సిన మొత్తం 30 శాతం అవుతుంది. ఇవన్నీ కూడా పన్ను చెల్లింపుదారులు అప్పీలు దాఖలు చేసిన కేసులకే వర్తిస్తాయి. ఒకవేళ ఆదాయపన్ను శాఖే అప్పీల్‌కు వెళ్లి ఉంటే, చెల్లించాల్సిన మొత్తం ఇంత కంటే తక్కువగా ఉంటుంది.

అందరికీ ఈ పథకం వర్తించదండోయ్..



ఈ ప్రతిపాదిత పథకం కొన్ని వివాదాలకు వర్తించదు. పన్ను చెల్లింపుదారుడికి వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ ఆరంభమై ఉన్నా...సోదాలు జరిగి, రూ.5 కోట్లకు పైగా విలువైన స్వాధీనాలు చోటు చేసుకున్నా... బయటకు వెల్లడించని విదేశీ ఆదాయం, విదేశీ ఆస్తులు కలిగి ఉన్న కేసులైనా... భారతీయ శిక్షాస్మృతి, మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద విచారణ ఎదుర్కొంటున్నా... అటువంటి వారు ఈ పథకం కింద వివాదాలు పరిష్కరించుకునే అవకాశం ఉండదు.

వజ్రాల ఎగుమతులకూ దెబ్బ..

ముంబై: ప్రపంచవ్యాప్తంగా కోవిడ్-19 వైరస్ మరింతగా ప్రబలుతున్న నేపథ్యంలో భారత వజ్రాల ఎగుమతులు గణనీయంగా తగ్గనున్నాయి. 2020-21 ఆఖరు నాటికి 19 బిలియన్ డాలర్ల స్థాయికి పడిపోనున్నాయి. ఆ తర్వాతి ఆర్థిక సంవత్సరంలోనూ ఎగుమతులు తగ్గడమో లేదా అదే స్థాయిలో ఉండవచ్చని క్రిసిల్ రేటింగ్స్ ఒక నివేదికలో వెల్లడించింది. 2018-19లో భారత్ నుంచి వజ్రాల ఎగుమతులు 24 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో భారత్ నుంచి మొత్తం వజ్రాల ఎగుమతులు విలువపరంగా 18% తగ్గాయి. వీటిలో 40% ఎగుమతులు హాంకాంగ్‌కి జరిగాయి. అయితే, జనవరి 15 నుంచి హాంకాంగ్‌కు ఎగుమతులు నిల్చిపోయాయి.

'ఈ ఆర్థిక సంవత్సరం ఆఖరు త్రైమాసికంలో ఎగుమతులు మరింత తగ్గవచ్చు. ఆగ్నేయాసియా ప్రాంతంలో సెలవులు, కోవిడ్ వ్యాప్తితో మార్కెట్లు మూతబడటం మొదలైన అంశాల కారణంగా ఈ ఒక్క త్రైమాసికంలోనే దాదాపు బిలియన్ డాలర్ల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం ఉండొచ్చని అంచనా' అని క్రిసిల్ రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సుబోధ్ రాయ్ తెలిపారు. ఇప్పటికే డిమాండ్ పడిపోయి, వసూళ్లు తగ్గిపోవడం.. హాంకాంగ్‌లో రాజకీయ సంక్షోభం వంటి సమస్యలతో సతమతమవుతున్న వజ్రాల పరిశ్రమకు కోవిడ్19 మరో కొత్త సమస్యగా పరిణమించిందని పేర్కొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం మధ్య భాగంలో గానీ పరిశ్రమ పరిస్థితి చక్కబడకపోవచ్చని చెప్పారు.

ప్రపంచ ఎకానమీకి వైరస్ ముప్పు!

- **ఈ క్వార్టర్‌లో మందగించనున్న వృద్ధి**
- **దశాబ్దకాలంలో తొలిసారి: ఓఈసీడీ**

ప్యారిస్: ప్రపంచ దేశాలను కలవరపెడుతున్న కోవిడ్19 (కరోనా వైరస్) కారణంగా ఈ త్రైమాసికంలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ వృద్ధి కూడా మందగించనుంది. దాదాపు దశాబ్దకాలం నాటి ఆర్థిక సంక్షోభం తర్వాత త్రైమాసికాలవారీగా చూస్తే వృద్ధి మందగించనుండటం ఇదే తొలిసారి. వైరస్ ప్రభావాలపై ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) రూపొందించిన ప్రత్యేక నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. 2020లో ప్రపంచ దేశాల వృద్ధి రేటు సుమారు అరశాతం నెమ్మదించి 2.4 శాతానికి పరిమితం కావొచ్చని.. ఒకవేళ వైరస్ తీవ్రత పెరిగిన పక్షంలో ఇది 1.5 శాతానికి కూడా పడిపోవచ్చని ఓఈసీడీ పేర్కొంది. 'అంతర్జాతీయంగా వృద్ధి అవకాశాలు అంతంతమాత్రంగాను, అనిశ్చితిలోనూ ఉన్నట్లు కనిపిస్తోంది' అని వివరించింది. చివరిసారిగా 2008లో అంతర్జాతీయంగా ఆర్థిక సంక్షోభం తలెత్తినప్పుడు .. త్రైమాసికాలవారీగా వృద్ధి మందగించింది. పూర్తి సంవత్సరంపరంగా చూస్తే 2009లో వృద్ధి రేటు క్షీణించింది.

గతంలో కన్నా తీవ్రం..

గతంలో వచ్చిన వైరస్‌ల కన్నా ప్రస్తుత కరోనా వైరస్ ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండబోతున్నాయని ఓఈసీడీ హెచ్చరించింది. గతంతో పోలిస్తే ప్రస్తుతం ప్రపంచ దేశాలన్నీ ఒకదానితో మరొకటి మరింతగా అనుసంధానమై ఉండటమే ఇందుకు కారణమని తెలిపింది. 'ప్రపంచ ఉత్పత్తి, వాణిజ్యం, పర్యాటకం, కమోడిటీ మార్కెట్లలో చైనా పెద్ద పాత్ర పోషిస్తోంది. చైనాలో వైరస్ ధాటికి ఇప్పటికే ప్రపంచ దేశాలకు సరఫరా వ్యవస్థలు దెబ్బతిన్నాయి. వ్యాపార సంస్థల లాభాలకు గండి పడనుంది. కరోనా వైరస్ కారణంగా చైనాలో ఉత్పత్తి పడిపోవడంతో ప్రధానంగా ఆసియాపై ప్రతికూల ప్రభావం పడుతోంది. అలాగే చైనాపై ఆధారపడిన ఇతర దేశాల కంపెనీలూ సమస్యలు ఎదుర్కొంటున్నాయి' అని ఓఈసీడీ పేర్కొంది.

భారత్ అంచనాలు కట్..: కరోనా వైరస్ రిస్క్ కారణంగా వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి అంచనాలను 5.1 శాతానికి కుదించినట్లు ఓఈసీడీ తెలిపింది. గతంలో ఇది 6.2 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. ఆర్థిక మార్కెట్లు, పర్యాటక రంగం, సరఫరా వ్యవస్థల్లో సమస్యలు మొదలైన అంశాల వల్ల జీ20 దేశాల వృద్ధి రేటు మందగించవచ్చని తెలిపింది.

వృద్ధి రేటును 4.9 శాతానికి తగ్గించిన ఫిచ్

న్యూఢిల్లీ: భారత జీడీపీ వృద్ధి రేటు 2019-20 ఆర్థిక సంవత్సరానికి 5.1 శాతంగా ఉండొచ్చన్న గత అంచనాను 4.9 శాతానికి తగ్గిస్తున్నట్టు ఫిచ్ సొల్యూషన్స్ సోమవారం ప్రకటించింది. దేశీయంగా డిమాండ్ బలహీనంగా ఉండడం, కరోనా వైరస్ కారణంగా సరఫరా పరంగా అడ్డంకులతో తయారీ రంగం ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నట్టు ఈ సంస్థ పేర్కొంది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధి అంచనాలను కూడా గతంలో వేసిన 5.9 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గించింది. ''కోవిడ్ వైరస్ చైనాలో ప్రబలిన కారణంగా ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ సరఫరా చైన్‌లో ఏర్పడిన ఇబ్బందులు భారత ఎగుమతి ఆధారిత తయారీ రంగంపై ప్రభావం చూపిస్తుందన్న అంచనాలే తాజా సవరణకు నేపథ్యం''అని ఫిచ్ వివరించింది.

పౌల్ట్రీకి 1,750 కోట్ల నష్టాలు

న్యూఢిల్లీ: చికెన్ వల్ల కరోనా వైరస్ (కోవిడ్-19) ప్రబలుతోందన్న వదంతుల మూలంగా పౌల్ట్రీ పరిశ్రమ గణనీయంగా దెబ్బతింది. నెల రోజుల వ్యవధిలో ఏకంగా రూ. 1,750 కోట్ల మేర నష్టాలు చవిచూసింది. ఈ నేపథ్యంలో తక్షణం సహాయక ప్యాకేజీ ఇవ్వాలంటూ కేంద్ర పశు సంవర్ధక శాఖకు పౌల్ట్రీ రంగం విజ్ఞప్తి చేసింది. చికెన్‌కు డిమాండ్ తగ్గిపోవడంతో కోళ్ల ధరలు కేజీకి రూ. 10-30 స్థాయికి (ఫాం గేట్) పడిపోయినట్లు అఖిల భారత పౌల్ట్రీ బ్రీడర్స్ అసోసియేషన్ (ఏఐపీబీఏ) వెల్లడించింది. మరోవైపు సగటు ఉత్పత్తి ధర కేజీకి రూ. 80గా ఉంటోందని వివరించింది. 'సోషల్ మీడియాలో పదే పదే వదంతులు వ్యాప్తి కావడంతో.. చికెన్‌పై వినియోగదారుల నమ్మకం సడలింది. చికెన్ ఉత్పత్తుల డిమాండ్ పడిపోయింది' అని ఏఐపీబీఏ చైర్మన్ బహదూర్ అలీ తెలిపారు. దీంతో జనవరి మూడో వార

ఆర్‌బీఎల్, జొమాటో కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డ్

న్యూఢిల్లీ: ఎడిషన్, ఎడిషన్ క్లాసిక్ పేర్లతో రెండు రకాల కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులను ఆర్‌బీఎల్ బ్యాంక్, జొమాటో సంస్థలు సంయుక్తంగా విడుదలచేశాయి. ఈ కార్డులతో జొమాటో గోల్డ్ సభ్యత్వం, క్యాష్‌బ్యాక్, ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్ వంటి ఆఫర్లు లభిస్తాయని ప్రకటించాయి. గణనీయంగా వృద్ధి చెందుతున్న ఫుడ్ డెలివరీ వ్యాపారంలో బ్యాంకింగ్ సేవలను అందించడంలో భాగంగా తాజా కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డులను విడుదలచేశామని ఆర్‌బీఎల్ బ్యాంక్ క్రెడిట్ కార్డుల విభాగం హెడ్ ఉత్కర్ష్ సక్సేనా అన్నారు.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	43,050
బంగారం (22 క్యారెట్లు)	41,000
వెండి (కిలో)	48,600
హైదరాబాద్/చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	42,050
బంగారం (22 క్యారెట్లు)	40,050
వెండి (కిలో)	48,600
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	42,600
బంగారం (22 క్యారెట్లు)	39,450
వెండి (కిలో)	46,500
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	42,920
బంగారం (22 క్యారెట్లు)	39,920
వెండి (కిలో)	45,000
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	43,270
బంగారం (22 క్యారెట్లు)	40,050
వెండి (కిలో)	46,300

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	47.14 (రాత్రి 11.30కు)	$ 44.76 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	52.20 (రాత్రి 11.30కు)	$ 49.67 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 3-3-2020

విశాఖ	350-00
చిత్తూరు	368-00
వరంగల్	319-00
విజయవాడ	340-00
గోదావరి	340-00
2-3-2020 ఫామ్ ధర...	
హైదరాబాద్	316-00

ఫిబ్రవరి వాహన విక్రయాలు (దేశీయ)

కంపెనీ	2020	2019	వృ/క్షీ.(%)
టయోటా	10,352	11,760	-12
అశోక్ లేలాండ్	10,612	17,352	-39
మహీంద్రా ట్రాక్టర్స్	21,877	18,105	21
కియా మోటార్స్	15,644	--	--
బజాజ్ ఆటో	1,46,876	1,86,523	-21
హీరో మోటోకార్ప్	4,80,196	6,00,616	-20
టీవీఎస్ మోటార్	1,69,684	2,31,582	-27
హోండా మోటార్‌సైకిల్	3,15,271	4,08,559	-23
సుజుకీ మోటార్‌సైకిల్	58,644	57,174	3
రాయల్ ఎన్‌ఫీల్డ్	61,188	60,066	2

ఫిబ్రవరి వాహన విక్రయాలు డౌన్

దిగ్గజ కంపెనీల అమ్మకాల్లో రెండంకెల క్షీణత • పరిశ్రమను కుంగదీసిన కరోనా వైరస్

న్యూఢిల్లీ: గత నెల ఆటో పరిశ్రమ విక్రయాలు రెండంకెల క్షీణతను నమోదుచేశాయి. కోవిడ్-19 (కరోనా వైరస్) కారణంగా ఈ స్థాయి తగ్గుదలను చవిచూడవలసి వచ్చిందని హీరో మోటోకార్ప్ ఒక ప్రకటనలో పేర్కొంది. బీఎస్-6 వాహన ఉత్పత్తికి మారాల్సిరావడం, నగదు లభ్యత వంటి ప్రతికూల అంశాలతో గతేడాది మందగమనంలో ప్రయాణించిన ఆటో పరిశ్రమకు ఈ ఏడాది మొదటి నెల పర్వాలేదు అనుకున్న కొద్ది కాలంలోనే కరోనా వైరస్ రూపంలో మరో అతి పెద్ద సమస్య ఎదురైందని వివరించింది. ఆదివారం వెలువడిన ప్యాసింజర్ కార్ల డేటాలో మారుతీ 1.6% క్షీణతను నమోదుచేసిన విషయం తెలిసిందే కాగా.. సోమవారం వెల్లడైన టయోటా, అశోక్ లేలాండ్ అమ్మకాలు కూడా తగ్గుదలను నమోదుచేశాయి.

ఓయో మీద ఎన్‌సీఎల్‌టీలో కేసు నమోదు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్‌కు చెందిన హాస్పిటాలిటీ కంపెనీ కాన్‌క్లేవ్ ఇన్‌ఫ్రాటెక్ గుర్గావ్‌కు చెందిన హోటల్స్ చెయిన్ ఓయో రూమ్స్ మీద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)- అహ్మదాబాద్ చాప్టర్‌లో కేసు నమోదు చేసింది. నగరంలోని ది కాన్‌క్లేవ్ హోటల్‌ను ఓయో రూమ్స్ నిర్వహణ చేస్తుంది. బుకింగ్స్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా రూ.12,96,000 ఆదాయాన్ని ఓయో రూమ్స్ కాన్‌క్లేవ్ ఇన్‌ఫ్రాటెక్‌కు చెల్లించాలని ఇరు కంపెనీలు పరస్పర ఒప్పందాన్ని చేసుకున్నాయి. కానీ, 2018- 2019 మే మధ్య కాలంలో కేవలం రెండు నెలలు మాత్రమే ఓయో రూమ్స్ హామీ ఆదాయాన్ని అందించిందని, ఇక మిగిలిన నెలల్లో కనీస హామీ అగ్రిమెంట్ కంటే తక్కువ చెల్లించిందని కాన్‌క్లేవ్ ఎన్‌సీఎల్‌టీకి సమర్పించిన పిటీషన్‌లో పేర్కొంది.

ఫిబ్రవరిలో నిదానించిన తయారీ

ఐహెచ్ఎస్ మార్కిట్ పీఎంఐ 54.5 • జనవరిలో ఇది 55.3

న్యూఢిల్లీ: దేశ తయారీ రంగంలో కార్యకలాపాలు ఫిబ్రవరిలో కాస్త నిదానించాయి. ఐహెచ్ఎస్ మార్కిట్ ఇండియా మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) జనవరిలో ఏడేళ్ల గరిష్ట స్థాయిలో 55.3 శాతానికి చేరగా, ఫిబ్రవరిలో 54.5 శాతానికి పరిమితమైంది. ఎగుమతులు, సరఫరా మార్గాలపై కరోనా వైరస్ ప్రభావంతో వ్యాపార సెంటిమెంట్‌కు విఘాతం కలిగినట్టు ఐహెచ్ఎస్ మార్కిట్ తెలియజేసింది. తయారీ రంగ పీఎంఐ 55 స్థాయికి పైన వరుసగా 31వ నెలలోనూ కొనసాగడం గమనార్హం. పీఎంఐ 50కు పైన ఉంటే విస్తరణగా, అంతకు దిగువన ఉంటే తగ్గుతున్నట్టుగా పరిగణిస్తారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ఫిబ్రవరిలోనూ బలమైన ఆర్డర్ల రాకతో భారత్‌లోని ఫ్యాక్టరీలు లాభపడినట్టు ఐహెచ్ఎస్ మార్కిట్ ప్రధాన ఆర్థికవేత్త పొలియానా డీ లిమా తెలిపారు. ఈ ఏడాది భవిష్యత్తు విషయంలో కంపెనీల్లో అనిశ్చితి నెలకొన్నట్టు లిమా పేర్కొన్నారు.

దివాలా చట్టంతో మెరుగ్గా రికవరీ

ఐబీబీఐ చీఫ్ ఎంఎస్ సాహూ

న్యూఢిల్లీ: దివాలా చట్ట ప్రక్రియ ద్వారా బాకీల రికవరీ మెరుగుపడిందని ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) చీఫ్ ఎంఎస్ సాహూ చెప్పారు. డిసెంబర్ నాటి దాకా బ్యాంకులు రూ. 1.6 లక్షల కోట్లు రాబట్టుకోగలిగినట్లు వివరించారు. దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా గతేడాది డిసెంబర్ దాకా 190 సంస్థలు గట్టెక్కాయని, ఈ కంపెనీలు దాదాపు రూ. 3.8 లక్షల కోట్లు బాకీ పడ్డాయని సాహూ చెప్పారు. సాధారణంగా ఆయా సంస్థల ఆస్తులను వేలం వేస్తే అసలు విలువ కంటే తక్కువే వచ్చేదని.. కానీ దివాలా కోడ్ కింద విక్రయించడం వల్ల 207% ఎక్కువ వచ్చిందని పేర్కొన్నారు.

ఏటీఎఫ్, వంట గ్యాస్ ధరలు తగ్గుదల

న్యూఢిల్లీ: విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరలు 10.3% తగ్గాయి. కోవిడ్-19 కారణంగా ముడి చమురు ధరలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఏటీఎఫ్ ధరను కిలోలీటర్‌కు రూ. 6,591 తగ్గించినట్లు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రకటించాయి. తాజా తగ్గింపుతో ఢిల్లీలో కిలోలీటర్ ధర రూ. 56,859కు తగ్గింది. క్రూడ్ ధరలు పతనంతో ఈ నెల ఒకటో తేదీన అమలయ్యేలా గతవారంలోనే రూ. 874 తగ్గించాయి. మరోవైపు సబ్సిడీ వర్తించని 14.2 కిలోల వంట గ్యాస్ ధరలను రూ. 858.50 నుంచి రూ. 805.50కి తగ్గించాయి. గడిచిన నెలరోజుల్లో సిలెండర్ ధర రూ. 144.50 మేర తగ్గింది. గృహ అవసరాల కోసం వినియోగించే సిలెండర్‌పై సబ్సిడీ రూ. 50 తగ్గి రూ. 240 వద్ద ఉంది.

1,000 కోట్ల డాలర్లకు వీసీ పెట్టుబడులు

- గత ఏడాది పెట్టుబడులతో పోల్చితే 55 శాతం అధికం
- ఈ ఏడాది మరింత జోరుగా ఈ పెట్టుబడులు

న్యూఢిల్లీ: భారత వెంచర్ క్యాపిటల్ ఇండస్ట్రీలో గత ఏడాది 1,000 కోట్ల డాలర్లు (రూ.72,000 కోట్లు)పెట్టుబడులు వచ్చాయి. అంతకు ముందు ఏడాది వచ్చిన పెట్టుబడులతో పోల్చితే ఇది 55 శాతం అధికం. వెంచర్ క్యాపిటల్ ఒప్పందాలు పెరగడం, ఈ డీల్స్ సగటు విలువ అధికంగా ఉండటం దీనికి కారణాలు. ఈ వివరాలను బెయిన్ అండ్ కంపెనీ రూపొందించిన ఇండియా వెంచర్ క్యాపిటల్ నివేదిక 2020 వెల్లడించింది. ఇండియన్ ప్రైవేట్ ఈక్విటీ అండ్ వెంచర్ క్యాపిటల్ అసోసియేషన్(ఐవీసీఏ)భాగస్వామ్యంతో బెయిన అండ్ కంపెనీ ఈ నివేదికను రూపొందించింది. ఈ నివేదిక ఇంకా ఏం చెప్పిందంటే..,

- గత ఏడాది డీల్స్ 30 శాతం పెరిగాయి.
- సగటు డీల్ సైజు 20 శాతం పెరిగింది.
- ఈ ఏడాది వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు మరింతగా పెరుగుతాయి.
- మొత్తం వెంచర్ క్యాపిటల్ పెట్టుబడుల్లో 80 శాతం వరకూ నాలుగు రంగాల్లోకే వచ్చాయి. కన్స్యూమర్ టెక్, సాఫ్ట్‌వేర్/సాస్, ఫిన్‌టెక్, బీ2బీ కామర్స్... ఈ రంగాల్లోకే అధికంగా పెట్టుబడులు వచ్చాయి.
- కన్స్యూమర్ టెక్ రంగంలోకి 35 శాతం మేర వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు వచ్చాయి. ఈ రంగంలోనే అత్యధికంగా వీసీ పెట్టుబడులు వచ్చాయి.
- భారత్‌లో ప్రస్తుతం 80,000 స్టార్టప్‌లు ఉన్నాయి. వీటిల్లో 8 శాతం స్టార్టప్‌లకు మాత్రమే నిధులు లభించాయి. వీసీ పెట్టుబడులు భారీగా అవసరమవుతాయని ఇది సూచిస్తోంది.

39 శాతం సబ్‌స్క్రైబయిన ఎస్‌బీఐ కార్డ్స్ ఐపీఓ

- ఈ నెల 5న ముగింపు
- ఇష్యూ సైజు రూ.10,355 కోట్లు
- 16న లిస్టింగ్



న్యూఢిల్లీ: ఎస్‌బీఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ ఐపీఓ(ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్) తొలి రోజు 39 శాతం సబ్‌స్క్రైబయింది. సోమవారం ప్రారంభమై ఈ నెల 5న ముగిసే ఈ ఐపీఓ ప్రైస్‌బాండ్‌ను రూ.750-755గా నిర్ణయించారు. ఈ ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.10,355 కోట్లు సమీకరిస్తుందని అంచనా. తొలి రోజు రిటైల్ ఇన్వెస్టర్ల కోటా 62 శాతం, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల వాటా 12 శాతం చొప్పున సబ్‌స్క్రైబయ్యాయి. కాగా 74 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి ఈ కంపెనీ రూ.2,769 కోట్లు సమీకరించింది. ఈ ఐపీఓలో భాగంగా రూ.500 కోట్ల విలువైన తాజా ఈక్విటీ షేర్లను జారీ చేస్తారు. వీటితో పాటు ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్) విధానంలో 13 కోట్ల ఈక్విటీ షేర్లను కూడా విక్రయిస్తారు. ఈ కంపెనీ షేర్లు ఈ నెల 16న స్టాక్ మార్కెట్లో లిస్టవుతాయి. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా కోటక్ మహీంద్రా క్యాపిటల్ కంపెనీ, యాక్సిస్ క్యాపిటల్, డీఎస్‌పీ మెరిల్‌లించ్, హెచ్ఎస్‌బీసీ సెక్యూరిటీస్ అండ్ క్యాపిటల్ మార్కెట్స్ (ఇండియా), నొమురా ఫైనాన్షియల్ అడ్వైజరీ అండ్ సెక్యూరిటీస్(ఇండియా), ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్ వ్యవహరిస్తున్నాయి. కాగా మొన్నటిదాకా రూ.300-320 రేంజ్‌లో ఉన్న గ్రే మార్కెట్ ప్రీమియమ్(జీఎమ్‌పీ) సోమవారానికి రూ.150కు పడిపోయిందని సమాచారం. తాజాగా రెండు కరోనా కేసులు వెలుగులోకి రావడంతో మన స్టాక్ మార్కెట్ భారీగా పడిపోవడమే దీనికి కారణమని విశ్లేషకులంటున్నారు.

రాష్ట్రీయం

పోలీసుల అదుపులో ముగ్గురు కంది రైతులు

మోత్కూరు: అనుమతి లేకుండా మార్కెట్ గేట్ తీసి కందుల బస్తాలను లోపలికి తీసుకువచ్చారన్న ఆరోపణలపై ముగ్గురు రైతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామానికి చెందిన రైతులు నర్సయ్య, సత్యనారాయణ, హరిశ్చంద్ర సోమవారం తెల్లవారు జామున ట్రాక్టర్లలో కందులను మోత్కూరు మార్కెట్‌కు తెచ్చారు. తాళం వేసి ఉండటంతో గేట్ సందులోంచి బస్తాలను మార్కెట్‌లోకి తీసుకెళ్లారు. అనుమతి లేకుండా గేట్ తీయడంతో వారిని అదుపులోకి తీసుకుని తర్వాత వదిలిపెట్టారు.

పప్పు డబ్బాలో బంగారం.. ఎత్తుకెళ్లిన కోతులు

రెబ్బెన (ఆసిఫాబాద్): దొంగలు ఇంట్లో చొరబడి బంగారం ఎత్తుకెళ్లినట్లు సాధారణంగా వింటుంటాం. కానీ.. కోతులు ఇంట్లో చొరబడి బంగారు నగలు ఎత్తికెళ్లిన విచిత్ర సంఘటన కుమురం భీం జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఓ ఉద్యోగి ఇంట్లో సోమవారం మధ్యాహ్నం కోతులు చొరబడి వంట గదిలో ఉన్న పప్పు డబ్బాలతో ఉడాయించాయి. అయితే.. ఆ డబ్బాలో సదరు ఉద్యోగి తల్లికి చెందిన రెండు తులాలు, కూతురుకు చెందిన తులం బంగారం చైన్ ఉన్నాయి. స్థానికుల సాయంతో చుట్టుపక్కల గాలించినా డబ్బాలు లభించలేదని వాపోయింది.

తేనెటీగల దాడిలో 34 మందికి గాయాలు

నెన్నెల (బెల్లంపల్లి): మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలోని కుశ్నపల్లి రేంజ్ కార్యాలయంలో సోమవారం తేనెటీగల దాడిలో 34 మంది గాయపడ్డారు. వీరిలో 28 మంది విద్యార్థులు, ముగ్గురు టీచర్లు, మరో ముగ్గురు అటవీ అధికారులు ఉన్నారు. సోమవారం నెన్నెల హైస్కూల్ విద్యార్థులు వనదర్శిని కార్యక్రమానికి బస్సులో జోగాపూర్ అడవికి వెళ్లారు. కార్యక్రమం అనంతరం మండల కేంద్రంలోని రేంజ్ కార్యాలయంలో భోజనాలు చేస్తుండగా పక్కనే ఉన్న చెట్ల పొదల్లో నుంచి తేనెటీగలు అకస్మాత్తుగా లేచాయి. మొత్తం 34 మంది గాయపడ్డారు. వారిని వెంటనే నెన్నెల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. వారి పరిస్థితి బాగానే ఉందని డాక్టర్ అనీష్ తెలిపారు.

గోవర్ధనగిరిధారిగా నృసింహుడు

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజైన సోమవారం వేకువ జామునే ఆలయంలో అర్చకులు నిత్యారాధనలు, ప్రభాతభేరి, శ్రీవిష్ణు సహస్రనామ పారాయణాలు చేశారు. అనంతరం 11.30 గంటలకు శ్రీస్వామివారిని గోవర్ధనగిరిధారి అలంకార సేవలో ఊరేగించారు. రాత్రి వేళ నారసింహుడు సింహవాహనంపై బాలాలయంలో భక్తులకు దర్శనమిచ్చాడు. అంతకు ముందు ఆలయంలో ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఈఓ గీతారెడ్డి, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రారంభించారు. -యాదగిరిగుట్ట

కన్నతండ్రే కర్కోటకుడు

రాధికను చంపింది తండ్రి కొమురయ్యే

- కూతురుకు ఆరోగ్య సమస్యలు..
- ఆర్థిక పరిస్థితులు ఊహించి హత్య
- నిందితుడి అరెస్టు

రాధిక, హత్య జరిగిన రోజు రోబిస్తున్న కొమురయ్య

కరీంనగర్ క్రైం: కన్నతండ్రే కర్కోటకుడిగా మారి కూతురును దారుణంగా హత్య చేశాడు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కరీంనగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని ముత్త రాధికను గొంతు కోసి చంపింది ఆమె తండ్రి కొమురయ్యేనని పోలీసులు నిర్ధారించారు. పోలీస్ కమిషనర్ వీబీ కమలాసన్ రెడ్డి సోమవారం ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. కమిషనర్ కథనం ప్రకారం.. కొమురయ్య హమాలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన కూతురు రాధిక చిన్ననాటి నుంచి పోలియోతో బాధపడేది. నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదివింది. గతంలో ఆమె వైద్యానికి తండ్రి రూ.6 లక్షలు ఖర్చు చేశాడు. ఆపరేషన్ తర్వాత కొద్దిరోజులు మాత్రమే యథావిధిగా నడిచిన రాధికకు మళ్లీ ఆరోగ్య సమస్యలు మొదలయ్యాయి. దీంతో భవిష్యత్‌లో వచ్చే ఆర్థిక పరిస్థితులను ముందే ఊహించిన కొమురయ్య.. తన కూతురుంటే ఇంకా ఖర్చులపాలు కావాల్సి వస్తుందని ఆమెను తుద ముట్టించాలని నిర్ణయించాడు. ఫిబ్రవరి 10వ తేదీ ఉదయం 9 గంటల ప్రాంతంలో ముఖంపై దిండు పెట్టి ఊపిరాడకుండా చేసి చంపాడు. బయటి వ్యక్తులపై అనుమానం వచ్చేలా గొంతు కోశాడు. ఇరుగుపొరుగు వారితో ఏమీ తెలియనట్లు మాట్లాడి తాను పనిచేసే గోదాముకు వెళ్లి పలువురికి ఫోన్ చేశాడు. తర్వాత సెల్ స్విచ్ఛాఫ్ చేసుకున్నాడు. సాయంత్రం ఇంటి పక్కన గల బాలుడు చూసి అందరినీ పిలవడంతో పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించి, జాగిలాలతో వెతికించినా ఫలితం దక్కలేదు.

8 బృందాలు.. 75 మంది పోలీసులు

అదే రోజు కొమురయ్య ఇంట్లో 99 వేల నగదు, 3 తులాల బంగారం పోయిందని ఫిర్యాదు చేసి కేసును పక్కదారి పట్టించాడు. కేసు దర్యాప్తుకు 8 బృందాలు ఏర్పాటు చేసి 75 మంది పోలీసులు దర్యాప్తును చేపట్టారు. హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం క్లూస్ టీం కూడా వచ్చింది. రాధిక తండ్రి బనియన్, చెప్పుల మీద ఆమె రక్తపు మరకలు ఉన్నట్లు గుర్తించింది. అప్పటికే వివిధ కోణాల్లో లోతుగా దర్యాప్తు చేసిన పోలీసుల నివేదిక వచ్చిన తర్వాత వారి అనుమానం నిజమైంది. అప్పటి నుంచి కొమురయ్య కదలికలు, గత చరిత్ర, అతని స్వభావం, దగ్గరి బంధువులను బృందం సభ్యులు విచారించారు. 21 రోజుల విచారణ అనంతరం పోలీసులు కొమురయ్యను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా.. కూతురు రాధికను తానే హత మార్చినట్లు అంగీకరించాడు. సమావేశంలో అడిషినల్ డీసీపీలు చంద్రమోహన్, శ్రీనివాస్ ల తదితరులు పాల్గొన్నారు.

దాయాదుల నుంచి భూమి ఇప్పించండి

కలెక్టర్ కారును అడ్డగించిన రైతు దంపతులు

జడ్చర్ల సెంటర్ (మహబూబ్‌నగర్): పెద్దల నుంచి సంక్రమించిన భూమిని దాయాదుల నుంచి ఇప్పించాలంటూ రైతు దంపతులు ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం దామాయపల్లికి చెందిన బోయ లక్ష్మమ్మ, బాలయ్య దంపతులు తమ సమస్యను అధికారులకు విన్నవించేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. రెవెన్యూ హాలు ఎదుట కలెక్టర్ వెంకట్రావ్ కారును అడ్డుకున్నారు. తమ పేరుపై ఉన్న 3.09 ఎకరాలను దాయాదుల నుంచి ఇప్పించాలని, లేకుంటే ఆత్మహత్య చేసుకోవడం ఒక్కటే శరణ్యమని పురుగుమందు డబ్బాను చూపించారు. స్పందించిన కలెక్టర్.. వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోయిలకొండ తహసీల్దార్‌ను ఆదేశించారు.

మౌంట్ కాస్‌కియాస్కో పర్వతాన్ని అధిరోహించిన దివ్యాంగుడు

చౌటుప్పల్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్‌కు చెందిన దివ్యాంగుడు శేఖర్‌గౌడ్ అరుదైన రికార్డు సృష్టించాడు. సోమవారం ఆస్ట్రేలియాలోని 2,228 మీటర్ల ఎత్తయిన మౌంట్ కాస్‌కియాస్కో పర్వతాన్ని అధిరోహించాడు. శేఖర్‌గౌడ్ తన సాహసయాత్రను గత నెల 28న సిడ్నీలో ప్రారంభించి.. సోమవారం సాయంత్రం పర్వతాన్ని అధిరోహించి లక్ష్యాన్ని చేరుకున్నాడు. పర్వతం పైన మన దేశ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాడు. కాగా, శేఖర్ గత ఏడాది ఆగస్టులో యూరప్‌లోని మౌంట్‌ఎల్‌బ్రస్‌ను, అక్టోబర్‌లో దక్షిణాఫ్రికాలోని కిలిమంజారో పర్వతాలను కూడా అధిరోహించాడు. కాగా, 2008లో పాలిటెక్నిక్ చదివే సమయంలో విద్యుదాఘాతానికి గురై శేఖర్ ఒక కాలు, చెయ్యి కోల్పోయాడు.

ట్రాన్స్‌కో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
టెండరు నోటీసు నం. e-Procurement No.25/2019-20/CE/Civil/TSTra/D.No. 433/19, Dt: 18.02.2020.
పని పేరు: "వరంగల్ అర్బన్ జిల్లాలో 220 KVSS వరంగల్ ప్రెమిసెస్‌లో బ్యాకప్ SLDC నిర్మాణం". పని సుమారు అంచనా విలువ: రూ.5,60,50,000.00. టెండరు స్పెసిఫికేషన్ నం. 25/2019-20 ఆఫ్ చీఫ్ ఇంజినీర్ / సివిల్, విద్యుత్ సౌధ, హైదరాబాద్. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది (ఆన్‌లైన్): 19.02.2020 సా.5.00 గం. తరువాత. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ముగింపు తేది (ఆన్‌లైన్): 10.03.2020 సా.04.00 గం. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం (ఆన్‌లైన్): 10.03.2020 సా.4.30 గం. వరకు. ప్రీ క్వాలిఫికేషన్ బిడ్ తెరుచు తేది: 10.03.2020 సా.04.45 గం. తరువాత. ధర బిడ్ తెరుచు తేది (ఫైనాన్షియల్ బిడ్ స్టేజ్): 12.03.2020 సా.4.00 గం. తరువాత. టెండరు కోరే అధికారి పేరు మరియు చిరునామా: చీఫ్ ఇంజినీర్/సివిల్, TS ట్రాన్స్‌కో, విద్యుత్ సౌధ, రూమ్ నం.105, 'A' బ్లాక్, ఖైరతాబాద్, హైదరాబాద్. ఫోన్: నం.లు. 040-23396000, Extn. 3202, 3354, 3352. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ @ www.tender.telangana.gov.in లో చూడవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్/సివిల్(I/C)
RO No: 54/19

SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LTD.
SHORT TENDER NOTICE
Tender Notice for Tender Specification No: T-19, 20 (Reserved for ST), 21, 22 & 23/19-20 (New) of SE/Op/Sangareddy. The Bid document will be available for Short Tender from Dt: 04.03.2020, Bid Document Sale end Dt: 12.03.2020 up to 17:00 Hrs, Submission of Bid Dt: 13.03.2020 up to 15:00 Hrs & Opening at 16:00 Hrs. The Tender details information can be obtained from website: www.tssouthernpower.com & http://tender.telangana.gov.in/. Phone: 08455-272518, Fax: 08455-277320.
Sd/- Superintending Engineer, Operation Circle, Sangareddy, TSSPDCL.
TENDER ID (SPDCLSGR01722)

తెలంగాణ ప్రభుత్వం
సాగునీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్, సంగారెడ్డి ఫోన్: 08455-270180
నెం. 23/2019-20 ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు తేది: 29.02.2020
మైనర్ ఇరిగేషన్ - సిద్దిపేట జిల్లా, సిద్దిపేట డివిజన్ నందు పిల్లివాగు పై గుగ్గిళ్ల గ్రామం వద్ద చెక్ డ్యామ్ నిర్మాణము గుగ్గిళ్ల (గ్రా), బెజ్జంకి (మం) - 1 పని కొరకు తేది: 04.03.2020 నుండి తేది: 10.03.2020 వరకు బిడ్లను ఆహ్వానించనైనది. పని అంచనా విలువ: రూ.338.02 లక్షలు. మిగతా వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ www.tender.telangana.gov.in వెబ్‌సైట్ నందు తేది: 04.03.2020 నుండి చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, నీటిపారుదల సర్కిల్, సంగారెడ్డి
DIPR Ro No: 767-PP/CL/Advt/1/2019-20, Dt: 02/03/2020

తెలంగాణ ప్రభుత్వం
జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల & వయోవృద్ధుల శాఖ, వరంగల్ (అ)
లేఖ నెం. 33/SAA/2019, ప్రకటన తేది: 26.02.2020
జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల శాఖ, రాంనగర్, హన్మకొండ, వరంగల్ అర్బన్ జిల్లాలో గల శిశుగృహ నందు పిల్లలు మరియు శిశువులు (6) సంరక్షణలో ఉంచబడినారు. పిల్లలు మరియు శిశువుల యొక్క చాయచిత్రములు దీనిలో ఉంచబడినాయి, ఈ ప్రచురణ తేది నుండి 30 దినములలోపుగా పిల్లలు మరియు శిశువుల యొక్క కన్న తల్లిదండ్రులు క్లెయిమ్ చేయుటకు తగు ఆధారములతో దగిన సంతకందారు గారిని సంప్రదించవచ్చు. అటుల కానిచో పిల్లలు మరియు శిశువులు విడిచివేసినవారుగా ప్రకటించబడి మరియు ప్రభుత్వముచే నిర్దేశించబడిన నిబంధనల ప్రకారముగా దత్తతకు ఇవ్వబడుదురు.
సుగ్గి (F) DOB: 18.04.2014 | రమేష్ (M) DOB: 15.08.2015 | జీవన్ (M) DOB: 15.08.2016 | వాసవి (F) DOB: 20.05.2014 | సాన్వి (F) DOB: 29.09.2018 | అఖిల్ (M) DOB: 22.06.2019
సం/- జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, దివ్యాంగుల & వయోవృద్ధుల శాఖ, వరంగల్ అర్బన్ జిల్లా
DIPR RO.No. 2570-DP/CL/ADVT/1/2019-20; Dt : 02.03.2020

తెలంగాణ ప్రభుత్వం
నీటిపారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
పర్యవేక్షక ఇంజినీరు వారి కార్యాలయం, ఇరిగేషన్ సర్కిల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
e-proc T.No.24 to 28/2019-20 తేది: 29.02.2020
పనుల సంఖ్య: (5), ప

కోవిడ్‌పై కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: కోవిడ్ వైరస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించి, ముందస్తు జాగ్రత్తలు తీసుకునేలా యూనివర్సిటీలు కార్యక్రమాలు నిర్వహించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి ఆదేశించారు. కోవిడ్ పాజిటివ్ కేసు తేలిన నేపథ్యంలో పక్కాగా చర్యలు చేపట్టాలని సూచించారు.

పీఆర్‌సీ కోసం 4న ధర్నా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు వద్ద ఈ నెల 4న ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ స్టేట్ రిటైర్డ్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ సెల్ చైర్మన్ బి.మోహన్‌రెడ్డి, కోచైర్మన్ పి.వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌సీతోపాటు డీఏ బకాయిలు మంజూరు చేయాలని, ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ రూపొందించి అమలు చేయాలని, 70 ఏళ్లు నిండిన వారికి క్వాంటమ్ పెన్షన్ మంజూరు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈ ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

13న చలో అసెంబ్లీపై సీఎస్‌కు నోటీసు

సాక్షి, హైదరాబాద్: పీఆర్‌సీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 13న చలో అసెంబ్లీ నిర్వహించతలపెట్టామని పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్టు ఉద్యోగుల ఐక్య వేదిక నోటీసు అందజేసింది. ఈ మేరకు సోమవారం వేదిక ప్రతినిధులు సదానంద్‌గౌడ్, చావ రవి, శ్రీనివాసులు సీఎస్‌ను కలిశారు. వెంటనే పీఆర్‌సీ నివేదిక తెప్పించుకొని అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సీఎం ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని ఈ చలో అసెంబ్లీ నిర్వహించనున్నట్లు వివరించారు.

రైతుల సమస్యలపై చర్చించండి: రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, రైతు బంధు పథకం అమలుపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయనను కలిసి విజ్ఞాపన పత్రం అందజేశారు. వాటితోపాటు రాష్ట్రంలో మహిళలు, బాలికలపై వేధింపులు, నీటి పారుదల ప్రాజెక్టుల్లో అవకతవకలు, ప్రభుత్వ ఆసుపత్రులు, హాస్టళ్లలో దుర్భర పరిస్థితులు, పీఆర్‌సీ అమలు, నిరుద్యోగుల సమస్యలు తదితర అంశాలపై చర్చించాలని కోరారు.

జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం

సింగరేణి పవర్‌'ఫుల్'!

- ఫిబ్రవరిలో సింగరేణి విద్యుత్ కేంద్రం రికార్డు
- స్థాపిత సామర్థ్యం మేరకు గరిష్ట విద్యుదుత్పత్తి
- రెండు యూనిట్లలో 100 శాతానికి పైగా పీఎల్ఎఫ్..
- రెండేళ్లలో ఇది మూడోసారి.. సంస్థ సీఎండీ శ్రీధర్ హర్షం

సాక్షి, హైదరాబాద్: సింగరేణి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్‌లో నిర్వహిస్తున్న 1,200 (2 x600) మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రం విద్యుదుత్పత్తిలో రికార్డు సృష్టించింది. ఈ విద్యుత్ కేంద్రానికి సంబంధించిన 600 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఫిబ్రవరిలో 100.18 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధించాయి. విద్యుత్ కేంద్రం స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యంతో పోలిస్తే ఓ నిర్దిష్ట కాలంలో జరిగిన వాస్తవ విద్యుదుత్పత్తిని సాంకేతిక పరిభాషలో పీఎల్ఎఫ్ అంటారు. ఫిబ్రవరిలో సింగరేణి విద్యుత్ కేంద్రం 836.70 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా, అందులో ప్లాంట్ నిర్వహణకు అవసరమైన విద్యుత్ పోను మిగిలిన 791.79 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను గ్రిడ్ ద్వారా రాష్ట్రానికి సరఫరా అయింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సింగరేణి ప్లాంట్ ఇప్పటివరకూ 8,398 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా 7,895 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను రాష్ట్రానికి సరఫరా చేసింది.

విడివిడిగా 15 సార్లు..

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని చెరో 600 మెగావాట్ల రెండు యూనిట్లు విడివిడిగా 15 సార్లు 100 శాతం పీఎల్ఎఫ్ సాధించాయి. 2వ యూనిట్ 9 సార్లు సాధించి అగ్రస్థానంలో ఉంది. 2017లో ఫిబ్రవరి, మే, నవంబర్, 2018లో జూలై, సెప్టెంబర్ అక్టోబర్, 2019లో జనవరి, ఫిబ్రవరి, 2020లో ఫిబ్రవరిలో రెండో యూనిట్ 100 శాతం పీఎల్ఎఫ్ సాధించింది. మరో 600 మెగావాట్ల ఒకటో యూనిట్ ఆరుసార్లు 100 శాతం పీఎల్ఎఫ్ సాధించింది. 2017లో ఏప్రిల్, డిసెంబర్, 2018లో సెప్టెంబర్, నవంబర్, 2019లో ఫిబ్రవరి, 2020 ఫిబ్రవరిలో రెండో యూనిట్ 100 శాతం పీఎల్ఎఫ్ సాధించింది.

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో 2016 సెప్టెంబర్ నుంచి వాణిజ్యపరంగా విద్యుదుత్పత్తి ప్రారంభించగా, గత ఫిబ్రవరి నాటికి 30,921 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. దీనిలో 29,056 మిలియన్ యూనిట్లను రాష్ట్ర అవసరాలకు సరఫరా చేయడం జరిగింది.

సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం గత రెండేళ్ల కాలంలో మూడు సార్లు 100 శాతం పీఎల్ఎఫ్ సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిం ది. 2018 సెప్టెంబర్‌లో 100.04 శాతం, 2019 ఫిబ్రవరిలో 100.05 శాతం పీఎల్ఎఫ్ సాధిం చగా, తాజాగా గత ఫిబ్రవరిలో 100.18 శాతం పీఎల్ఎఫ్ సాధించి పాత రికార్డులను అధిగమించింది. 2017-18లో జాతీయ స్థాయిలో అత్యధిక పీఎల్ఎఫ్ కలిగిన అత్యుత్తమ 25 థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఐదో స్థానాన్ని సాధించింది.

జాతీయ స్థాయిలో ఐదో స్థానం..

సీఎండీ శ్రీధర్ అభినందనలు..

థర్మల్ విద్యుత్ కేంద్రంలోని రెండు యూనిట్లు 100 శాతానికి పైగా పీఎల్ఎఫ్ సాధించడంపై సింగరేణి సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ఆనందం వ్యక్తం చేశారు. రానున్న కాలంలో కూడా ఇదే ఒరవడి కొనసాగించాలని సంస్థ ఉద్యోగులు, అధికారులకు అభినందనలు తెలిపారు.

ఎంత డిమాండున్నా సరఫరా

మంత్రి జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 15 వేల మెగావాట్లకు చేరినా, సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. ఎత్తిపోతల పథకాలు, వ్యవసాయ, గృహావసరాలకు కనెక్షన్లు పెరగడంతో వినియోగం పెరిగిందని వెల్లడించారు. కొత్తగా 40 లక్షల కనెక్షన్లు ఇవ్వడంతో విద్యుత్ డిమాండ్ రెండు రెట్లు పెరిగిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కు అదనంగా విద్యుత్ వాడకం ఉంటుందని సీఎం కేసీఆర్ ముందే హెచ్చరించారని, అందుకు అనుగుణంగానే విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపుపై ముఖ్యమంత్రితో చర్చించిన తర్వాత నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు. సోమవారం ఆయన ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల ద్వారా నీటి పంపిణీ, కాల్వలకు అవసరమైన మరమ్మతులపై ఇరిగేషన్ శాఖ అధికారుల తో సమీక్ష నిర్వహించారు. విద్యుత్ డిమాండ్ ఎంతకు చేరినా, పూర్తి స్థాయి సరఫరాకు తాము సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా మంత్రి తెలి పారు. కాళేశ్వరం ద్వారా గోదావరి నీళ్లు సూర్యాపేటకు వస్తాయా? అంటూ ప్రతిపక్ష నేతలు అవహేళన చేశారని, వారికి నీళ్లు తెచ్చి సమాధానమిచ్చామన్నారు.

మరమ్మతులు వెంటనే చేపట్టండి..

ఎస్సారెస్పీ రెండో దశ కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టాలని జగదీశ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయడం ద్వారా వర్షాకాలంలో గోదావరి జలాలు చివరి ఆయకట్టు వరకు చేరతాయన్నారు. డిస్ట్రిబ్యూటరీ-69, 70, 71ల కింద ఎప్పుడో తవ్విన కాల్వల నిర్మాణం లోపభూయిష్టంగా ఉందని, కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు విడుదల చేయడంతో ఈ విషయం బయటపడిందని చెప్పారు. ఈ దృష్ట్యా వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి స్థాయిలో నీరందించేందుకు కాల్వల మరమ్మతులు, ఇతరత్రా తవ్వకాలు చేపట్టేందుకు అవసరమైన అంచనాలు సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. కాలువల మరమ్మతులపై స్థానిక సంస్థల ప్రతినిధులు లేవనెత్తిన అనుమానాలు నివృత్తి చేయడంతో పాటు బయ్యన్న వాగు నుంచి విడుదల చేస్తున్న నీటి సామర్థ్యాన్ని పెంచే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. డిండి ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయని, త్వరలోనే దీనిపై ముఖ్యమంత్రి సమీక్షిస్తారని తెలిపారు. ఇక ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులకు సైతం అడ్వాన్సులు చెల్లించామని, సాంకేతిక ఇబ్బందుల వల్ల పనులకు ఆటంకం కలిగినా వాటినీ పరిష్కరిస్తామన్నారు.

పన్నుల వాటాలో 'మొండిచేయే'!

- ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా ఆదుకోని కేంద్రం
- ఈ ఏడాది కేంద్ర పన్నులు రూ. 14,348 కోట్లు

జనవరి పూర్తయ్యే నాటికి రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వివరాలు

ఆదాయ వనరు	అంచనా	వచ్చింది (రూ. కోట్లలో)
జీఎస్టీ	31,186.67	22,892.11
స్టాంపులు, రిజిస్ట్రేషన్లు	6,146	5,420.81
ల్యాండ్ రెవెన్యూ	5.39	0.77
అమ్మకపు పన్ను	21,972	15,981.36
రాష్ట్ర ఎక్సైజ్ డ్యూటీ	10,901	9,899.60
కేంద్ర పన్నుల వాటా	14,348.9	9,472.29
ఇతర పన్నులు, డ్యూటీలు	4,487.18	3,907.79
పన్నేతర రాబడులు	15,875.03	3,456.80
గ్రాంట్ ఇన్ ఎయిడ్	8,177.75	8,456.71
లోన్ల రికవరీ	44.86	50.47
అప్పులు	24,081.75	26,383.82
మొత్తం	1,37,226.53	1,05,922.53

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక సంవత్సరం ముగింపు దశకు చేరుకున్నా కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా రావడం లేదు. ఈ ఏడాది కేంద్ర పన్నుల వాటా కింద రూ. 14,348 కోట్లు వస్తాయనే అంచనాలో రాష్ట్ర ప్రభుత్వం ఉండగా అందులో జనవరి ముగిసే నాటికి 66 శాతమే వచ్చాయి. వాస్తవానికి 2019-20 బడ్జెట్‌లో కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటాను దాదాపు 18 శాతంగా రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. మొత్తం రూ. 14,348 కోట్లు వస్తాయనే అంచనా ఉండగా చివరి త్రైమాసికం ప్రారంభమయ్యే జనవరి ప్రారంభానికి రూ. 8,449.85 కోట్లను కేంద్రం ఇచ్చింది. ఇక చివరి త్రైమాసికంలో మిగిలిన రూ. 6 వేల కోట్లకుపైగా నిధులు రావాల్సి ఉంది. అంటే కనీసం నెలకు రూ. 2 వేల కోట్లయినా పన్నుల వాటా కింద రావాలి. కానీ జనవరిలో కేంద్ర పన్నుల వాటాలో కేవలం రూ. వెయ్యి కోట్లే మంజూరు చేసింది. దీంతో ఫిబ్రవరి, మార్చి నెలలకు కలిపి ఇంకో రూ. 5 వేల కోట్లు రావాల్సి ఉంది. అయితే ఈ రెండు నెలల్లో కేంద్రం నుంచి ఆ స్థాయిలో నిధులు రావడం కష్టమేనని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com